**التحذير من البدع والخرافات والرسوم الفاسدة**

في ضوء الكتاب والسنة الصحيحة (بلغة تلغو)

# ఇస్లాంలో
# అధర్మ కార్యాలు
## మరియు వాటి ప్రక్షాళన

కూర్పు

జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

# التحذير من البدع والخرافات والرسوم الفاسدة

في ضوء الكتاب والسنة الصحيحة (بلغة تلغو)

تأليف

ظفر الله خان الندوي

داعية /بجمعية إحياء التراث الإسلامي

فرع الجهراء – الكويت

**جمعية إحياء التراث الإسلامي**

مركز الهداية لتوعية الجاليات- فرع الجهراء – الكويت

Name of The Book : Bid’at-Kar yalu- &
wati park sha lana

Composition By :Zafarullah khan Nadvi

All Rights Reserved

Second Edition :2012

Price :

Copies :

Published by:

**Hidaya Guidance Center**
Post Box No: 1513
Jahra 01017- Kuwait
**Tel:**24550481-24552655- 24553655
**Fax:**24558953- 24552611

Design&Typeset By :Zafarullah khan Nadvi

بسم الله الرحمن الرحيم

الحمد لله والصلاة والسلام على سيدنا ونبينا وحبيبنا محمد رسول الله صلى الله عليه وسلم، وعلى آله وصحبه أجمعين...امابعد:

**﴿ كُنتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَتَنْهَوْنَ عَنِ الْمُنكَرِ وَتُؤْمِنُونَ بِاللَّهِ ﴾ آل عمران: ١١٠**

**''మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు.''**

(సూరతు ఆల ఇమ్రాన్:110)

**قال رسول صلى الله عليه وسلم : (إِنَّ اللَّهَ لَا يَقْبِضُ الْعِلْمَ انْتِزَاعًا يَنْتَزِعُهُ مِنْ الْعِبَادِ وَلَكِنْ يَقْبِضُ الْعِلْمَ بِقَبْضِ الْعُلَمَاءِ حَتَّى إِذَا لَمْ يُبْقِ عَالِمًا اتَّخَذَ النَّاسُ رُءُوسًا جُهَّالًا فَسُئِلُوا فَأَفْتَوْا بِغَيْرِ عِلْمٍ فَضَلُّوا وَأَضَلُّوا) .رواه البخاري ومسلم**

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''నిశ్చయంగా అల్లాహ్ మనుషుల హృదయాల నుండి జ్ఞానాన్ని తీయడు, కాని జ్ఞానులు (విద్వాంసులు) అంతరించిన కారణంగా జ్ఞానాన్ని తీసుకుంటాడు, ఈ విధంగా ఒక్క జ్ఞానవంతుడు కూడా మిగలడు. అప్పుడు ప్రజలు మూర్ఖుల్ని నాయకులుగా చేసుకుంటారు. వారితో ధార్మిక(తీర్పులు) కోరుతారు, వారు తమకు ధర్మజ్ఞానం లేక పోయిన ఫత్వాలు(తీర్పులు) ఇస్తారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గభ్రష్టత్వానికి గురిచేస్తారు''** (బుఖారీ, ముస్లిం).

بسم الله الرحمن الرحيم

# మున్నుడి

నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే సర్వ స్తోత్రములకు అర్హుడు. పొగడ్తలన్నీ ఆయన కోసమే. ఆయనతోనే మేము క్షమాపణ కోరుతున్నాము. మా హృదయాలలో కలిగే చెడులనుండి, మా పనులలో జరిగే చెడులనుండి అల్లాహ్ శరణు వేడుకుంటున్నాము. అల్లాహ్ ఎవరికి సన్మార్గం చూపుతాడో, వారికి ఎవరూ అపమార్గానికి తీసుకుపోలేరు. మరియు ఆయన ఎవరినైతే అపమార్గానికి గురిచేసాడో, వారిని సన్మార్గంపైకి ఎవరూ తీసుకు రాలేరు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు, ఆయన ఒక్కడే, ఆయనకు సాటి ఎవరూ లేరనీ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన దాసుడు మరియు ఆయన ప్రవక్తనని నేను సాక్ష్యం పలుకుతున్నాను.

ఇస్లాం పూర్వపు కాలం నుండి దేశ విదేశాలలో విస్తరించి ఉన్న బిత్అత్ కార్యాల, మూఢ విశ్వాసాల గురించి ధర్మ గురువులు నేటి అవసరందృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేస్తూనే వస్తున్నారు. మరియు వివిధ భాషల్లో వాటి గురించి పుస్తకాలు రచించుకుంటూ వస్తున్నారు. మన దేశంలో వ్యాపించి ఉన్న అనేక బిద్అత్ కార్యాల గురించి వివరంగా తెలియజేసే ప్రయత్నం చేసాము. మరియు మన ముస్లిం సోదరులు మోక్షమార్గంగా విశ్వసించి, అనుసరించే సత్యధర్మంలో చొరబడిన నూతన కల్పితాలను, మూఢ నమ్మకాలను, సామాజిక రుగ్మతలను సవరించుకొనుటకు ఇది ఒక చిన్న ప్రయత్నంగా భావిస్తున్నాము. ఇస్లాం ధర్మం పరిరక్షణ విషయంలో అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు మనపై బాధ్యతను

కూడా విధించారనేది వారి ఆజ్ఞల ద్వారా మనకు తెలుస్తున్నది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**﴿ كُنتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُونَ بِٱلْمَعْرُوفِ وَتَنْهَوْنَ عَنِ ٱلْمُنكَرِ وَتُؤْمِنُونَ بِٱللَّهِ ﴾ آل عمران: ١١٠**

**''మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు.''** (సూరతు ఆల ఇమ్రాన్:110)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**مَنْ رَأَى مِنْكُمْ مُنْكَرًا فَلْيُغَيِّرْهُ بِيَدِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِلِسَانِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِقَلْبِهِ وَذَلِكَ أَضْعَفُ الْإِيمَانِ (رواه مسلم:70 وابن ماجة:4013)**

**''మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే దాన్ని చేత్తో ఆపటానికి ప్రయత్నించండి. అంత శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించండి. అదీ చేయలేకపోతే కనీసం మనసులోనైనా దానిని చెడుగా భావించండి. ఇది విశ్వాసపు అత్యల్ప స్థాయి.''** (ముస్లిం:70, ఇబ్ను మాజా:4013)

**''అల్ బిద్అతు వ అసరుహస్ సయ్యివు అలల్ ఉమ్మ''** అనే పేరులో **అబూ ఉసామా సులైమ్ అల్ హిలాలి** గారు, **''అఖీదతుద్ తౌహీద్''** పుస్తకంలో **బిద్అత్ విధి విధానాల** గురించి **షేఖ్ సాలెహ్ బిన్ ఫౌజాన్ అల్ ఫౌజాన్** గారు అరబీ భాషలో గ్రంథస్తం చేసారు. ఈ రెండు పుస్తకాల వెలుగులో మేము మీ కొరకు బిద్అత్ విధి విధానాల గురించి తెలుగు భాషలో అనువాదం చేసాము.

మరియు ముస్లిం సమాజంలో పెరుగుతున్న నూతన పండుగలు, మూఢ నమ్మకాలు, నూతన కార్యాల గురించి, వాటి చెడు ప్రభావం గురించి అప్రమత్తంగా ఉండాలని **''ఇస్లాంలో అధర్మ కార్యాలు మరియు వాటి ప్రక్షాళన''** పేరున ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసుల ఆధారంగా ఈ పుస్తకాన్ని కూర్పు చేసాము. దాని వలన సమాజంలో ధర్మం పేరుతో జరుపుకునే నూతన కార్యాలు ధర్మమా లేక అధర్మమా? అన్న వాస్తవాలు మీకు అట్టే అర్థమైపోతాయి. **''వమా అలైనా ఇల్లల్ బలాగుల్ ముబీన్''.**

అనేక మంది సోదరులు అనువాద దోషాలను సరిదిద్ది నాకు సహాయం చేసారు. అల్లాహ్ వారందరికీ మంచి ప్రతి ఫలాన్ని ప్రసాదించుగాక. మరియు అల్లాహ్ మన అందరికీ షిర్క్ మరియు బిద్అద్ కార్యాల నుండి దూరంచేసి, నిజమైన, ధర్మపరమైన జ్ఞానం మరియు సున్నతులకు అనుగుణంగా విధేయతను పాటించువారిలో చేర్చుగాక. మరియు మన అందరికీ రుజు మార్గంపై నడుచుకొనే శక్తిని, సద్బుద్ధిని ప్రసాదించుగాక , ఆమీన్.

జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

**తిరుపతి**

20/05/2011

## విషయ సూచిక   పేజి


| | | |
|---|---|---|
| 1 | ఇస్లామీయ విధేయతా విధానం | 12 |
| 2 | మంచి వైపుకు పిలుపునివ్వడం మరియు చెడుల నుంచి వారించడం విధి | 17 |
| 3 | బిద్అత్ (నూతన పోకడలు) | 21 |
| 1 | ఇస్లామీయ పరిభాషలో బిద్అత్ అంటే? | 22 |
| 2 | బిద్అత్ విధాలు | 25 |
| 3 | ముస్లిం సమాజంలో నూతన వర్గాల పూర్వపరాలు | 26 |
| 4 | ముస్లిం సమాజం నూతన పోకడలుకు గురికాబడిన కారణాలు | 28 |
| 5 | ఆరాధన పరంగా బిద్అత్ రెండు విధాలు | 32 |
| 4 | సమాజంలో ప్రసిద్ధి చెందిన నూతన పోకడలు | 35 |
| 1 | ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం లేక ఆయన పేరుతో సంభందించిన ఇతర అధర్మ ఉత్సవాలు | 36 |
| 2 | ప్రత్యేక స్థలాల్లో, ప్రత్యేక వస్తువుల ద్వారా మరియు పుణ్యాత్ముల సమాధుల వద్ద శుభాలను (తబర్రుక్) కాంక్షిస్తూ చేసే ఆరాధనలు | 41 |
| 3 | ధర్మ పరంగా ఉన్న ఆరాధనలలో కొన్ని నూతన కార్యాలను జోప్పించి ఆరాధించడం | 45 |

| | | |
|---|---|---|
| 5 | ముహర్రం నెల వాస్తవికత | 52 |
| | ముహర్రం నెల విశిష్టత | 52 |
| | ముహర్రం నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం | 53 |
| | అహ్లెబైత్ (ప్రవక్త (స)ఇంటివారి) విశిష్టత | 55 |
| | హజ్రత్ హసన్ మరియు హుసైన్ (రజియల్లాహు అన్హుమా) విశిష్టత | 57 |
| | కర్బలా సంఘటన | 57 |
| | కర్బలా సంఘటనానంతరం | 59 |
| | మరణానంతరం భాధను తెలిపే ధర్మ విధానం | 62 |
| | అతిశయిల్లటం (హద్దు మీరటం) | 63 |
| | ముహర్రం నెలలో అధర్మ ఆచారాలు | 64 |
| 6 | నెల్లూరు రొట్టెల పండుగ | 67 |
| 7 | సఫర్ నెల వాస్తవికత | 71 |
| 8 | ఆఖరి చహార్షుంబా | 73 |
| 9 | శకునాలు ధర్మ పరిధిలో | 75 |
| 10 | రజబ్ నెల వాస్తవికత | 79 |
| 11 | రజబ్‌కే కుండే | 81 |

12 మేరాజున్ నబీ పండుగ 83

13 పవిత్రమైన మేరాజ్ సంఘటన వాస్తవం 85

14 షాబాన్ నెల వాస్తవికత 88

షాబాన్ నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం 88

షాబాన్ 15 వ రోజు తరువాత ఉపవాసం పాటించడం నిషిద్ధం 89

షాబాన్ 15వ రోజు కొన్ని బిద్అత్ కార్యాల వాస్తవికత 90

షాబాన్ 15వ రోజు గురించి కొన్ని నిరాధారమైన హదీసులు 92

15 'వసీలా' ధర్మ పరిధిలో 94

అధర్మమైన 'వసీలా' 98

16 ఉరుసుల వాస్తవికత 100

దర్గాల అలంకరణ 100

ఉరుస్ ఆచారాలు 101

దర్గాల గురువులు మరియు వారి వాస్తవికత 102

ఇస్లాం ధర్మంలో సమాధుల కట్టడాలు, వాటిపై ముజావర్లుగా కూర్చోవటం నిషిద్ధం 104

| | | |
|---|---|---|
| | సమాధుల ఆరాధన | 105 |
| 17 | తావీజు మరియు మంత్రించడం ధర్మ పరిధిలో | 109 |
| | తావీజు అర్థం | 110 |
| | తావీజులు (తమీమా) వేసుకోవడం నిషిద్ధం | 111 |
| 18 | మంత్రించడం (రుఖా) ధర్మం | 114 |
| | మంత్రించుటకై కొన్ని సూరాలను మరియు ఆయతులను, దుఆలను చదవడం ధర్మ సాంప్రదాయం | 116 |
| 19 | చేతబడి మరియు ఇంద్రజాలం వాస్తవికత | 118 |
| 20 | మాంత్రికులు మరియు జ్యోతిష్కులు | 121 |
| 21 | సమాజంలో విస్తరించిన కొన్ని బిద్అత్ కార్యాలు | 125 |
| 22 | ఇస్లాం ధర్మానికి సంబంధంలేని కొన్ని పండుగలు | 129 |
| | ప్రేమికుల రోజు | 129 |
| | ముస్లింలు వాలెంటైన్స్ డే ఎందుకు చేయకూడదు? | 130 |
| | ప్రేమంటే ఇదేనా...? | 131 |
| | అల్లాహ్ పట్ల ప్రేమంటే...? | 134 |
| | ఈ నాడు మనం.... | 135 |

# 1 - ఇస్లామీయ విధేయతా విధానం

ఇస్లాం ధర్మం మానవునికి పరిపూర్ణమైన జీవన శైలి. దీనిని అల్లాహ్ తన దాసుల కొరకు ప్రత్యేకించి, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిపై అవతరింపజేసి, సర్వమానవాళి కొరకు ఆయనను ఆదర్శంగా ఎన్నుకున్నాడు. కనుక ప్రజలందరూ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని మరియు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ఆయనే మనందరికీ సర్వ విధాలా ఆదర్శప్రాయుడు. అంటే; ఆయన ప్రవచనాలు, ఆచరణలు, వ్యవహారాలన్నీ ముఖ్యంగా ముస్లింల కొరకు ఆదర్శప్రాయం. అవి ఆరాధనలకు సంబంధించినవైనా, ససామాజిక నియమాలకు సంబంధించినవైనా, ఆర్థికపరమైనవైనా, రాజకీయ సంబంధమైనవైనా వాటిని ముస్లింలు అనుసరించటం అవశ్యం. జీవితపు అన్ని రంగాలలోనూ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సున్నతులు అనుసరణీయమైనవి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ لَّقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ ٱللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُوا ٱللَّهَ وَٱلْيَوْمَ ٱلْءَاخِرَ وَذَكَرَ ٱللَّهَ كَثِيرًا ﴾ الأحزاب: ٢١

**''నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది. అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.''** (సూరతుల్ అహ్‌జాబ్:21)

మరియు అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ ٱللَّهَ فَٱتَّبِعُونِي يُحْبِبْكُمُ ٱللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَٱللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴾ آل عمران: ٣١

**(ఓ ప్రవక్తా!) ఇలా అనంది: ''మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే, మీరు నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు.''**

(సూరతు ఆల ఇమ్రాన్: 31)

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ وَمَآ ءَاتَىٰكُمُ ٱلرَّسُولُ فَخُذُوهُ وَمَا نَهَىٰكُمْ عَنْهُ فَٱنتَهُوا۟ ﴾ الحشر: ٧

**''దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని పుచ్చుకోండి. ఆయన నిషేధించిన వాటి జోలికి పోకండి.''** (సూరతుల్ హష్ర్:7)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన జాతి ప్రజలకు ధర్మపరంగా మరియు పుణ్యపరంగా చేయవలసిన ప్రతి విషయం గురించి తెలియజేసారు. కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:

**عَنْ عَبْد الله بْنِ مَسْعُوْد، رَضِيَ الله عَنْهُ قَالَ: قَالَ رَسُوْلُ الله صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ: إِنَّهُ لَيْسَ شَيْءٌ يُقَرِّبُكُمْ مِنَ النَّارِ وَيُبَاعِدُكُم عَنِ الْجَنَّة إِلاَّ وَقَدْ نَهَيْتُكُمْ عَنْهُ، وَإِنَّهُ لَيْسَ مِنْ شَيْءٍ يُدْنِيْكُمْ مِنَ الْجَنَّةِ وَيُبَاعِدُكُمْ مِنَ النَّارِ إِلاَّ وَقَدْ أَمَرْتُكُمْ بِهِ،....(السلسلة الصحيحة:2866)**

''నిశ్చయంగా స్వర్గానికి దగ్గర చేర్చే, నరకానికి దూరం చేసే ఏ ఒక్క విషయాన్ని వదలకుండా, వాటన్నిటి గురించి నేను మీకు తెలియజేసాను. మరియు నరకానికి దగ్గర చేర్చే, స్వర్గానికి దూరం చేసే ఏ ఒక్క విషయాన్ని వదలకుండా, వాటన్నిటి గురించి నేను మీకు హెచ్చరించాను''....

(సిల్‌సిలతుస్ సహీహా లిల్ అల్బానీ: 2866)

ముస్లింల విధి విధానాల కొరకు ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయమే అతి ప్రమాణబద్ధకం. ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ప్రామాణికమైన ఆధారాలతో వచ్చిన ఆజ్ఞలన్ని, విధానాలన్ని సంపూర్ణమైన ఇస్లాం ధర్మానికి చెందినవి. మిగిలిన పోకడలన్ని ఇస్లాం ధర్మానికి సంబంధించినవి కావు. **కనుక ఎవరైన ధర్మంగా తలపోసి నూతన విషయాలను, నూతన ఆరాధన విధానాలను పాటిస్తే, లేక నిరాధారమైన హదీసులను ధర్మంగా భావించి అనుసరిస్తే, అవి అధర్మంగా ఎంచబడతాయి.**

కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)  ఇలా హెచ్చరించారు:

**إنَّ أَصْدَقَ الْحَدِيث كتَابُ اللَّه وَأَحْسَنَ الْهَدْي هَدْيُ مُحَمَّد وَشَرُّ الْأُمُور مُحْدَثَاتُهَا وَكُلُّ مُحْدَثَة بِدْعَةٌ وَكُلُّ بِدْعَة ضَلَالَةٌ وَكُلُّ ضَلَالَة فِي النَّار...(إبن خزيمة، صحيح الجامع: 1353)**

**''వాక్యాలలో అన్నిటికంటే సత్యమైన వాక్యం అల్లాహ్ గ్రంథం(ఖుర్ఆన్). మరియు మార్గాలన్నిటిలోకి అతి ఉత్తమమైన మార్గం ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) **మార్గం. మరియు ఆచారాలలో అతి చెడు ఆచారం క్రొత్త ఆచారాలు, మరియు ప్రతి క్రొత్త ఆచారం బిద్అత్, ప్రతి బిద్అత్ మార్గవిహీనమైనది. మరియు ప్రతి మార్గవిహీనత నరకానికి తీసుకువెళ్ళుతోంది. ...** (ఇబ్ను ఖుజైమా, సహీహుల్ జామే:1353).

బిద్అత్ కార్యాలు సమాజంలో ప్రసిద్ధి చెందుటకు ముఖ్య కారణం అజ్ఞానం. నూతన పోకడలు, పుణ్యాత్ముల పట్ల అతిశయిల్లటం మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) విధానానికి మించి సత్కార్యాలను చేయాలనే భావంతో **బిద్అత్ కార్యాలు** విస్తరించాయి.

కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతిశయిల్లటం గురించి ఇలా హెచ్చరించారు:

**وَإِيَّاكُمْ وَالْغُلُوَّ فِي الدِّينِ فَإِنَّمَا أَهْلَكَ مَنْ كَانَ قَبْلَكُمْ الْغُلُوُّ فِي الدِّينِ (أخرجه النسائي و البيهقي و أحمد ( 1 / 215 و 247 ) بسند صحيح ، صحيح ابن ماجة : 3029 )**

**''జాగ్రత్తా! మీరు ధర్మం విషయంలో అతిశయిల్ల (హద్దుమీరి ప్రవర్తించ) కండి. నిశ్చయంగా మీకంటే ముందు జాతులు ధర్మం విషయంలో అతిశయిల్లటం వల్లనే నాశనమయ్యాయి''** (అహ్మద్, ఇబ్నుమాజా:3029).

మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ఇలా హెచ్చరించారు:

**النَّبِيَّ صَلَّى اللَّهُ عَلَيْه وَسَلَّمَ يَقُولُ: لَا تُطْرُونِي كَمَا أَطْرَتِ النَّصَارَى ابْنَ مَرْيَمَ فَإِنَّمَا أَنَا عَبْدُهُ فَقُولُوا عَبْدُ اللَّهِ وَرَسُولُهُ . (رواه البخاري:3189)**

**''మీరు నన్ను పొగడటంలో హద్దు మీరకండీ, ఎలాగైతే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా(అలైహిస్సలాం) గారి పట్ల హద్దుమీరి పొగడ్తల్లో ముంచారో! నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడను మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి.''**

(బుఖారీ: 3189)

కాని విచారకరమైన విషయం ఏమిటంటే? ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంత హెచ్చరించినప్పటికీ ముస్లిం సమాజంలోని కొందరు ఈ **'అతి'**కి దూరంగా ఉండలేకపోయారు. యూదలు మరియు క్రైస్తవు సమాజాల వలే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పేరుతో అనేక రకాల **(ప్రవక్తను లేక పుణ్యాత్ములను మొరపెట్టుకోవటం వంటి)** ఆరాధనలు మరియు **(మీలాదున్ నబీ, మేరాజున్ నబీ వంటి)** ఉత్సవాలు మన ముస్లిం సమాజంలో వ్యాప్తి చెందాయి. మరియు అనేక మంది ప్రజలు బిద్అత్ కార్యాలు పాటించే గురువులను, ఇమాములను, మరియు పీర్, ముర్షద్లను మూర్ఖంగా అనుసరిస్తున్నారు. మరియు అనేక పోకడలను ధర్మంగా భావించి పాటిస్తున్నారు.

**కొంత మంది ముస్లిమేతర సమాజాల్లో వ్యాపించి ఉన్న మూఢ నమ్మకాలకు, దేశ విదేశాలలో ముస్లిమేతరులు పాటించే కొన్ని విధానాలకు అనుగుణంగా అనుసరించటం పరిపాటయ్యింది. మరియు అనేక మంది ముస్లిములు సమాజంలో పెరుగుతున్న దుష్కృతి మోజులో పడి అధర్మ విధానాలను కూడా ధర్మంగానే పాటిస్తున్నారు.**

అలాంటి వారిని అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విధేయతను పాటించమని కోరితే వారి వితండవాదం ఎలా ఉంటుందో ఖుర్ఆన్లో వర్ణించడం జరిగింది:

﴿وَإِذَا قِيلَ لَهُمْ تَعَالَوْاْ إِلَىٰ مَآ أَنزَلَ ٱللَّهُ وَإِلَى ٱلرَّسُولِ قَالُواْ حَسْبُنَا مَا وَجَدْنَا عَلَيْهِ ءَابَآءَنَآ ۚ أَوَلَوْ كَانَ ءَابَآؤُهُمْ لَا يَعْلَمُونَ شَيْـًٔا وَلَا يَهْتَدُونَ ﴿١٠٤﴾ يَـٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ عَلَيْكُمْ أَنفُسَكُمْ ۖ لَا يَضُرُّكُم مَّن ضَلَّ إِذَا ٱهْتَدَيْتُمْ ۚ إِلَى ٱللَّهِ مَرْجِعُكُمْ جَمِيعًا فَيُنَبِّئُكُم بِمَا كُنتُمْ تَعْمَلُونَ ﴿١٠٥﴾﴾
**المائدة: ١٠٤ ـ ١٠٥**

''అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాల వైపుకు, ప్రవక్త వైపుకు రండి'' అని వారితో అన్నప్పుడు, 'మా తాత ముత్తాతలు అవలంభిస్తూ ఉండగా మేము చూసిన విధానమే మాకు చాలు' అని వారంటారు. ఏమిటి? వారి తాతముత్తాతలకు ఏమీ తెలియకపోయినప్పటికీ, వారు సన్మార్గంలో నడవనప్పటికీ వీరు వాళ్లనే అనుసరిస్తారా? – ఓ విశ్వసించిన వారలారా! మీరు మీ గురించి జాగ్రత్త పడండి. మీరు గనుక సన్మార్గంలో నడుస్తున్నట్లయితే దారి తప్పినవారు మీకు ఎలాంటి నష్టం కలిగించజాలరు. మీరంతా అల్లాహ్ వద్దకే మరలి పోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు చేసిన కర్మలన్నిటినీ మీకు తెలుపుతాడు.(సూరతుల్ మాయిదా: 104-105)

**నిజమైన ధర్మానికి అనుగుణంగా అనుసరించకుండా ప్రజలు విముఖత చూపితే, ఇస్లాం ధర్మానికి వాటిల్లే నష్టం ఏమిలేదు. నష్టపోయేది ప్రజలే.** కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿وَمَن يَعْصِ ٱللَّهَ وَرَسُولَهُۥ وَيَتَعَدَّ حُدُودَهُۥ يُدْخِلْهُ نَارًا خَـٰلِدًا فِيهَا وَلَهُۥ عَذَابٌ مُّهِينٌ ﴿١٤﴾﴾ **النساء: ١٤**

మరియు ''ఎవడైతే అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు అవిధేయుడై ఆయన నియమాలను ఉల్లంఘిస్తాడో! అలాంటివాడు నరకాగ్నిలోకి త్రోయబడుతాడు, అందులో అతడు శాశ్వతంగా ఉంటాడు. మరియు అతనికి అవమానకరమైన శిక్ష ఉంటుంది.'' (సూరతున్ నిసా:14)

# 2- మంచి వైపుకు పిలుపునివ్వడం మరియు చెడుల నుంచి వారించడం విధి

మానవత్వం గల కలిగిన ప్రతి మనిషి మంచిని బోధించాలి మరియు చెడు నుండి హెచ్చరించాలి. మన సమాజంలో అనేక మంది చెడు గురించి చెప్పాలన్నా లేక ఎత్తి చూపాలన్నా మనకెందుకులే అన్న భావంతో తప్పుకుంటారు. లేదా ఎవరు ఎలా పోయినా మనకెందుకులే అని నడుచుకుంటారు. చివరికి ఆ చెడు ప్రభావం మొత్తం సమాజంపై పడుతుంది.

ధర్మ పరంగా ఉన్న విషయాలను బోధించడం మహా పుణ్య కార్యం. అలాగే ధర్మానికి వ్యతిరేకంగా ఉన్న షిర్క్ మరియు బిద్అత్ కార్యాలకు పాల్పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడం కూడా పుణ్య ప్రదమే. ఎందుకంటే? షిర్క్ మరియు బిద్అత్ కార్యాలు మన విశ్వాస జీవితాన్ని మరియు మన పుణ్యాలన్ని నాశనం చేస్తాయి. వాటి కారణంగా ప్రజలు నరకానికి ఆహుతి అవుతారు. కనుక ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ وَلْتَكُن مِّنكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ ۚ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿١٠٤﴾ ﴾ آل عمران: ١٠٤

**‘‘మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసే వారే సాఫల్యాన్ని పొందుతారు.’’** (సూరతు ఆల ఇమ్రాన్:104)

హజ్రత్ హుజైఫా బిన్ అల్ యమాన్(రజియల్లాహు అన్హు) గారు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో చెడుల గురించి అడిగి తెలుసుకొని వాటికి దూరంగా ఉండేవారు. కనుక ఆయన ఇలా తెలియజేసారు:

**كَانَ النَّاسُ يَسْأَلُونَ رَسُولَ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ عَنْ الْخَيْرِ وَكُنْتُ أَسْأَلُهُ عَنْ الشَّرِّ مَخَافَةَ أَنْ يُدْرِكَنِي**. (رواه البخاري:3338)

ప్రజలు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో మంచి విషయాల గురించి అడిగేవారు. కాని నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో **''చెడు విషయాల గురించి అడిగి తెలుసుకొనేవాడిని. ఎక్కడ నేను చెడు విషయాలకు గురికాబడతాననే భయంతో అలా చేసేవాణ్ణి.''**

(బుఖారీ:3338)

ఆరాధనలకై **'సున్నత్'** విషయాల పట్ల అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో, బిత్అత్ విషయాల పట్ల జ్ఞానవంతులుగా ఉండటం కూడా అంతే ముఖ్యం. ఎలాగైతే తౌహీద్ గురించి జ్ఞానం కలిగి ఉండటం ముఖ్యమో, షిర్క్ గురించిన జ్ఞానం కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం.

కనుక అల్లాహ్ ప్రవక్తలను అవతరింపజేసిన ముఖ్య కారణాన్ని ఇలా తెలియజేసాడు:

**﴿ فَمَن يَكْفُرْ بِٱلطَّٰغُوتِ وَيُؤْمِنۢ بِٱللَّهِ فَقَدِ ٱسْتَمْسَكَ بِٱلْعُرْوَةِ ٱلْوُثْقَىٰ لَا ٱنفِصَامَ لَهَا ۗ وَٱللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿٢٥٦﴾ ﴾ البقرة: ٢٥٦**

**''కనుక ఎవరయితే వేరితర ఆరాధ్యులను (తాగూత్‌ను) తిరస్కరించి అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమైన కడియాన్ని పట్టుకున్నారు. అది ఎన్నటికీ తెగదు. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.''** (సూరతుల్ బఖరా:256)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని చెప్పి, తరువాత అల్లాహ్‌ను మినహా ఇతర ఆరాధ్యులను తిరస్కరిస్తారో, అతని ధనం, అతని రక్తం **(ప్రాణం)** సురక్షితం. మరియు అతని లెక్కాచారం అల్లాహ్ అధీనంలో ఉంటుంది.'' (ముస్లిం).

ఖుర్ఆన్ ఆయతులోను మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనం ద్వారా స్పష్టమయ్యేదేమంటే? మనిషి అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత మిథ్యాదైవాలను తిరస్కరించాలి. అదే విధంగా మనం ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాలను తెలుసుకున్న తరువాత బిద్అత్ కార్యాల అనుసరణ నుండి అప్రమత్తంగా ఉండవలసిన బాధ్యత కూడా మనపైనే ఉంది. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**''మీరు నా 'సున్నత్'ను ఖచ్చితంగా పాటించండి, మరియు రుజు మార్గంపై నడుచుకున్న 'ఖులఫావుర్ రాషిదూన్' మార్గాన్ని పాటించండి. అదే మార్గంపై స్థిరంగా ఉండండి. మరియు ధర్మంలో బిద్అత్ ఆచారాలకు పాల్పడకండి. నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గవిహీనమైనది.''**

(అబూదావూద్:4607, తిర్మీజీ:2676, ఇబ్నుమాజా:114, అహ్మద్)

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసం (ధర్మం) అపరిచిత పరిస్థితుల్లో ప్రారంభమయింది. తిరిగి ఆ అపరిచిత పరిస్థితికే పునరావృతమవుతాది. ఆ నాటి అపరిచితులకు శుభవార్త!'' అని అన్నారు. వారెవరూ అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని కొందరు అడిగారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం):

''నా తరువాత ప్రజలు చెరిపివేసిన నా సాంప్రదాయాన్ని పునరుద్ధరించేవారు'' అని అన్నారు. (సిల్‌సిలతుస్ సహీహా:1273)

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**مَنْ رَأَى مِنْكُمْ مُنْكَرًا فَلْيُغَيِّرْهُ بِيَدِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِلِسَانِهِ فَإِنْ لَمْ يَسْتَطِعْ فَبِقَلْبِهِ وَذَلِكَ أَضْعَفُ الْإِيمَانِ (رواه مسلم :70)**

''మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే దాన్ని చేత్తో ఆపటానికి ప్రయత్నించండి. అంత శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించండి. అదీ చేయలేకపోతే కనీసం మనసులోనైనా దానిని చెడుగా భావించండి. ఇది విశ్వాసపు అతి బలహీన స్థాయి.''(ముస్లిం:70)

అంటే; ప్రవక్త  యొక్క ఆదేశాల ప్రకారం షిర్క్, మరియు బిద్అత్ వంటి అధర్మ కార్యాల గురించి ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూనే ఉండాలి. ప్రజలు చెరిపివేసిన ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాన్ని ఖుర్ఆన్, ప్రామాణికమైన హదీసుల ఆధారంగా బోధిస్తూనే ఉండాలి. ఎవరు ఎన్ని విధాల ఆటంకాలు సృష్టించినా, ఎన్ని విధాలుగా బాధించినా వారితో భయపడి తమ ధర్మ కర్తవ్యాన్ని నిర్వహించడం మానుకోరాదు.

ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)  ఇలా తెలియజేసారు:

**إنَّ النَّاس إذا رَأَوا مُنْكَراً فَلَمْ يُغيّروه ، يُوشِكُ أن يَعُمَّهُمُ اللَّهُ بِعِقَابِهِ (رواه أحمد، ابن ماجه، والترمذي:2168– ابوداود:4338 )**

**''చెడు జరుగుతున్నప్పుడు ప్రజలు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తే, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేయకపోతే అల్లాహ్ వారిని తన శిక్షకు గురిచేసే సమయం దగ్గర పడిందనుకోండి.''**

(ముస్నద్ అహ్మద్, తిర్మిజీ:2168, అబూదావూద్:4338)

# 3- బిద్‌అత్ (నూతన పోకడలు)

అరబీ నిఘంటువులో **'బిద్‌అత్'** పదానికి రెండు అర్థాలున్నాయి.

**1,** ఎన్నడులేని ఒక విషయం క్రొత్తగా ఉనికిలోకి రావడం. ''ఖుల్ మాకున్తు **బిద్‌అన్** మినర్ రుసులి'' (వారితో ఇలా అను: ''నేను **మొట్టమొదటి** ప్రవక్తనేమి కాను.'' (సూరతుల్ అహ్‌ఖాఫ్:9)

అంటే; అల్లాహ్ వైపునుండి క్రొత్తగా పంపబడిన ప్రవక్తనేమీ కాను. ఎలాగైతే ఇంతకముందు ప్రవక్తల పరంపర ఉన్నదో, అలాగే నేను కూడ పంపబడిన ఒక ప్రవక్త అనే విషయాన్ని తెలియజేశారు.

ఒకవ్యక్తి ముందులేని విషయాన్ని క్రొత్తగా ప్రారంభించినట్లయితే; దానిని **''ఇబ్తదా''** అంటారు. అంటే; క్రొత్తగా ప్రారంభించాడు, మొట్ట మొదటిగా చేసాడు. కనుక అల్లాహ్ ఈ భూమ్యాకాశాల గురించి ఇలా తెలియజేసాడు: ''**బదీవుస్** సమావాతి వల్ అర్ది'' (ఆయనే ఆకాశాలనూ మరియు భూమినీ ఏ నమూనా లేకుండా **ఆరంభించినవాడు**)

(అల్‌బఖరా:117)

**2, రెండవ అర్థం:** అలసట, నీరసం, తగ్గటం అనే అర్థాలున్నాయి. అరబ్బులో ఒంటే అలసిపోయి కూర్చునప్పుడు **''అబ్దఅతిల్ ఇబిలు''** అని అంటారు.

## 1–ఇస్లామీయ పరిభాషలో బిద్అత్ అంటే?

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో **ఉపమానం లేని క్రొత్తగా దేనినైనా కల్పించుకొని ధర్మంగా భావించి, ఆచరిస్తే వాటిని 'బిద్అత్'** కార్యాలు అంటారు.

మరియు అనుకున్న ఒక కార్యాన్ని **ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసులలో దాని ఆధారం లేనప్పటికీ పుణ్యంగా భావించి, భక్తితో ఆచరించే విషయాన్ని కూడా 'బిద్అత్'** అంటారు.

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సూచించని మరియు ఆయన పాటించని కార్యాలను మనంతట మనమే (ధర్మ గురువులు, ఇమాములు, ముఫ్తీలు, లేక ఇతరులు) ఆవిష్కరించుకుంటూ చేసే నూతన కార్యాలు. అవి మంచి కార్యాలైనా సరే, లేక చెడు కార్యాలైన సరే **'బిద్అత్'** ఆచారాలుగా పరగణించబడతాయి.

కొంత మంది ధర్మ గురువులు **'బిద్అత్'** అనే పదానికి పలు అర్థాలను తెలియజేశారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి:

1, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)మరణించిన తరువాత వచ్చిన ప్రతి కల్పితాచారాన్ని అది మంచిదైనా లేక చెడ్డదైన 'బిద్అత్' అంటారు.

2, ఇమామ్ షాఫయీ(రహ్మతుల్లాహి అలైహి) గారు ఇలా తెలియజేశారు: **''బిద్అత్ రెండు రకాలు; ఒకటేమో ప్రశంసనీయమైనది, మరొకటేమో నిందించదగినది.''**

1–ఏదైతే సున్నత్ కు అనుగుణంగా ఉందో అది ప్రశంసమైనది.

2–ఏదైతే సున్నత్ కు విరుద్ధంగా ఉంటుందో, అది నిందించదగినది.

3, అల్లామా ఇజ్‌బిన్‌అబ్దుస్ సలామ్(రహ్మతుల్లాహి అలైహి)ఇలా తెలియజేశారు: ''ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) పవిత్ర కాలంలో లేనటువంటి క్రొత్త కార్యాన్ని **'బిద్అత్'** అంటారు.''

4, ఇమామ్ షాతిబీ(రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలియజేసారు:

''ధర్మంలో ఉన్న కార్యానికి పోలినటువంటి ఒక నూతన కార్యాన్ని పాటించి మరింత దైవప్రసన్నత పొందాలని ఆశించి చేసే ఆరాధనలను **'బిద్అత్'** అని అంటారు. (బిద్ఆతే ఖుబూర్, అఖ్‌సామ్ వ అహ్‌కామ్: ఉర్దూ: 11-13).

కొందరు ముస్లిం ప్రజలు హ్రజత్ ఉమర్(రజియల్లాహు అన్హు) గారు తన ఖిలాఫత్ కాలంలో తరావీహ్ నమాజ్‌ను సామూహికంగా ప్రారంభించి, ఇది **''నిమతిల్ బిద్అతు''** (ఎంతో మేలైన శుభారంభం) అని ప్రకటించిన విషయాన్ని ఆధారంగా చూపించి బిద్అత్ కార్యాలను సమర్థించే ప్రయత్నం చేస్తారు. అయినా వారి వాదన సరికాదు. ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో తరావీహ్ నమాజును ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సామూహికంగా రమజాన్ మాసం 23వ, 25వ, 27వ రోజు రాత్రుల్లో చేయించారు. ఆ తరువాత హ్రజత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) తన ఖిలాఫత్ కాలంలో దాన్ని సామూహికంగా నెరవేర్చే పద్ధతిగా పునరుద్ధరించారు. మరియు హ్రజత్ కాబ్ మరియు హ్రజత్ తమీమ్ దారీ (రజియల్లాహు అన్హు) లను ఇమాములుగా నియమించి పదకొండు రకాతులు తరావీహ్ నమాజ్ చేయించమనీ హ్రజత్ ఉమర్(రజియల్లాహు అన్హు)గారు ఆదేశించారు.

(మోతా ఇమామ్ మాలిక్ 1/155, మరియు సహ్హాహు అల్బానీ).

వాస్తవంగా వీటికి ఇస్లాం ధర్మంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మూడు రోజుల పాటు సామూహికంగా **'తరావీహ్ నమాజ్'** చేసినట్లు ఆధారాలున్నాయి. అలాగే సహాబాలు చిన్న చిన్న తెగలుగా చేరి సామూహికంగా **''తరావీహ్ నమాజ్''** ఆచరించేవారు. మరియు ఎవరికి వారే ఇమామ్ లేకుండానే చదివినట్లు కూడా ఆధారాలున్నాయి. కాబట్టి అవి నూతన పోకడలు, కల్పిత ఆచారాల భావనలోకి రావు. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) చేసిన తరావీహ్‌ల ప్రకటన **''నీమతిల్ బిద్అతు''** అనే పదాల విషయంలో ఆయన ఉద్దేశ్యం పూర్తిగా భాష పరమైనదేకాని ధర్మ సంబంధమైనది కాదు. అంటే ధర్మంలో నూతన కల్పితాలకు చోటివ్వాలనేదీ ఆయన ఉద్దేశ్యం కాదు.

అలాగే కొందరు దివ్యఖుర్‌ఆన్‌ను ఒక గ్రంథరూపంలో జమచేయటం, అలాగే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి హదీసులను గ్రంథాల రూపంలో జమచేయటం కూడా నూతన కార్యాలుగా భావిస్తారు. కాని అలాంటివారు ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి జీవిత చరిత్రను మరియు సహాబాల జీవిత చరిత్రను అధ్యాయనం చేస్తే, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలోనే వ్రాయబడిన విభిన్న పత్రాలను జమచేసి గ్రంథరూపంలో భద్రపరచిన ఆధారాలు పూర్తిగా లభిస్తాయి.

కనుక తరావీహ్ నమాజ్ లేక ఖుర్‌ఆన్ హదీసుల గ్రంథస్తం వంటి కార్యాలు క్రొత్త కార్యాలతో పోల్చడం అవివేకంతో కూడుకున్న విషయం మాత్రమే. మరియు బిద్అతీలు తమ బిద్అత్ కార్యాలను సమర్థించుకొనుటకు అలాంటి ఆధారాలతో పోల్చడం మూర్ఖత్వం.

## 2– బిద్‌అత్ విధాలు

బిద్‌అత్‌లను రెండు విధాలుగా చేసి వాటి వాస్తవాన్ని తెలుసుకుందాము. **ఒకటి: ఆమోదయోగ్యమైనది. రెండవది: నిషిద్ధమైనది.**

**ఒకటి ఆమోదయోగ్యమైనది:** మన జీవన విధానాలలో క్రొత్తగా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకుంటూ ఉండటం. అవి ఆమోదయోగ్య మైనవి. **ఉదాహరణకు:** విజ్ఞాన శాస్త్రం, పలు విధములైన కట్టడాలు మరియు నూతన సవారీలు విభిన్న రూపాలలో ప్రసిద్ధి చెందటం, అవి ప్రకృతి మార్పులకు సంభందించినవి.

**రెండవది నిషిద్ధమైనది:** ఇస్లాం ధర్మంలో నూతన ఆచారాలను కల్పించటం. అవి నిషేధించబడినవి.

ఎందుకంటే? ఇస్లాం ధర్మం యొక్క మూల సూత్రం **'తౌఖీఫీ'** అంటే; ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకుండా యధాతథంగా ఇస్లాం ఆదేశాల మేరకు కట్టుబడి ఉండటం. కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''ఎవరైనా ఈ ధర్మంలో లేని క్రొత్త విషయాన్ని ప్రవేశపెడితే అది త్రోసిపుచ్చదగినది''** (బుఖారీ:2499, ముస్లిం:3242).

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''మరియు మీకు ప్రవక్త ఇచ్చిన దానిని తీసుకోండి మరియు అతను మీకు నిషేధించిన దానికి దూరంగా ఉండండి.''** (సూరతుల్ హష్ర్:7)

అందుకని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాలను, విధానాలను ఎవరైతే యధాతథంగా ఆచరిస్తారో, వారు అల్లాహ్ విధేయతను పాటించినట్లే. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విధేయతను పాటించనివారు వాస్తవంగా వారే అల్లాహ్‌కు అవిధేయులు.

## 3–ముస్లిం సమాజంలో నూతన వర్గాల పూర్వపరాలు

**షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్ను తైమియా**(రహ్మతుల్లాహి అలైహి) గారు ఇలా తెలియజేశారు: **''బిద్అత్ కార్యాలకు సంబంధించిన అనేక ఆరాధనలు మరియు వాటి గురించిన విద్యాబోధనలు 'ఖులఫావుర్ రాషిదూన్' చివరి కాలంలో చొరబడ్డాయి''** కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దానిని ఇలా హెచ్చరించారు:

**وَمَنْ يَعِشْ مِنْكُمْ فَسَيَرَى اخْتِلَافًا كَثِيرًا فَعَلَيْكُمْ بِمَا عَرَفْتُمْ مِنْ سُنَّتِي وَسُنَّةِ الْخُلَفَاءِ الرَّاشِدِينَ الْمَهْدِيِّينَ (السلسلة الصحيحة: 937 أخرجه أحمد وعنه الحاكم وسنده صحيح وابن ماجه)**

**''మీలో ఎవరైనా నా తదనంతరం బ్రతికి ఉంటే, త్వరలోనే అతను ఎన్నో విభేదాలు చూస్తాడు. కనుక (అలాంటి సంక్షోభ పరిస్థితుల్లో) మీరు తెలుసుకున్న నా సాంప్రదాయాన్ని, సన్మార్గం పొందిన సజ్జనులైన ఖలీఫాల సాంప్రదాయాన్ని అనుసరించాలి.''.....**

(అహ్మద్, హాకిమ్, ఇబ్ను మాజా, సిల్‌సిలతుస్ సహీహా:937).

మొట్టమొదట విభేదాలకు గురికాబడి ప్రారంభమైన నూతన వర్గాలు **'ఖద్రియ్యా, మర్‌జియ్యా'** (విశ్వాసం చాలు ఆచారాలు అనవసరం అనేవారు) **షియా** మరియు **ఖవారిజ్** మొదలగు వర్గాలు హిజ్రి రెండవ శతాబ్దములో బహిర్గతమయ్యాయి. ఆ కాలంలోనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులు అనేక విధాలుగా ఆ వర్గాలను నిరోధించారు. ఆ తరువాత **'మోతజిలా'** అనే వర్గం బహిర్గతమయ్యింది. అలాగే **తసవ్వుఫ్,** (సూఫీల) సమాధుల కట్టడాలు, నూతన పండుగలు కల్పించబడ్డాయి. అలాగే కాలాన్ని బట్టి, మనుషుల ఆలోచనలను బట్టి,

ఇస్లాం ధర్మంలో లేని అనేక నూతన కల్పితాలు వెలుగులోకి వచ్చాయి. మరియు రోజు రోజుకి పుణ్యకార్యాలు అంటూ క్రొత్త ఆచారాలు మన సమాజంలో వెలువడుతూనే ఉన్నాయి. దాని వలన ప్రజలు ఇస్లామీయ నిజ మార్గం నుండి తప్పిపోయి మార్గభ్రష్టత్వానికి గురికాబడుతున్నారు.

ఏ ప్రదేశాలైతే ఇస్లాం ధర్మం ప్రసిద్ధి చెందుటకై కారణమయ్యాయో అవే ప్రదేశాలు **(మక్కా, మదీనా మినహా–** బస్రా మరియు కూఫా సిరియా మరియు ఖురాసాన్) బిద్అత్ కార్యాలు ప్రసిద్ధి చెందుటకై దోహదపడ్డాయి. అంటే; **కూఫాలో షియా, ముర్జియా అనే వర్గాలు ప్రసిద్ధి చెందినాయి. బస్రా నుండి ఖద్రియా, మోతజిలా వర్గాలు ఉనికిలోకి వచ్చాయి. నాసిబియా మరియు ఖద్రియా వర్గాలకు సిరియా దేశం కంచుకోటగా మారింది. మరియు ఖురాసాన్ దేశము చుట్టుప్రక్కల నుండి జహ్మియా అనే వర్గం పుట్టుకొచ్చింది.** ఇలా క్రొత్త క్రొత్త వర్గాలుగా వ్యాపించి అనేక అధర్మమైన, అర్థరహితమైన నూతన ఆరాధనలు, మూఢ నమ్మకాలు ప్రపంచమంతట విస్తరించాయి.

### 4-ముస్లిం సమాజం నూతన కల్పితాలకు గురికాబడిన కారణాలు:

ధర్మంపట్ల అజ్ఞానం, తమ మనోవాంఛలను అనుసరించటం, తమ కుటుంబీకుల ఆచారాలకు, అభిప్రాయాలకు కట్టుబడి, మూర్ఖత్వంతో అవిశ్వాసుల **(కుఫ్ఫార్)** విధానాలను అనుసరించడం వలన ముస్లిం సమాజం ఇస్లామీయ రుజు మార్గాన్ని తప్పి, అధర్మమైన మార్గాలకు గురికాబడింది.

#### 1- ఇస్లామీయ ధర్మ అవగాహన రాహిత్యం:

రోజులు గడిచేకొద్ది ప్రజలలో ధర్మజ్ఞానం తగ్గుతున్నది. మరియు పట్టుదలగా సత్యఅసత్యాలను భోదించే ధర్మ గురువులు తగ్గుతున్నారు. అది ఎలా అంటే? ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**إِنَّ اللَّهَ لَا يَنْتَزِعُ الْعِلْمَ مِنْ النَّاسِ انْتِزَاعًا وَلَكِنْ يَقْبِضُ الْعُلَمَاءَ فَيَرْفَعُ الْعِلْمَ مَعَهُمْ وَيُبْقِي فِي النَّاسِ رُءُوسًا جُهَّالًا يُفْتُونَهُمْ بِغَيْرِ عِلْمٍ فَيَضِلُّونَ وَيُضِلُّونَ** (رواه البخاري ومسلم:**4829**)

‘‘నిశ్చయంగా అల్లాహ్, మనుషుల **(హృదయాల)**నుండి జ్ఞానాన్ని తీయడు, కాని జ్ఞానులు (విద్వాంసులు) అంతరించిన కారణంగా జ్ఞానాన్ని తీసుకుంటాడు, ఈ విధంగా ఒక్క జ్ఞానవంతుడు కూడా మిగలడు. అప్పుడు ప్రజలు మూర్ఖుల్ని నాయకులుగా చేసుకుంటారు. వారితో ధార్మిక(తీర్పులు) కోరుతారు, వారు తమకు ధర్మజ్ఞానం లేక పోయిన ఫత్వాలు(తీర్పులు) ఇస్తారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గభ్రష్టత్వానికి గురిచేస్తారు’’ (బుఖారీ, ముస్లిం:4829).

ఇస్లాం ధర్మంలో లేనటువంటి నూతన కార్యాలను నిర్మూలించాలంటే ఖుర్ఆన్ మరియు ప్రమాణికమైన హదీసుల విద్వాంసుల (సత్యవంతులైన ఉలమాల) వల్లనే జరుగుతుంది. అలాంటి విద్వాంసులు సమాజంలో

లేరంటే నూతన కార్యాలకు, మార్గభ్రష్టత్వానికి నియంత్రించడం కష్టకార్య మైనదే అని భావించాలి.

2, తమ మనోవాంఛల అనుసరణ వలన:

కొంత మంది ప్రజలు ఖుర్‌ఆన్ మరియు నిజమైన హదీసులకు విరుద్ధంగా తమ మనోవాంఛలను అనుసరిస్తారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

**﴿ فَإِن لَّمْ يَسْتَجِيبُوا۟ لَكَ فَٱعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ أَهْوَآءَهُمْ ۚ وَمَنْ أَضَلُّ مِمَّنِ ٱتَّبَعَ هَوَىٰهُ بِغَيْرِ هُدًى مِّنَ ٱللَّهِ ۚ ﴾ القصص: ٥٠**

**''వారు నీకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోతే, వారు కేవలం తమ కోరికలను అనుసరిస్తున్నారని తెలుసుకో! మరియు అల్లాహ్ మార్గదర్శ కత్వాన్ని విడిచి కేవలం తన కోరికలను అనుసరించే వానికంటే ఎక్కువ మార్గభ్రష్టుడు ఎవడు?''** (సూరతుల్ ఖసస్:50)

మరొక చోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**﴿ أَفَرَءَيْتَ مَنِ ٱتَّخَذَ إِلَٰهَهُۥ هَوَىٰهُ وَأَضَلَّهُ ٱللَّهُ عَلَىٰ عِلْمٍ وَخَتَمَ عَلَىٰ سَمْعِهِۦ وَقَلْبِهِۦ وَجَعَلَ عَلَىٰ بَصَرِهِۦ غِشَٰوَةً فَمَن يَهْدِيهِ مِنۢ بَعْدِ ٱللَّهِ ۚ أَفَلَا تَذَكَّرُونَ ﴿٢٣﴾ ﴾ الجاثية: ٢٣**

''తన మనోవాంఛలను తన దైవంగా చేసుకున్న వానిని నీవు చూసావా? మరియు అతడు జ్ఞానవంతుడు అయినప్పటికీ, అల్లాహ్, అతనిని మార్గభ్రష్టత్వంలో వదిలాడు. మరియు అతని చెవుల మీద మరియు అతని హృదయం మీద ముద్ర వేశాడు మరియు అతని కళ్ళ మీద తెరవేసాడు. ఇక అల్లాహ్ తప్ప అతనికి మార్గదర్శకత్వం చేసేవాడెవడున్నాడు? ఇది మీరు గ్రహించలేరా?'' (సూరతుల్ జాసియహ్:23)

3, పెద్దల ఆచారాలకు, తమ అభిప్రాయాలకు కట్టుబడి అనుసరించాలనే కోరిక:

మూర్ఖంగా తమ అభిప్రాయాలకు లేక పెద్దల ఆచారాలకు కట్టుబడి ఉండాలనుకున్న వారికి, ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసులను ఆధారాలుగా చూపించినా, వాటిని నమ్మరు మరియు అనుసరించరు. అలాంటి వారి గురించి అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''మరియు వారితో 'అల్లాహ్ అవతరింపజేసిన(ఆదేశాలను) అనుసరించండి' అని అన్నప్పుడు. వారు: 'అలాకాదు, మేము మా తండ్రి తాతలు అవలంభిస్తూ వచ్చిన పద్ధతినే అనుసరిస్తాము' అని సమాధానమిస్తారు''.**

(సూరతుల్ బఖరా:170)

సమాధులను ఆరాధించేవారు, సూఫీలు, ఇమాముల పేర్లపైన వర్గాలుగా ఏర్పడ్డ వారి స్థితి ఇలాగే ఉంటుంది. వారిని ఖుర్ఆన్ మరియు నిజమైన సున్నతులను అనుసరించవలసిందిగా కోరితే, వారందరూ **'మేము ఫలాన వర్గానికి చెందినవారము లేక మా తాతముత్తాతలు ఇలాగే చేసేవారంటూ' మూర్ఖంగా ప్రవర్తిస్తారు.**

4, అవిశ్వాసుల(కుఫ్ఫార్) విధానాలను అనుసరించడం:

ముస్లిమేతరులు పాటించే విధానాలకు సమానంగా ఆచరించడం లేక వారిలాగనే మనం కూడా కొన్ని విధానాలు పాటిస్తే మంచిదనీ భావిస్తారు.

హజ్రత్ అబూ వాఖిద్ అల్లైసి (రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు. మేము ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో కలిసి హునైన్ వైపు పోయాము. ఆ కాలంలో మేము క్రొత్తగా ఇస్లాం ధర్మాన్ని విశ్వసించాము. అప్పట్లో బహుదైవారాధకులు రేగిచెట్టు శుభాన్ని ఆశిస్తూ ఆ రేగిచెట్టు క్రింద కూర్చొని, ఆ చెట్టుపైన ఆయుధాలను వ్రేలాడదీసేవారు. దానిని **'జాతు**

**అన్వాత్'** (వ్రేలాడించబడే చెట్టు) అని పేర్కొనేవారు. ఆ చెట్టు దగ్గర నుండి వెళ్ళేటప్పుడు మేము ప్రవక్త గారితో **యా రసూలల్లా!** మా కొరకై **'జాతుఅన్వాత్'** నియమించండి ఎలాగైతే వారికొరకు **'జాతుఅన్వాత్'** ఉన్నదో, అని విన్నవించాము. అంతలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) **'అల్లాహుఅక్బర్!'** అని అంటూ; **'ఇన్నహా సునన్'** (ఇవే మార్గలు) అని, ఎవరిచేతిలో నా ప్రాణం ఉందో అతని సాక్షిగా! మీరు కోరిన కార్యం (ఎలాంటిదంటే?) హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) గారిని బనూఇస్రాయీల్ జాతివారు కూడా ఇలాగే కోరుకున్నారు: **''ఓ మూసా! వీరి ఆరాధ్యదైవాల వలే మాకు కూడ ఒక ఆరాధ్యదైవాన్ని నియమించు.''** (దానికి మూసా) జవాబిచ్చారు: **''నిశ్చయంగా, మీరు జ్ఞానహీనులైన జాతికి చెందినవారు''** (సూరతుల్ ఆరాఫ్:138) నిశ్చయంగా మీరు పూర్వీకుల జీవన విధానాలకు అనుగుణంగా నడుచుకుంటారు'' అని అన్నారు. (తిర్మీజీ:2180)

ముస్లింలు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) విధానాలకు మాత్రమే కట్టుబడి ఉండాలి. యూదులు మరియు క్రైస్తవుల మరియు బహుదైవా రాధకుల విధానాలను అనుసరించకూడదు. కాని ముస్లింలు వారి అడుగు జాడల్లో నడుచుకుంటూ, బహుదైవారాధనకు మరియు అనేక అధర్మ కార్యాలకు పాల్పడుతున్నారు. సమాధులను దేవాలయాలుగా మార్చుకున్నారు. సందర్భాలను బట్టి నూతన పండుగలు జరుపుకుంటున్నారు. తమ బంధుమిత్రులు చనిపోయిన తరువాత అవిశ్వాసులు చేసే కార్యాలను కూడా ధర్మంగా ఆచరిస్తున్నారు. అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు:

**''ఎవడైతే ఏ జాతి వేషాదారణను అవలంభిస్తాడో, అతను వారిలో ఒకడుగా పరిగణించబడతాడు.''** (అబూదావూద్, సహీహుల్ జామే: 2831)

5–ఆరాధన పరంగా బిద్అత్ రెండు విధాలు:

1, విశ్వాసపరంగా మరియు తాత్విక పలుకులు  నూతన కల్పితాలు.

**అంటే; జహ్మియా, మూతజిలా, రాఫిజా** మరియు అటువంటి మార్గభ్రష్టత్వానికి గురికాబడిన వర్గాలు. ఉదాహరణకు– వారిలో కొందరు విధి రాతను నమ్మరు. లేక ఖుర్అన్ గ్రంథాన్ని అల్లాహ్ యొక్క సృష్టితాలలో ఒక 'సృష్టి'గానే భావించేటువంటి అనేక పసలేని వాదనలు.

2, ఆరాధనలలో నూతన కల్పితాలు. దీనిలో  ఆరు విధాలున్నాయి.

1,  ఆరాధనల యొక్క ప్రధాన నియమాలలో కల్పించే నూతన కార్యాలు.

**అంటే;** అసలు ఇస్లాం ధర్మంలో లేని నూతన ఆరాధనలు. కొన్ని నఫిల్ నమాజులను లేక ఉపవాసాలను స్వయాన నిర్థారించుకొని పాటించడం. లేక ధర్మంలో లేని నూతన పండుగలను కల్పించుకోవడం. మీలాద్ షరీఫ్, లేక మేరాజున్నబీ, లేక షాబాన్ నెలలో 15వరోజున జరుపుకొనే పండుగలు. మరియు ఆ రాత్రులను తహజ్జుద్ నమాజ్ మరియు పగలు ఉపవాసం పాటించడం వంటి ఆరాధనలు బిద్అత్ ఆరాధనలే.

నమాజ్ చేయడం మరియు ఉపవాసాలు పాటించడం ధర్మం అయినప్పటికి ఆ రోజులను మరియు ఆ రాత్రులను ప్రత్యేకించి ఆరాధనలు పాటించడం వల్ల **'బిద్అద్'**గా భావించబడతాయి.

2,  ఆరాధనగా దర్మం నిర్ణయించిన వస్తువులను  చెల్లించడం.

**అంటే;** ఎవరైన గుర్రాన్ని లేక జింకను ఖుర్బానిగా చెల్లిస్తే స్వీకరించబడదు. ఎందుకంటే ఖుర్బాని కొరకు చెల్లించవలసిన జంతువులు: ఒంటెలు, ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్ళు మాత్రమే.

అలాగే **'ఫిత్రా దానం'** ధాన్యం రూపంలో చెల్లించాలి. దానికి బదులు ఎవరైన డబ్బురూపంలో చెల్లిస్తే సున్నత్ విధానానికి విరుద్ధం.

**3, ధర్మపరంగా నిర్ణయించబడిన ఆరాధనలలో పెంచడం లేక తగ్గించడం.**

**అంటే;** అల్లాహ్ ఆదేశించిన కొన్ని ప్రత్యేక ఆరాధనలలో అదనపు విషయాలను చేర్చటం' జుహ్ర్ లేక అస్ర్ లేక ఇషా నమాజ్ 4 రకాతులకు బదులు అయిదు రకాతులుగా హెచ్చించడం లేక తగ్గించడం.

**4, ఆరాధనలను నూతన పద్ధతులలో పాటించడం.**

**అంటే;** అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలిపిన పద్ధతిలో కాకుండా వేరే క్రొత్త పద్ధతులలో ఆరాధించటం. ఉదాహరణకు; అల్లాహ్ నామస్మరణ సామూహికంగా హెచ్చు స్వరంతో మరియు వివిధ రాగాలతో చేయడం, లేక ఆరాధలను ప్రవక్తముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానంకంటే కఠోరమైన విధానంలో చేయడం. అంటే ఎండలో నిలబడి నమాజు పాటించడం. లేక ఆరాధన క్రమాన్ని పాటించకపోవడం. అంటే వుజూ చేసేటప్పుడు ముందు కాళ్ళు కడిగి తరువాత ముఖం కడగటం వంటి క్రమం తప్పే పద్దతులు.

**5, ఆరాధన సమయాన్ని తప్పడం. ఉదాహరణకు.**

బక్రీద్ పండుగ నమాజ్ తరువాత ఖుర్బాని చెయ్యడం సాంప్రదాయం, కాని ఎవరైన పండుగ నమాజుకు ముందే ఖుర్బాని చేస్తే అది ఆమోదయోగ్యమైన ఆచారం కాదు.

**6, ఇస్లాం కేటాయించిన స్థలంలోనే ఆరాధన పాటించాలి.**

**అంటే;** ఏతెకాఫ్ కొరకు మసీదులోనే బస చేయడం ధర్మం. కాని ఎవరైన స్త్రీలు తమ ఇంట్లో నమాజు పాటించే స్థలంలో ఏతెకాఫ్ చేస్తే ధర్మం కాదు.

లేక హజ్ విధిని నెరవేర్చుటకు అరఫా మైదానంలో విధిగా బసచేయాలి, అరఫా మైదానంలో బస చేయని పక్షంలో అతని హజ్ నెరవేరదు.

**ముఖ్య గమనిక:** ఆరాధనలు అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యం పొందాలంటే, దానిలో **రెండు షరతులు** తప్పనిసరిగా ఉండాలి.

**ఒకటి; 'అల్ ఇఖ్లాస్' (చిత్తశుద్ధి)** అంటే; ప్రతి కార్యాన్ని అల్లాహ్ ప్రసన్నత పొందాలనే ఆకాంక్షతో చేయడం. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

﴿ وَمَآ أُمِرُوٓاْ إِلَّا لِيَعۡبُدُواْ ٱللَّهَ مُخۡلِصِينَ لَهُ ٱلدِّينَ حُنَفَآءَ ﴾ البينة: ٥

**''మరియు వారికి ఇచ్చిన ఆదేశం, వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, పూర్తి ఏకాగ్రచిత్తంతో తమ ధర్మాన్ని (భక్తిని) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని...''** (సూరతుల్ బయ్యినహ్:5)

ఎవరైన అల్లాహ్ ప్రసన్నత కాకుండా ఇతరుల మెప్పు పొందుటకై ఆరాధనలు పాటిస్తే అది షిర్క్ అవుతుంది.

**రెండవది;** అల్లాహ్ మరియు ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విధేయత.

**అంటే;** ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసుల వెలుగులోనే మనం ఆరాధనలను పాటించాలి. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విధేయతను మనం సరైన రీతిలో పాటించాలంటే, **పైన ఇవ్వబడిన ఆరు షరతులకు అనుగుణంగా** మన ఆరాధన విధానాలు ఉండాలి. అప్పుడే మా ఆరాధనలకు అల్లాహ్ వద్ద స్వీకార ముద్ర పడుతుంది.

# 4- సమాజంలో ప్రసిద్ధి చెందిన నూతన పోకడలు

నేడు మన సమాజంలో అనేక నూతన కల్పితాలు వ్యాపించి ఉన్నాయి. ఎందుకంటే? ప్రజలలో నిజమైన ధర్మజ్ఞానం తగ్గిపోయింది. వారు నూతన పోకడలను అల్లాహ్ ఆదేశాలుగానే భావిస్తున్నారు. అంతేకాక దైవదాస్యం లోను మరియు తమ జీవిన విధానంలోను అవిశ్వాసులను అనుసరిం చేవారు అధికమైపోయారు. ఈ రాబోయే పరిస్థితిని గమనించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు:

**''మీ పూర్వీకులు తప్పుదోవ పట్టిన విధంగానే మీరు కూడా తప్పుదోవ పడుతారు.''** (బుఖారీ, ముస్లిం)

మన సమాజంలో ప్రసిద్ధి చెందిన నూతన కల్పితాలను మూడు విధాలుగా విభజిస్తే వాటిని సులభంగా తెలుసుకోగలుగుతాము.

1) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం లేక ఆయన పేరుతో సంభందించిన ఇతర **నూతన ఉత్సవాలు.**
2) ప్రత్యేక స్థలాల్లో, ప్రత్యేక వస్తువుల ద్వారా మరియు పుణ్యాత్ముల సమాధుల వద్ద **శుభాలను (తబర్రుక్)** కాంక్షిస్తూ చేసే ఆరాధనలు.
3) ధర్మ పరంగా ఉన్న ఆరాధనలలో కొన్ని **నూతన కార్యాలను** జోప్పించి చేయడం.

## 1– ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం లేక ఆయన పేరుతో సంభందించిన ఇతర అధర్మ ఉత్సవాలు.

**రబీఅల్ అవ్వల్ (ఇస్లామీయ క్యాలండరు ప్రకారం మూడవ)** నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క జన్మదిన ఉత్సవం జరపడం పరిపాటయ్యింది.

నిజానికి మీలాదున్ నబీ క్రైస్తవులు జరుపుకునే **'క్రిష్టమస్'** అనే పండుగను పోలి ఉన్నది. అజ్ఞానులైన ముస్లింలు మరియు తప్పుదోవ పట్టిన ముస్లిం పండితులు రబి అల్ అవ్వల్ నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క జన్మదినాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. కొంత మంది ముస్లింలు ఈ పండుగను మస్జిద్‌లలో నిర్వహిస్తుంటారు. మరియు కొందరు తమ ఇండ్లల్లో, బహిరంగ ప్రదేశాలలో ప్రత్యేకంగా అలంకరించి మరి జరుపుకుంటారు.

మీలాదున్ నబీ ఇస్లాం ధర్మంలో నూతన కల్పితంగా పుట్టడమే కాకుండా, ఇటువంటి పండుగలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మితిమీరి స్తుతించే అనేక కవితాగానాలు, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను సహాయం కోసం అర్థించటం మొదలైన అనేక విధాల బహుదైవారాధన పద్ధతులు, అసహ్యకరమైన పద్ధతులు కూడా చోటు చేసుకున్నాయి. అయితే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా ఇలాంటి వాటిని నిషేధించారు:

**عَنْ ابْنِ عَبَّاسٍ سَمِعَ عُمَرَ رَضِيَ اللَّهُ عَنْهُ يَقُولُ عَلَى الْمِنْبَرِ سَمِعْتُ النَّبِيَّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ يَقُولُ لَا تُطْرُونِي كَمَا أَطْرَتْ النَّصَارَى ابْنَ مَرْيَمَ فَإِنَّمَا أَنَا عَبْدُهُ فَقُولُوا عَبْدُ اللَّهِ وَرَسُولُهُ** (رواه البخاري:**3189**)

**‘‘మీరు నన్ను పొగడటంలో హద్దు మీరకండీ, ఎలాగైతే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలాం) గారి పట్ల హద్దుమీరి పొగడ్తల్లో ముంచారో! నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడను మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి.’’**

(బుఖారీ:3189 ).

**మీలాదున్ నబీ** రాత్రి డప్పులతో మరియు ఇతర సూఫీలు వాడే సంగీత వాయిద్యాలతో, చెవుల కింపైన మరియు మృదుమధురమైన పాటలతో కూడిన జన్మదిన పండుగకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా హాజరవుతారని అపోహ పడుతున్నారు. అంతే కాకుండా ఇటువంటి పండుగలలో స్త్రీ పురుషులు కలిసి ఒకేచోట ఉండటం వలన దుర్బుద్ధి పుట్టి వ్యభిచారానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు. నిజానికి ఇటువంటిదేది జరగక కేవలం ఉత్సాహంగా, ఆనందంగా, ఈ పండుగను జరుపుకున్న కూడా ఇలా చేయటమనేది ఒక నూతన కల్పితమనే విషయాన్ని తెలుసుకోవాలి. ప్రతి నూతన కల్పితం చెడు మార్గం వైపునకు దారి తీస్తుంది. అంతే కాక పైన తెలిపిన చెడు సంప్రదాయాలకు, పాపపు పనులకు ఇది ఒక మార్గవిహీనంగా భావించవచ్చు.

అల్లాహ్ యొక్క అంతిమ సందేశం ఖుర్ఆన్, అల్లాహ్ యొక్క అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). మరియు ఉత్తమమైన మొదటి మూడు శతాబ్దాలలోని పుణ్యపురుషులు ఆచరణలలో ఎక్కడా కనిపించక పోవటం వలన ఇది బిద్అత్ అయినది. మరియు ఈ **‘మీలాదున్ నబీ’** ఉత్సవం నాలుగవ శతాబ్దంలో ఫాతిమీ సామ్రాజ్య కాలంలో ప్రారంభమైనది.

**మరోక కథనం ప్రకారం: ఏడవ శతాబ్దంలో ‘ఖిలాఫతే రాషిదా’** పరిపాలన అస్తమించిన తరువాత **‘షామ్’** (సిరియా) దేశానికి చెందిన **‘ముజఫ్ఫర్’** అనే ఒక రాజు **‘అర్బల్’** అనే పట్టణంలో మొట్టమొదటిగా **‘మీలాదున్ నబీ’** పేరుతో ఉత్సవం జరుపుకున్నాడు. మరియు **అబుల్ ఖత్తాబ్ బిన్ దహ్యా ‘మౌలూద్’** పేరుతో ఒక పుస్తకాన్ని రచించాడు. దానికి బదులుగా ఆ రాజు ద్వారా అతను **వెయ్యి ‘అష్రఫీలు’** బహుమానంగా పొందాడు. **‘ముజఫ్ఫర్’** అనే రాజు మహా విందు ఏర్పాటు చేసాడు. దానిలో వెయ్యి మేకలను, పదివేల కోళ్ళను, వంద గుర్రాలను, ముప్పై వేల హల్వా ప్లేట్లను సిద్ధం చేసాడు. **‘సూఫీయా’** కొరకు కవితా గానాలు మరియు నాట్యాలు చేసే స్త్రీల కచేరీలు ఏర్పాటు చేసాడు. ఆ కచేరీలు జుహర్ సమయం నుండి ఫజర్ సమయం వరకు సాగింది. దానిలో ఆ రాజు కూడా పాల్గొని నాట్యాలు చేసేవాడు. (మస్అలయే మీలాద్ ఇస్లాంకి నజర్ మే ఉర్దు– పేజి: 55)

**అల్ ఇమాం అబూ హఫ్స్ తాజుద్దీన్ అల్ ఫాకిహానీ** (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలిపారు: ‘‘తాము కూడా అనుసరించటానికి, కొంత మంది మంచి వ్యక్తులు మాటి మాటికీ నన్ను **‘రబి అల్ అవ్వల్’** నెలలో కొంత మంది గుమిగూడి చేసే అల్ మౌలిద్ (ప్రవక్త పుట్టినరోజు) అనే ఉత్సవానికి ఇస్లాం ధర్మంలో ఏదైనా ఆధారమున్నదా, లేదా? అని ప్రశ్నించారు. వారు ఆ ప్రశ్నను ప్రత్యేకమైన పద్ధతిలో తమకు అనుకూలమైన జవాబు రాబట్టాలనే సంకల్పంతో మాటిమాటికీ అడిగేవారు. అప్పుడు నేను కేవలం అల్లాహ్ యొక్క శుభాశీస్సులనే ఆశిస్తూ, వారితో ఇలా పలికాను:

**‘దివ్యఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) **యొక్క సున్నత్‌లలో మౌలిద్ గురించి నాకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు**

**మరియు సరైన ధర్మజ్ఞానం కలిగిన ప్రసిద్ధి పొందిన ఇస్లామీయ పండితులు ఎవ్వరూ ఇలాంటి ఉత్సవాలు, పండుగలు చేయలేదు. కాబట్టి, ఖచ్చితంగా అసత్యపరులు మొదలు పెట్టిన ఒక నూతన కల్పితమిది'.**

**షేఖ్ అల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియా**(రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలిపారు: ''ప్రజలు క్రైస్తవులను అనుసరిస్తూ లేక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై తమ మితిమీరిన ప్రేమాభిమానాలను ప్రదర్శించటానికి, ఆయన జన్మదిన తేదీలో ఉన్న బేదాభిప్రాయాలను దాచిపెట్టి మీలాదున్నబీని, ఒక పండుగగా జరపటం అనేది ఒక నూతన కల్పితం. వాస్తవానికి, మన ప్రాచీన పుణ్యపురుషులు దాని ఉనికినే గుర్తించలేదు. ఒకవేళ ఇది ఒక స్వచ్ఛమైన మంచి పని అని వారు భావించి ఉన్నట్లయితే, దీనిని వారు తప్పకుండా చేసేవారు. ఎందుకంటే? పుణ్యాలు సంపాదించటంలో వారు చూపిన ఆసక్తి, ఆతృత, కుతూహలం ఇంకెవ్వరూ చూపలేరు.

వాస్తవానికి వారు (మొదటి మూడు తరాల వారు) తమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అధికంగా ప్రేమాభిమానాలు చూపేవారు మరియు పుణ్యకార్యాలు చేయటానికి ప్రాధాన్యత నిచ్చేవారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అనుసరించటం మరియు విధేయత చూపటం మొదలైన అనుమతించబడిన పనుల ద్వారానే ఆయనపై ప్రేమాభిమానాలు ప్రదర్శించగలం అనే విషయాన్ని వారు గ్రహించారు. వారు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై గల తమ ప్రేమాభిమానాలను ఆయన ఆదేశాలను బహిరంగంగా మరియు అంతర్గంతంగా శిరసావహించేవారు. సున్నత్‌లను పున:స్థాపించటానికి ప్రయత్నించేవారు, ఆయన సందేశాన్ని సాధ్యమైనంత వరకు వ్యాపింపజేసేవారు, మనస్పూర్తిగా దీని కోసం

అవసరమైతే మాటలతో మరియు చేతులతో పోరాటం చేయటానికి కూడా వెనుకాడేవారు కాదు.

ఆరంభంలో ఇస్లాం స్వీకరించినవారు, మక్కా వదిలి మదీనాకు వలస పోయిన ముహాజిర్లు, మక్కా నుండి వలస వచ్చిన వారికి పూర్తి సహాయ సహకారాలందించిన అన్సారులు, ఇంకా ఎవరైతే ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఖచ్చితంగా అనుసరించేవారో (దైవవిశ్వాసంలో) వారు పాటించిన పద్దతే సరైన పద్ధతి. వారిని **'సలఫుస్సాలిహీన్'** అంటారు.

ఇటువంటి జన్మదిన వేడుకలు (మీలాదున్నబి) వంటివి వారి తర్వాత పుణ్యపురుషులు, ఔలియాల, ఇమాముల జన్మదిన వేడుకలు, ఉరుసులు జరుపుకునే ఆచారంగా మారిపోయింది. ఈ విధంగా **'ఇఅల్ బిదాఅ'** (నూతన కల్పితాల)ను ఖండిస్తూ, అనేక వ్యాసాలు వ్రాయబడినవి. ఇలా ఇస్లాం ధర్మంలో ఒక పెద్ద దురాచారానికి మార్గం ఏర్పడినది.

## 2– ప్రత్యేక స్థలాల్లో, ప్రత్యేక వస్తువుల ద్వారా మరియు పుణ్యాత్ముల సమాధుల వద్ద శుభాలను (తబర్రుక్) కాంక్షిస్తూ చేసే ఆరాధనలు.

**అత్ తబర్రుక్ అంటే;** శుభాలను ఆశించడం. మేళ్ళు, శుభాలు కలగడం మరియు శుభాలు ప్రాప్తించడం.

ఎవరికైతే మేళ్ళను మరియు శుభాలను ప్రసాదించే అధికారం ఉందో, వారితోనే కోరడం సమంజసం. శుభాలను ప్రసాదించే అధికారం ఎవరికైతే లేదో, వారి ద్వారా శుభాలు ఆశించడం లేక కోరడం అవివేకం. కనుక మేళ్ళను మరియు శుభాలను ప్రసాదించగలిగే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. సర్వసృష్టిలో ఉన్న ఏ వ్యక్తికి మేళ్ళను మరియు శుభాలను ప్రసాదించే శక్తిగాని, అధికారంగాని లేదు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''ఆయనే అల్లాహ్ మీ ప్రభువు, విశ్వసామ్రాజ్యాధికారం ఆయనదే! మరియు ఆయనను వదిలి మీరు వేడుకొనే వారు, ఖర్జూర బీజంపై నున్న పొరకు కూడా యజమానులు కారు– మీరు వారిని వేడుకున్నప్పటికీ, వారు మీ ప్రార్థనలను వినలేరు, ఒక వేళ విన్నా, వారు మీకు జవాబివ్వలేరు''** (సూరతుల్ ఫాతిర్:13–14).

మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఓ అల్లాహ్ నీవు ఎవరికైన ప్రసాదిస్తే దానిని నివారించేవారు ఎవరూ లేరు. నీకృపే లేకపోతే కృషి చేయువాని కృషికి ప్రతి ఫలము ఏమియు లేదు.''

(బుఖారీ:799, ముస్లిం:725)

ప్రత్యేక స్థలాల్లో మరియు బ్రతికున్న లేక మరణించిన పుణ్యప్రజల యందు శుభాలను ఆశించడం ధర్మసమ్మతం కాదు. ఒకవేళ వారిద్వారా శుభాలు ప్రాప్తిస్తాయని విశ్వసిస్తే అది షిర్క్ అవుతుంది. మరియు కొన్ని వస్తువులను పవిత్రంగా భావించి వాటి తాకిడి వల్ల శుభాలు ప్రాప్తిస్తాయని, ప్రత్యేకమైన స్థలాలలో బస చేయడం వల్ల శుభాలు ప్రాప్తిస్తాయని నమ్మడం షిర్క్ వైపుకే దారి తీస్తోంది. □

---

□ <u>ముఖ్య గమనిక:</u> ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) బ్రతికుండగా ఆయన శిరోజాలను, ఆయన చెమటను, మరియు ఆయన దుస్తులను శుభాలుగా భావించి సహాబాలు వాటితో ప్రయోజనం పొందేవారు. ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వ్యక్తిత్వంతో మాత్రమే శుభాలను ఆశించడం ధర్మం. మరియు ఆయన శరీరానికి సంబంధించిన ఏ ఒక్క వస్తువు (వెంట్రుకలు, తలపాగ, దుస్తులు, ఉంగరం వంటివి) మనకు లభించిన వాటిని పవిత్రంగా భావించి శుభాలను ఆశించడం కూడా ధర్మమే. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చనిపోయిన తరువాత ఆయనకు సంబంధించిన వస్తువులు ప్రస్తుత కాలంలో లేవు, కాబట్టి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)వ్యక్తిత్వం ద్వారా మరియు వారి వస్తువుల ద్వారా శుభాలను ఆశించడం అనేది కూడా లేదు. ఒక వేళ పవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)గారికి సంభందించిన వస్తువు ప్రామాణి కమైన ఆధారాలతో లభించినట్లయితే శుభంగా ఉపయోగించడం ధర్మం.

కాని ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటిని లేక సమాధిని మరియు ఆయన నమాజు చేసే చోటును లేక ఆయన కూర్చునే చోటును శుభాల కొరకు ప్రత్యేకించలేదు. అలాగే హిరా కొండను, సౌర్ కొండను, జబలుర్ రహ్మా (అరాఫాత్ మైదానంలో నిలబిడి ప్రసంగించిన) కొండను శుభాలుగా ఆశించి ఎక్కడం లేక బస చేయడం మరియు అక్కడ నమాజు కొరకు ప్రధాన్యత ఇవ్వడం కూడా ధర్మం కాదు. ప్రపంచంలో మక్కా మరియు మదీనా పవిత్రమైన స్థలాలు. అక్కడ ఉన్న కాబతుల్లాహ్ మసీదు, మరియు మదీనాలో ఉన్న మస్జిద్ నబవీ మరింత పవిత్రమైనవి. అలాగే మజ్జిదే అఖ్సా కూడా పవిత్రమైనది. మరియు మక్కా మసీదులో ఉన్న జమ్‌జమ్ నీరు అతి పవిత్రమైనది. మదీనా లో పండే 'అజ్వా' ఖర్జూరాలు శుభమైనవి.

హ|జత్ అబూబకర్ మరియు హ|జత్ ఉమర్, హ|జత్ ఉస్మాన్, హ|జత్ అలీ, హ|జత్ హసన్, హుసైన్ వంటి ఉత్తమమైన సహాబాలు, మరియు వారిలో కొందరు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కుటుంబానికి చెందినవారు కూడా ఉన్నారు. అంతేకాక వారందరితో అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు మరియు వారు కూడా అల్లాహ్‌తో సంతుష్టులయ్యారు అనే విషయం దైవగ్రంథం ఖుర్ఆన్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. అలాంటి మహా పుణ్యాత్ములైన సహాబాలను, వారు ఉపయోగించిన వస్తువులను ఆ నాటి ప్రజలు శుభాల కొరకు ప్రత్యేకించలేదంటే, వారి తరువాత తరాల ప్రజల నుండి శుభాలను ఆశించడం ఎంతవరకు ధర్మం?

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి తరానికి చెందినవారు సహాబాలు మరియు సహాబాల తరానికి చెందినవారు తాబయీన్‌లు, తబా తాబయీన్‌లు. వారందరూ పవిత్రమైన తరాలకు మరియు కుటుంబాలకు చెందినవారు. కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

قَالَ النَّبِيُّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: "خَيْرُكُمْ قَرْنِي ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ ."

(رواه البخاري: **2457**– مسلم: **4603**)

**‘‘ప్రజలందరిలోకెల్లా నా తరం ప్రజలు ఉత్తములు (పుణ్యాత్ములు) మరియు ఆ తరువాతి తరంవారు, మరియు ఆ తరువాతి తరంవారు’’** ........(బుఖారీ:2457, ముస్లిం:4603)

అంటే; వారందరు పుణ్యాత్ములనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధృవీకరించారు. అయినా వారినుండి, వారి సమాధుల నుండి మనం ఎలాంటి శుభాలను ఆశించడం లేదు మరియు ఆశించకూడదు.

వారి తరువాత జ్ఞానవంతులైన ఇమాములు, హదీసు జ్ఞానం కలిగిన ముహద్దిసీన్లు, ధర్మాన్ని తూచతప్పకుండా అనుసరించే ఔలియాలు (పుణ్యాత్ములు) మరియు సాధారణ ముస్లింలు ప్రళయం వరకూ సమాజంలో ఉంటారు. వారిలో మనం కొందరినీ ఔలియాలనీ నిర్ణయించుకొని వారిద్వారా శుభాలను ఆశించడం మరియు వారు తినిత్రాగి వదలిన వస్తువులను, వారు ధరించే వస్త్రాలను, లేక వారికి సంబంధించిన ఇతర వస్తువులను శుభాలుగా భావించటం ఎంతవరకు సమంజసం? మరియు వారు మరణిస్తే వారి సమాధులను దర్గాలుగా నిర్మించి ప్రత్యేకంగా దర్శించటం, వాటి ద్వారా శుభాలను ఆశించటం మరియు అక్కడ భయంభక్తిని చూపటం ఎంతవరకు ధర్మసమ్మతం? అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా హెచ్చరించారు:

**عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْها قَالَتْ قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ : "مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ."** (رواه البخاري:**2499**– مسلم:**3242**).

''ఎవరైనా మేము ఆదేశించని పని ఏదైనా చేస్తే అది త్రోసిపుచ్చదగినది''

(బుఖారీ:2499, ముస్లిం:3242).

## 3– ధర్మ పరంగా ఉన్న ఆరాధనలలో కొన్ని నూతన కార్యాలను జొప్పించి ఆరాధించడం:

ప్రస్తుత కాలంలో ప్రతి ఆరాధన విధానంలో అనేక నూతన కల్పితాలు వ్యాపించబడ్డాయి. వాస్తవానికి ఆరాధనలకు మూల సూత్రం **'తౌఖీఫీ' (ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకుండా ఇస్లాం ఆదేశాల మేరకు కట్టుబడి ఉండటం)** కనుక మనం చేసే ఆరాధనలకు ఖుర్‌ఆన్ మరియు నిజమైన హదీసుల సాక్ష్యాధారాలు లేవంటే అది ఎన్నటికీ ధర్మం సమ్మతం కాదు. సరైన సాక్ష్యాధారాలు లేకుండా ఏ కార్యమూ ధర్మంలో చట్టబద్ధం కానేకాదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా తెలియజేసారు:

**مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ** (رواه البخاري:**2499**– مسلم:**3242**)

**''ఎవరైనా మేము ఆదేశించని పని ఏదైనా చేస్తే అది త్రోసిపుచ్చదగినది.''**

(బుఖారీ:2499, ముస్లిం:3242).

**1– వుజూ మరియు నమాజ్** విధానాలలో, రమజాన్ ఉపవాసాల మరియు హజ్ ఆచరణలలో అనేకమైన బిద్‌అత్ కార్యాలను ప్రజలు కల్పించుకు న్నారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి:

**1– వుజూ; వుజూ** చేయుటకు ముందు **'బిస్మిల్లాహ్'** అని, తరువాత క్రమంగా వుజూ చేసి, వుజూ చివరిగా ఒక దుఆ పఠించాలి.

కాని కొంత మంది ప్రజలు వుజూ మధ్యలో కొన్ని దుఆలు చదువుతుం టారు మరియు మెడ మసా, చేతుల మసా చేస్తారు. అలాగే వుజూ చివరిలో చేతి వ్రేళ్ళను ముద్దుపెట్టుకొని కళ్ళకు అద్దుకునే **బిద్‌అత్** ఆచారాలు పాటిస్తుంటారు.

2- **నమాజు కొరకై సంకల్పం** అనేది మనస్సులో వెలువడేది. అది హృదయంలో జరిగే ఒక కార్యం. దానిని నియ్యత్ అంటారు. కనుక అది నాలుకతో చెప్పే కొన్ని పదాలు కావు. మరియు **(నేను...ఇన్ని రకాతుల...ఈ వేళ సున్నత్ లేక ఫర్జ్ నమాజు అల్లాహ్ కొరకు కాబా గృహం వైపునకు ముఖము చేసి నమాజు చేస్తున్నాను),** అనే పదాలను ఏ భాషలో పఠించిన, వాటికి ఏ ఒక్క నిజమైన హదీసు ఆధారం లేదు. కనుక ఇది ఒక **బిద్అత్** కార్యంగా భావించబడింది.

3- **నమాజు తరువాత సున్నత్** గా పఠించవలసిన దుఆలును చదవడం సాంప్రదాయం. మరియు ప్రతి ఒక్కరు స్వయంగా తమతమ దుఆలు చేసుకోవాలి.

కాని నమాజు తరువాత మస్నూన్ దుఆలు చదవక ముందు నుదిటిపై హస్తాన్ని వుంచి **'యా ఖయ్యూమ్'** అంటు మూడు సార్లు చదివి మరియు మూడు సార్లు **'యా నూర్'** అని చేతి వ్రేళ్లపై ఊది కళ్ళకు అద్దుకునే ఆచారాన్ని పాటిస్తారు. నమాజు తరువాత సామూహికమైన దుఆను చేస్తారు. మరియు కొంత మంది ప్రజలు **ఇఖామత్ పలుకులు చెప్పక ముందు దురూద్ దుఆ** చదివి తరువాత ఇఖామత్ పాదాలు పలుకుతారు. మరియు నమాజ్ తరువాత లేచి నిలబడి **'దరూద్ వ సలామ్'** అంటూ, ఖిబ్లావైపు అభిముఖం చేసి కొన్ని పదాలు సామూహికంగా చదువుతారు. ఇలాంటి కార్యాలన్నీ ఎంత మాత్రం సున్నత్ సంప్రదాయం కాదు.

4- **శుక్రవారం రోజు జుమా నమాజు** కొరకు స్నానం చేసి, పరిశుభ్రమైన దుస్తులు ధరించి, సువాసన రాసుకొని, నమాజు కొరకు తొలివేళలో మసీదుకు వెళ్ళి కనీసం రెండు రకాతులు నఫిల్ నమాజు చదివి,

నిశబ్దముగా ఇమామ్ గారి ప్రసంగం వినడం ఎంతో పుణ్యమైన కార్యం. అలాగే ఆ రోజు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) కొరకు 'దరూద్ దుఆ'చదవటం, దాన ధర్మాలు చెయ్యడం కూడా పుణ్యకరమైన ఆచారాలు.

కాని శుక్రవారం మసీదులో నమాజుకు ముందు రెండు **ప్రసంగాలు చెయ్యడం,** నఫిల్ నమాజ్ కొరకై ప్రత్యేకంగా ఆ రెండు ప్రసంగాల **మధ్య సమయాన్ని కేటాయించడం,** జుమా నమాజ్ చదివిన తరువాత ఇహ్‌తియాతే జుహర్ అంటూ జుహర్ నమాజ్ నాలుగు రకాతులు చదవడం, ఆ రోజు సాయంత్రం ఫాతిహాలు చెయ్యడం, మరియు ప్రత్యేకంగా ఆరోజు శ్మశానాన్ని సందర్శించడం బిదఅత్ ఆచారాలుగా భావించబడతాయి.

5-రమదాన్ నెలవంక చూసి ఉపవాసాలు పాటించాలి, నెలవంక చూసి ఉపవాసాలు విరమించాలి. మరియు తరావీహ్ నమాజ్ మసీద్‌లో సామూహికంగా నెరవేర్చడం ధర్మం. లేక తమ తమ నివాసాలలో విడివిడిగా కూడా నెరవేర్చడం ధర్మమే.

కాని రమదాన్ నెలవంక చూడక ఒక రోజు మునుపే ఇస్తెక్బాలే రమదాన్ అంటూ ఉపవాసం ఉండటం మరియు ఉపవాసం నియ్యత్ అంటూ **'నవైతు సౌమ గదిన్ అన్ అదాఅ ఫర్జి రమదాన హాజిహిస్సనతి లిల్లాహి తఆలా'** అని పఠించే పదాలు, తరావీహ్ నమాజ్ రెండు రకాతుల మరియు నాలుగు రకాతుల విరామం సమయంలో కొన్ని ప్రత్యేకమైన తస్బీహ్ పదాలను పఠించడం, తరావీహ్ నమాజులో ఖుర్ఆన్ చాలా తొందరపాటుగా చదవటం, రమదాన్ చివరి దశకంలో మసీదులను

అలంకరించడం మరియు రమదాన్ 27వ రాత్రి శ్మశానానికి పోయి ఫాతిహాలు చేయడం వంటి కార్యాలు బిద్అత్‌గా పేర్కొనబడ్డాయి.

**2- ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానం ప్రకారం హజ్ విధానాలను పాటించడం ధర్మం.**

1- కొంత మంది ప్రజలు హజ్ సంకల్పం చేసికున్న తరువాత ప్రయాణానికి ముందు పూలహారాలు వేసుకొని ఊరేగించి, పెద్ద పెద్ద పార్టీల ఏర్పాట్లు చేసి, ఆ తరువాత తమ పెద్దల కాళ్ళపై పడి మ్రొక్కి, ఔలియాల సమాధులను దర్శించి, ఫాతిహాలు చేసి తరువాత ప్రయాణించడం శుభంగా భావిస్తారు. మరియు కొంత మంది ప్రజలు హజ్జ్ నెరవేర్చక ముందు ఇరాఖ్‌లో ఉన్న దర్గాలను సందర్శించే హజ్ విధిని నెరవేర్చుతారు. అలా చేయడం ధర్మ పరమైన సాంప్రదాయం కానే కాదు.

2- కాబతుల్లాహ్ ప్రదక్షణలు చేయడం మరియు **'హజ్రే అస్వద్'**ను ముద్దాడటం, మరియు రుక్నెయమానీని తాకడం, మరియు కాబతుల్లాహ్ తలుపు **(బాబే ఇస్తేలాం)** వద్ద నిలబడి దాన్ని పట్టుకుని దుఆలు చేయడం వంటి ఆచారాలు ధర్మపరమైనవి, ఆమోదయోగ్యమైనవి.

కాని కాబతుల్లాహ్ గోడలను భక్తితో తాకడం, తమ ముఖాలతో మరియు చేతులతో గోడలను రుద్దుకోవడం, ప్రదక్షణల కోసం ప్రత్యేకంగా స్నానం చేయడం, ముఖామే ఇబ్రాహీం వద్ద ఉన్న జాలికను తబర్రుక్‌గా భావించి తాకడం, అక్కడ నిలబడి దుఆలు చేయడం వంటి ఆచారాలు సాంప్రదాయం కానే కావు.

3- మక్కాలో మినా ప్రదేశంలో ఉన్న జమ్రాతులను (చిహ్నాలుగా ఉన్న మూడు షైతాన్ స్థంబాలు) **చిన్నచిన్న కంకర రాళ్ళతో విసరి కొట్టడం ధర్మం.**

కాని కొంత మంది అమాయక ప్రజలు ఆ రాళ్ళను నీటితో కడిగి తరువాత షైతాన్ స్థంబాలుపై విసరడం జరుగుతుంది. లేక కోపంతో చెప్పులతో, ఇతర వస్తువులతో విసరికొట్టడం జరుగుతుంది అక్కడ అలా చేయడం ధర్మం కాదు.

4- బక్రీద్ పండుగ రోజు ఖుర్బాని చెయ్యడము మరియు హజ్ చేసేవారు ఖుర్బాని చేయడము ధర్మం.

కాని ఖుర్బాని చేయుటకు జంతువును జబహ్ చెయ్యకుండా, ఆ జంతువు విలువకు సమానమైన డబ్బును దానంగా చెల్లించడం, లేక హజ్ విధిని నెరవేర్చకుండా, దానికి బదులుగా ఆ డబ్బులను దానం చేయడము ధర్మం కానే కాదు.

5- హజ్ చేసేవారు శిరోముండనం చేసుకోవడం, లేక పూర్తిగా తల వెంట్రుకలు కత్తిరించడం సున్నత్ సాంప్రదాయం.

కాని కొంత మంది ఉమ్రా లేక హజ్ చేసేవారు సగం తల గొరగించు కుంటారు, లేక తల వెంట్రుకల నుండి అక్కడక్కడ కొన్ని వెంట్రుకలు మాత్రం కత్తిరిస్తారు. ఇలా చేయడం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం కాదు.

6- మదీనాకు పోయినప్పుడు వుజూ లేకుంటే, వుజూ చేసుకొని మొట్టమొదట మస్జిద్ నబవీలో నమాజు చేయడం సున్నత్ సాంప్రదాయం. తరువాత ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధి వద్దకు పోయి పద్ధతి ప్రకారం సలామ్ చెప్పి, మరియు దరూద్ దుఆ పఠిచడం ధర్మపరమైన ఆచారం.

కాని కొంత మంది ప్రజలు మదీనాలో ప్రవేశించక ముందు స్నానం చేసుకొని తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధిని దర్శనం చేసి, ఆ తరువాత మస్జిద్ నబవీలో నమాజు నెరవేర్చుతారు. ఆ సమాధి చుట్టూ ఉన్న జాలికను పట్టుకొని ఏడవటం, రకరకాల ప్రమాణాలు, వాగ్దానాలు చేయటం, ఆ జాలికను పట్టుకొని శుభాలను ఆశించటం, ఆ సమాధి చుట్టూ తిరుగుతూ ఖుర్ఆన్ పారాయణం మరియు నఫిల్ నమాజులు చేయటం, అక్కడ భయభక్తితో నిలబడి మొరపెట్టుకోవటం ధర్మంగా భావిస్తారు. మరియు కొంత మంది ముస్లింలు తమ వైపు నుండి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సమాధి వద్దకు పోతే **దురూద్** మరియు **సలామ్** చెల్లించవలసిందిగా కోరుతారు. మరియు అక్కడకు చేరుకున్నవారు వారి తరఫున **దరూద్** మరియు **సలామ్** ఆ సమాధికి తెలుపుతారు, మరియు అలా చెయ్యడం పుణ్యపరంగా భావిస్తారు. కాని అటువంటి ఏ కార్యానికి ఇస్లామీయ ధర్మంలో అనుమతి లేనే లేదు.

ఇస్లామీయ మిత్రులారా! **నూతన కల్పిత (బిద్అత్‌లు) ఆచారాలు పాటిస్తూ, పుణ్యాన్ని ఆశించడం మహా అవివేకంతో కూడుకున్నది.** ఎందుకంటే? అలాంటి ఆచారాలు అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద ఘోరమైన పాపాలు. అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

**فَإِنَّهُمْ يَأْتُونَ يَوْمَ الْقِيَامَةِ غُرًّا مُحَجَّلِينَ مِنْ أَثَرِ الْوُضُوءِ قَالَ أَنَا فَرَطُكُمْ عَلَى الْحَوْضِ ثُمَّ قَالَ لَيُذَادَنَّ رِجَالٌ عَنْ حَوْضِي كَمَا يُذَادُ الْبَعِيرُ الضَّالُّ فَأُنَادِيهِمْ أَلَا هَلُمُّوا فَيُقَالُ إِنَّهُمْ قَدْ بَدَّلُوا بَعْدَكَ وَلَمْ يَزَالُوا يَرْجِعُونَ عَلَى أَعْقَابِهِمْ فَأَقُولُ أَلَا سُحْقًا سُحْقًا (صحيح إبن ماجة:4306)**

''ప్రళయ దినాన నా అనుచర సమాజానికి చెందినవారు, వుజూ కారణంగా వారి కాళ్ళు చేతులు ప్రకాశిస్తూ ఉంటాయి, అప్పుడు నేను అందరికంటే ముందు 'హౌజు కౌసర్' వద్ద ఉంటాను.

జాగ్రత్తా! నా 'హౌజు కౌసర్' నుండి కొంత మంది ప్రజలను దూరంగా నెట్టి వేయటం జరుగుతుంది, ఎలాగైతే దారి తప్పిపోయి వచ్చిన ఒక ఒంటెను నెట్టివేయడం జరుగుతుందో అలాగే.

తరువాత నేను వారిని కేకపెట్టి స్వాగతం సుస్వాగతం అని పిలుస్తాను. అప్పుడు అల్లాహ్ దూతలు: ''మీ తదనాంతరం వీరంతా (ధర్మంలో) అనేక మార్పులు చేసుకున్నారు' అని అంటారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'దూరంగా తరిమేయండీ, తరిమేయండీ'' అని అంటారు.

(సహీహ్ ఇబ్ను మాజా::4306)

నూతన ఆచారాల వలన షైతాన్ సంతోషపడతాడు. ఎందుకంటే? ఒక వ్యక్తి ఇతర పాపాలు చేస్తే అతను చేసేది పాపం అని తెలిసి, ఏదో ఒకరోజు ఆ పాపకార్యం నుండి పశ్చాతాప పడి అల్లాహ్‌తో క్షమాబిక్ష అడగటానికి అవకాశం ఉంటుంది. కాని బిద్అత్ కార్యాలలో కూరుకుపోయినవారు తాము చేస్తున్న అధర్మమైన ఆచారాలన్నీ, అల్లాహ్‌కు చేరువయ్యే ఒక విధమైన ఆరాధనలుగానే నమ్మటం జరుగుతుంది. దానివలన వారు తాము చేస్తున్నది తప్పని తెలుసుకోలేక పశ్చాతాప పడటానికి అవకాశం కూడా ఉండదు. మరియు ధర్మ పరంగా లేని ఆచారాలను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సంప్రదాయాలుగానే భావించి, క్రొత్త క్రొత్త కల్పిత ఆరాధనలను సమాజంలో వ్యాప్తి చేయుటకు కారకులవుతారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గభ్రష్టత్వానికి గురిచేస్తారు.

# 5- ముహర్రం నెల వాస్తవికత

## ముహర్రం నెల విశిష్ఠత:

అరబీలో పదోవ తేదిని **'ఆషూరా'** అని అంటారు. ముహర్రం నెలలో పదవ తేదిన పాటించే ఉపవాసాన్ని **ఆషూరా ఉపవాసం** అని అంటారు.

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు:

**﴿ إِنَّ عِدَّةَ ٱلشُّهُورِ عِندَ ٱللَّهِ ٱثْنَا عَشَرَ شَهْرًا فِى كِتَٰبِ ٱللَّهِ يَوْمَ خَلَقَ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ مِنْهَآ أَرْبَعَةٌ حُرُمٌ ﴾ التوبة: ٣٦**

**''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి) ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి......** (సూరతుతౌబా:36).

నాలుగు మాసాల గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**الزَّمَانُ قَدْ اسْتَدَارَ كَهَيْئَته يَوْمَ خَلَقَ اللَّهُ السَّمَوَات وَالْأَرْض السَّنَةُ اثْنَا عَشَرَ شَهْرًا مِنْهَا أَرْبَعَةٌ حُرُمٌ ثَلَاثَةٌ مُتَوَالِيَاتٌ ذُو الْقَعْدَة وَذُو الْحجَّة وَالْمُحَرَّمُ وَرَجَبُ مُضَرَ الَّذِي بَيْنَ جُمَادَى وَشَعْبَانَ** (رواه البخاري: **2958**– مسلم: **3179**)

''కాలం తిరిగి తిరిగి యధాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు విశిష్టమైనవి (పవిత్రమైనవి) వాటిలో మూడు మాసాలు ఒక దాని తరువాత ఒకటి వస్తాయి. **అవే జుల్ ఖాయిదా, జుల్ హజ్,**

**ముహర్రం నాల్గవ మాసం రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది.''** (బుఖారీ:2958, ముస్లిం:3179)

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**أَفْضَلُ الصِّيَامِ بَعْدَ رَمَضَانَ شَهْرُ اللَّهِ الْمُحَرَّمُ وَأَفْضَلُ الصَّلَاةِ بَعْدَ الْفَرِيضَةِ صَلَاةُ اللَّيْلِ** (مسلم)

**''రమజాన్ తరువాత అల్లాహ్ మాసమయిన ముహర్రం నెలలో పాటించబడే ఉపవాసాలు అత్యంత శ్రేష్ఠమైనవి. అలాగే ఫర్జ్ నమాజుల తరువాత పాటించబడే (నఫిల్) నమాజుల్లో తహజ్జుద్ నమాజు అత్యంత శ్రేష్ఠమైనది.''** (ముస్లిం:1982)

ముహర్రం మాసపు ఘనతను తెలియజేయటానికి దానిని 'అల్లాహ్ మాసం' అని అనటం జరిగింది. ఉదాహరణకు అల్లాహ్ గృహం, అల్లాహ్ ఒంటె అని ఖుర్ఆన్‌లో పేర్కొనడం జరిగింది. అల్లాహ్ అలా పేర్కొనంత మాత్రన అవి అల్లాహ్‌కు అవసరమైన వస్తువులు అని అర్థం కాదు. కాని అల్లాహ్ వాటి విశిష్ఠతను వివరించటమే దాని ఉద్దేశ్యం.

## ముహర్రం నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం:

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం ప్రకారం ఖురైష్ జాతి ప్రజలు ఇస్లాం రాక మునుపు అజ్ఞాన కాలంలో ముహర్రం నెలలో ఆషూరా నాటి ఉపవాసం పాటించేవారు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు కూడా ఆ ఉపవాసాన్నే పాటించేవారు. తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనాకు వచ్చినప్పుడు కూడా ఆ ఉపవాసాన్ని

పాటించేవారు, సహాబాలను కూడా ఆ ఉపవాసాన్ని పాటించమని ఆదేశించేవారు. ఆ తరువాత రమాజాన్ ఉపవాసాలు విధి గావించబడ్డాయి. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆషూరా ఉపవాసం గురించి:

**هَذَا يَوْمُ عَاشُورَاءَ وَلَمْ يَكْتُبْ اللَّهُ عَلَيْكُمْ صِيَامَهُ وَأَنَا صَائِمٌ فَمَنْ شَاءَ فَلْيَصُمْ وَمَنْ شَاءَ فَلْيُفْطِرْ** (رواه البخاري:**1864**– مسلم:**1909**)

**''ఇది ఆషూరా రోజు అల్లాహ్ మీపై ఈ ఉపవాసాన్ని విధిగావించలేదు. అయినా నేను ఉపవాసం ఉంటున్నాను. కనుక మీలో ఎవరైనా ఆ ఉపవాసాన్ని పాటించాలనుకున్న వారు పాటించండి, లేదంటే మానుకోండి''** అని అన్నారు. (బుఖారీ:1864, ముస్లిం:1909)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చినప్పుడు మదీనాలోని యూదులు ముహర్రం మాసపు పదొవ తేదిన ఉపవాసం పాటించటాన్ని గమనించారు. వారిని ఉద్దేశించి, **''మీరు ఈ రోజు ఉపవాసం ఎందుకు పాటిస్తున్నారు?''** అని అడిగారు. దానికి యూదులు, అల్లాహ్ ఈ రోజు మూసా ప్రవక్తకు **'ఫిరౌన్'** ఆగడాల నుండి విముక్తి ప్రసాదించాడు. ఆ సంతోష ఘడియల్ని పురస్కరించుకొని మేము ఈ రోజు ఉపవాసం పాటిస్తాం'' అని చెప్పారు. అది విని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) **''మూసా ప్రవక్త సంతోషంలో పాలుపంచుకోవటానికి మీకంటే మేము ఎక్కువ హక్కుదారులం''** అంటూ ఆయన కూడా ఆ రోజు ఉపవాసం పాటించారు. మరియు సహాబాలను కూడా ఉపవాసం పాటించమని ఆదేశించారు. (బుఖారీ:1865, ముస్లిం:1911)

హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

لَئِنْ بَقِيتُ إِلَى قَابِلٍ لَأَصُومَنَّ التَّاسِعَ ( رواه مسلم:1917 )

**''ఒక వేళ నేను వచ్చే సంవత్సరం వరకు బ్రతికుంటే ముహర్రం మాసపు తొమ్మిదో తేదిన కూడా ఉపవాసం పాటిస్తాను.''** (ముస్లిం:1917)

హ|జత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ''ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆషూరా రోజు (ముహర్రం నెల పదో తేదిన) స్వయంగా ఉపవాసం ఉన్నారు. మరియు ఆ రోజు ఉపవాసం పాటించమని ఆదేశించారు'' (బుఖారీ:1865, ముస్లిం:1911)

హ|జత్ అబూ ఖతాదా(రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధామిస్తూ, **''అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది''** అని చెప్పారు. (ముస్లిం:1977)

## అహ్లెబైత్ (ప్రవక్త (స)ఇంటివారి) విశిష్ఠత:

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు: **''ఓ ప్రవక్త ఇంటివారలారా! మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలన్నది అల్లాహ్ అభిలాష.''**

(సూరతుల్ అహ్జాబ్:33)

ఈ ఆయతు ద్వారా మరియు ఖుర్అన్‌లో ఉన్న అనేక ఆయతుల ద్వారా కూడా తెలిసేదేమంటే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సతీమణులందరూ **'అహ్లెబైత్'** విశిష్ఠ స్థానానికి చెందినవారు. మరియు

హజ్రత్ అలీ, ఫాతిమా, హసన్, మరియు హుసైన్ వారందరు కూడా 'అహ్లెబైత్'కి చెందినవారే.

హజ్రత్ ఉమ్మె సల్మా (రజియల్లాహు అన్హ) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నా ఇంట్లో ఉండగా: **إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنْكُمُ الرِّجْسَ** **''ఓ ప్రవక్త ఇంటివారలారా! మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది,.....''** అనే ఖుర్ఆన్ ఆయతు అవతరించింది. తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు, ఒక వ్యక్తిని ''అలీ, ఫాతిమా, హసన్, మరియు హుసైన్ (రజిఅల్లాహు అన్హుం) వైపు పంపిస్తూ ఇలా అన్నారు: 'ఓ అల్లాహ్! వారందరూ 'అహ్లెబైత్'కి చెందినవారు. అంతలో హజ్రత్ ఉమ్మె సల్మా (రజియల్లాహు అన్హ) ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని: నేను 'అహ్లెబైత్'కి చెందిన దానిని కానా? అని ప్రశ్నించారు. దానికి ప్రవక్త గారు: 'నీవు నాకు మంచి భార్యవీ, వారు నా 'అహ్లెబైత్'కి చెందినవారు. ఓ అల్లాహ్! నా 'ఇంటివారలు' ఎక్కువ హక్కుదారులు, అని అన్నారు.

(అల్ ముస్తద్రక్ అలస్ సహీహైన్ లిల్ హాకిమ్, తఫ్సీర్ సూరతుల్ అహ్జాబ్:3517)

ఎందుకంటే? ఒక రోజున ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉదాయాన్నే బయలుదేరారు, అప్పుడు ఆయన వద్ద ఒక నల్లటి దుప్పటి యున్నది. అంతలో ఆయన వద్దకు హసన్(రజియల్లాహు అన్హు) వచ్చారు, ఆయనను దుప్పటిలోపలికి తీసుకున్నారు, తరువాత హుసైన్ (రజియల్లాహు అన్హు) వచ్చారు, ఆయననూ లోపలికి తీసుకున్నారు, తరువాత ఫాతిమా (రజియల్లాహు అన్హ) వచ్చారు, ఆమెను లోపలికి తీసుకున్నారు, తరువాత హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) వచ్చారు ఆయనను కూడా ఆ దుప్పటి

లోపలికి తీసుకున్నారు. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇంటివారలారా! మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలన్నది అల్లాహ్ అభిలాష'' అని పఠించారు. (ముస్లిం)

### హజ్రత్ హసన్ మరియు హుసైన్ (రజియల్లాహు అన్హుమా) విశిష్టత :

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే నన్ను ప్రేమిస్తారో, వారు వీరిద్దరి (హసన్,హుసైన్) ని తప్పక ప్రేమించాలి.''

(నసాయీ, ఇబ్ను ఖుజైమా, హాకిమ్, సిల్‌సిలతుస్ సహీహా:312)

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు: ''వీరిద్దరు నా పుత్రులు, నా కూతురు పుత్రులు, ఓ అల్లాహ్ నేను వీరిని ప్రేమిస్తున్నాను, ఓ అల్లాహ్ నీవు కూడా వీరిని ప్రేమించు, వీరిని ప్రేమించే వారిని కూడా నీవు ప్రేమించు.''

(తిర్మీజీ:3769)

**హజ్రత్ హసన్** మరియు **హజ్రత్ హుసైన్** (రజియల్లాహు అన్హుమా) స్వర్గంలో యువకులకు నాయకులుగా ఉంటారు. (తిర్మీజీ:3768, ఇబ్ను మాజా:118)

### కర్బలా సంఘటన:

ముహర్రం నెలలో హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) నలభై హిజ్రి శకం, రమాజన్ నెలలో 21వ తేదిన షహీద్ చేయబడ్డారు. ఆ తరువాత ముఆవియా (రజియల్లాహు అన్హు) గారు హజ్రత్ హసన్ (రజియల్లాహు అన్హు) అంగీకారంతో ఏకగ్రీవంగా ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు. ఆ తరువాత హజ్రత్ హసన్ (రజియల్లాహు అన్హు) గారు ద్రోహాల కుట్రలో భాగంగా విషంతో కూడిన

భోజనం తిని షహాదత్ మరణాన్ని పొందారు. ఆ తరువాత హజ్రత్ ముఆవియా (రజియల్లాహు అన్హు) గారు అరవై హిజ్రి శకంలో మరణించారు. ఆయన మరణించే ముందు తమ కుమారుడైన 'యజీద్'ను ఖలీఫాగా నియమించారు. యజీద్ గుణహీనుడైన ఒక రాజు అని చరిత్ర చెబుతుంది. అందుచేత కూఫా ప్రజలు యజీద్‌కు బదులుగా హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారిని ఖలీఫాగా నియమించడానికి ప్రయత్నాలు చేసారు. మరియు కూఫాలో ఉన్న కొంత మంది ప్రజలు హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) ను ఖలీఫాగా ఎన్నుకుంటామనీ అనేక విధాలుగా ఆహ్వానించారు. అందువలన హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) మరియు ఆయన కుటుంబీకులు, మరియు అనుచరులతో కలిసి కూఫాకు చేరుకున్నారు. ఆయన కూఫాకు చేరుకున్న తరువాత హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారికి కూఫా ప్రజలు ద్రోహం చేసారు. ఆయనకు ఎలాంటి సహాయం చేయలేదు. మరియు యజీద్ తన ఖిలాఫత్ పదవిని వదులుకోవడం ఇష్టంలేని కారణంగా, హజ్రత్ హుసైన్ మరియు వారితో వచ్చినవారిని బంధీలుగా తమ వద్దకు తీసుకొరావలసిందిగా తన సైన్యాన్ని ఆజ్ఞాపించాడు. తరువాత యజీద్ సైన్యం హజ్రత్ హుసైన్(రజియల్లాహు అన్హు) మరియు వారి కుటుంబీకులను సులభంగా బంధీలుగా చేసుకున్నారు. యజీద్ ఆజ్ఞ మేరకు హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారిని యజీద్‌కు అప్పగించకుండా ఆ సైన్యం వారందరిని ఘోరాతి ఘోరంగా చంపివేసారు.

61వ హజ్రి శకం ముహర్రం నెలలో 10వ తేదిన (ఆషూరా) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మనుమడు హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) మరియు వారి అక్కచెల్లెళ్ళను అన్నదమ్ముళ్ళను, అన్న హసన్ గారి

బార్యబిడ్డలను, జాఫర్ మరియు అఖీల్ భార్యబిడ్డలను మరియు అనేక కూఫా ప్రజలను చంపడం జరిగింది.

హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారు ఫురాత్ అనే సముద్రం ఒడ్డున కర్బలా మైదానంలో చంపబడ్డారు. వారి భౌతికకాయాన్ని కర్బలా మైదానంలోనే ఖననం చేసారు. ఆయన మొండాన్ని అబ్దుల్లాహ్ బిన్ జియాద్ వద్దకు తీసుకువచ్చారు. అలా జరగకూడని ఒక దురదృష్టకరమైన సంఘటన కర్బలాలో జరిగింది. మరియు హజ్రత్ హుసైన్(రజియల్లాహు అన్హు) షహాదత్ అనే పుణ్యపరమైన మరణాన్ని పొందారు.

హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారిని చంపినవారు లేక వారిని చంపుటకై ప్రోత్సహించినవారు సంతోషించారు. కాని అలాంటి వారిని అల్లాహ్ హీనమైన స్థితికి నెట్టివేసాడు, వారు కూడా భయంకరమైన మరణాన్ని పొందారు.

## కర్బలా సంఘటనానంతరం:

హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) మరణానంతరం ముస్లిం సమాజం విభేదాలకు గురికాబడి అనేక వర్గాలుగా చీలిపోయి, స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిపోయి, ఇస్లామీయ రుజుమార్గాన్ని తప్పిపోయారు.

1- కొంత మంది మూర్ఖులు హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారి మరణాన్ని కోరుకున్నారు. చివరికి వారు హజ్రత్ హుసైన్ మరియు వారి కుటుంబీకులను షహీద్ చేసారు. వారి నాయకుడు ఉబైదుల్లాహ్ బిన్ జియాద్. హజ్రత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) షహీద్ చేయబడిన తరువాత ప్రతి ఏట సంతోష కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరియు వారు అసత్యమైన హదీసులను రచించారు. ఉదాహరణకు; ఎవరైతే ఆషూరా

రోజు తమ కుటుంభీకుల పట్ల ఎక్కువగా ఖర్చు చేస్తారో, వారికి ఆ సంవత్సరమంతా అల్లాహ్ అధికంగా ప్రసాదిస్తాడు. మరియు ఎవరైతే ఆ రోజున తమ కళ్ళలో సుర్మా రాసుకుంటాడో అతనికి జీవితంలో ఎన్నడు కళ్ళవ్యాధి రాదు. మరియు ఎవరైతే ఆ రోజున స్నానం చేస్తాడో అతను ఆ సంవత్సరమంతా అస్వస్థకు గురికాడు. అనే అనేక తప్పుడు విషయాలను ప్రజల్లో వ్యాపింపజేశారు. వారినే నాసిబియా ముస్లింలు అంటారు. ప్రస్తుత కాలంలో వారు లేనట్టుగానే భావించాలి. కాని వారి అసత్యమైన ప్రవచనాలు ఇప్పటికీ ప్రజల్లో ఉన్నాయి.

2- కొంతమంది ప్రజలు **'అహ్లెబైత్'** అభిమానులంటూ అతిగా వ్యవహరించారు. వారి నాయకుడు ముఖ్తార్ బిన్ ఉబైద్ అల్ కజ్జాబ్. అతని వర్గానికి చెందినవారు కర్బలా షహీదుల పట్ల శోకాన్ని, దుఃఖాన్ని వెలబుచ్చడానికి విలపించడం, మాతం చేయడం వంటి ఆచారాలను పుణ్యమైన ఆచారాలుగా భావించి ప్రతి ఏట **''మాతం''** పేరుతో ధర్మానికి విరుద్ధమైన కార్యాలను నిర్వహించి ఆరాధనలుగా భావిస్తున్నారు.

హజ్రత్ హుసైన్ మరియు వారి కుటింభీకుల షహాదత్ (మరణాంతరం) తరువాత అధర్మ పద్ధతిలో శోకాన్ని, దుఃఖాన్ని వెలబుచ్చడానికి సభలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏట వారి షహాదత్ రోజును శోకదినంగా భావించారు, ఆ శోకాన్ని బహిరంగంగా వెలబుచ్చుట కొరకై అనేక విధాలుగా చేస్తున్నారు. చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సతీమణులను, హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు), హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు), హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు), మరియు అనేక ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియమైన సహాబాలను, వారి కుటుంబీకులను అసభ్యకరమైన

పదజాలాలతో కించపరుస్తున్నారు. మరియు వారి గౌరవోన్నతలు భంగమయ్యేటట్టు కట్టుకథలు రచించారు. ముహర్రం నెల రాగానే ఆ కట్టుకథలను తమ సమావేశాలలో ప్రసంగిస్తుంటారు. మరియు **'అహ్లెబైత్'** అభిమానులంమంటూ ముసలి కన్నీళ్ళు కురిపిస్తారు. వారంతా 'కర్బలా' బాధితుల పట్ల తమ గోడును ఇలా తెలిపే ప్రయత్నాలు చేస్తారు:

''ముహర్రం నెలలో నల్ల దుస్తులు ధరిస్తారు, యా హసన్, యా హుసైన్ అంటూ తమ ఛాతీలపై బాదుకుంటుంటారు. కత్తులతో ఖడ్గాలతో కోసుకుంటారు. రక్తం కారేలా బ్లేడ్లతో గాయం చేసుకుంటారు. అగ్ని గుండం తయారు చేసి దానిలో పరుగులు పెడతారు. సామూహికంగా విలపించే మహా సభలను నిర్వహించి కేకలు పెడుతుంటారు. ముహర్రం నెల పవిత్రమైనప్పటికి అపవిత్రంగా, శుభకరమైనప్పటికి అశుభమైనదిగా భావిస్తున్నారు. అందుచేత వారు ఆ నెలంతా ఎలాంటి సంతోషమైన కార్యాన్ని నిర్వహించరు, వివాహాలు చేసుకోరు. మరియు పంజాలను (పీర్లను) స్థాపిస్తారు. వాటిని అనేక విధాలుగా ఆరాధిస్తారు'' వారినే **'షియా ముస్లింలు'** అంటారు.

భారత దేశంలో లఖ్నో, హైదరాబాద్, ఢిల్లీ, మరియు ముంబై వంటి మహా నగరాలలో **'షియా'** జాతులు ఉన్నారు. మరియు వారు ఇరాన్‌లో అతి ఎక్కువగా ఉన్నారు. వారే ఇరాన్ దేశాన్ని పరిపాలిస్తున్నారు. మరియు అమెరికా యుద్ధం తరువాత ఇరాఖ్‌లో కూడా షియా ముస్లింలు పరిపాలన చేస్తున్నారు. అలాగే వారు లేబ్నాన్ మరియు సిరియా, బహ్రైన్ దేశాలలో కూడా ఉన్నారు.

## మరణానంతరం బాధను తెలిపే ధర్మ విధానం:

హ(జత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) గారి మరణం మనందరికి దుఃఖింపబడే మరియు భాదపడే సంఘటన. అయినా మనం సమంజసమైన రీతిలో, ధర్మ విధానంలో శోకాన్ని తెలుపడం ధర్మం. కనుక అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేసాడు:

﴿ ٱلَّذِينَ إِذَآ أَصَٰبَتۡهُم مُّصِيبَةٞ قَالُوٓاْ إِنَّا لِلَّهِ وَإِنَّآ إِلَيۡهِ رَٰجِعُونَ ١٥٦ أُوْلَٰٓئِكَ عَلَيۡهِمۡ صَلَوَٰتٞ مِّن رَّبِّهِمۡ وَرَحۡمَةٞۖ وَأُوْلَٰٓئِكَ هُمُ ٱلۡمُهۡتَدُونَ ١٥٧ ﴾ البقرة: ١٥٦ - ١٥٧

**''వారికెప్పుడు ఏ ఆపదవచ్చిపడినా, నిశ్చయంగా ''మేము స్వతహాగా అల్లాహ్‌కు చెందినవారము, మేము మరలిపోవలసింది కూడా ఆయన వద్దకేకదా!'' అని అంటారు. వారిపై వారి ప్రభువు దయానుగ్రహాలు, కారుణ్యం ఉన్నాయి. సన్మార్గాన్ని పొందినవారు కూడా వీరే.''**

(సూరతుల్ బఖరా:156-157)

మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఎవరికైనా కష్టం వాటిల్లినపుడు

إِنَّا لِلَّهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُونَ – اللَّهُمَّ أْجُرْنِي فِي مُصِيبَتِي وَأَخْلِفْ لِي خَيْرًا مِنْهَا (مسلم:**1525**)

**'ఇన్నాలిల్లాహి వయిన్నా ఇలైహి రాజివూన్, మరియు అల్లాహుమ్మ అజుర్ని ఫీ ముసీబతీ వఖ్‌లిఫ్ లీ ఖైరమ్ మిన్‌హా'** పఠించడం ఎంతో మహత్పూర్వకరమైనది. (ముస్లిం:1525)

అలాగే మనకు ఎప్పుడైతే దుఃఖమైన సంఘటనలు గుర్తుకు వస్తాయో అప్పుడెల్లా మనం (إِنَّا لِلَّهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُونَ) **'ఇన్నాలిల్లాహి వయిన్నా ఇలైహి రాజివూన్,** అని చదువుకుంటే ఆ దుఃఖానికి బదులు మనకు పుణ్యం లభిస్తుంది. అని హ(జత్ హుసైన్ (రజియల్లాహు అన్హు) తెలియజేసారు.

హజ్రత్ జైనబ్ బిన్తె జహష్(రజియల్లాహు అన్హు) గారి సోదరుడు మరణించారు. మూడు రోజుల తరువాత ఆమె పరిమళాన్ని తెప్పించి పూసుకున్నారు. తరువాత ఇలా ప్రవచించారు: 'నాకు పరిమళం అవసరమేమి లేదు' కాని నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా ఇలా విన్నాను: ''ఏ మహిళఅయితే అల్లాహ్‌ను, పరలోక దినాన్ని విశ్వసిస్తుందో! ఆమె మూడు రోజులకంటే ఎక్కువగా శోకం చెయ్యడం నిషిద్ధం. కాని తన భర్త శోకం గడవు నాలుగు నెలల పది రోజుల వరకు ఉంది''

(బుఖారీ:1202, ముస్లిం: 2731).

## అతిశయిల్లటం (హద్దు మీరటం):

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) అతిశయిల్లటం నుండి ఇలా హెచ్చరించారు: **''జాగ్రత్తా! మీరు ధర్మం విషయంలో అతిశయిల్ల (హద్దుమీరి ప్రవర్తించ) కండి. నిశ్చయంగా మీకంటే ముందు జాతులు ధర్మం విషయంలో అతిశయిల్లటం వల్లనే నాశనమయ్యారు.''**

**(అహ్మద్, ఇబ్ను మాజా:3029)..**

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ఇలా హెచ్చరించారు: ''మీరు నన్ను పొగడటంలో హద్దు మీరకండీ, ఎలాగైతే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలాం) గారి పట్ల హద్దుమీరి పొగడ్తల్లో ముంచారో! నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడను మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి.'' (బుఖారీ: 3189)

హజ్రత్ అబూ హురైరా(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా ప్రవచించారు:

**لَا تَجْعَلُوا بُيُوتَكُمْ قُبُورًا وَلَا تَجْعَلُوا قَبْرِي عِيدًا وَصَلُّوا عَلَيَّ فَإِنَّ صَلَاتَكُمْ تَبْلُغُنِي حَيْثُ كُنْتُمْ**
( سنن أبي داود :**2042**)

''మీ ఇండ్లను స్మశానవాటిక చేయకండి, నా సమాధిని మీరు (ప్రజలు) ఉత్సవ కేంద్రంగా చేయకండి. అయితే నా కొరకు దరూద్ దుఆ చేయండి, మీరు ఎక్కడ ఉన్నా మీ ప్రార్థన నాకు చేరుతుంది.''(అబూదావూద్: 2042)

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ మరణ సమయాన ఇలా ప్రవచించారు:

**لَعَنَ اللَّهُ الْيَهُودَ وَالنَّصَارَى اتَّخَذُوا قُبُورَ أَنْبِيَائِهِمْ مَسَاجِدَ** (البخاري:**1301**–مسلم:**823**)

''అల్లాహ్ యూదుల్ని, క్రైస్తవుల్ని శపించాడు. వారు తమ ప్రవక్తల సమాధుల్ని సజ్దా (ఆరాధ్య) నిలయాలుగా చేసుకున్నారు.''

(బుఖారీ:1301, ముస్లిం:823)

కాని విచారకరమైన విషయం ఏమంటే, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంత హెచ్చరించినప్పటికీ ముస్లిం సమాజం ఈ **'అతి'కి** దూరంగా ఉండలేకపోయింది. హజ్రత్ హుసైన్ మరియు వారి కుటింభీకుల షహాదత్ (మరణం) తరువాత అధర్మ పద్ధతిలో శోకాన్ని, దుఃఖాన్ని వెలబుచ్చడానికి సభలు నిర్వహిస్తున్నారు. మరియు **'అహ్లెబైత్'** అభిమానులంమంటూ అధర్మరీతిలో అతిశయిల్లటిస్తున్నారు.

## ముహర్రం నెలలో అధర్మ ఆచారాలు:

3- **''అహ్లుస్ సున్నత్ వల్ జమాఅత్''**కు చెందిన కొంత మంది ప్రజలు అజ్ఞానంతో ముహర్రం పండుగ పేరుతో అనేక కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. వారు తమను తాము సున్నీలుగా పేర్కొంటారు. అయినా రుజు మార్గాన్ని తప్పిన వర్గాల **(షియా ముస్లింలు' మరియు 'నాసిబియా**

**ముస్లింలు)**కు అనుగుణంగా మన పట్టణాలలో, పల్లెలలో ప్రతి ఏట అవే కార్యాలను పుణ్యంగా భావించి ముహర్రం ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.

1- మొదటి ముహర్రం రోజున పంజాలను **'మకాన్'** అనే ప్రత్యేకమైన స్థలంలో నిలబెట్టటం జరుగుతుంది.

2-కొంతమంది ప్రజలు క్రొత్తగా పంజాను నిలబెడ్తానని మ్రొక్కుబడులు చేసుకుంటారు.

3-పది రోజుల వరకు పంజాలను పూల హారాలతో అలంకరిస్తారు మరియు ఆ పదిరోజులు ఫాతిహాలు (అర్పణాలు) చేస్తుంటారు.

4-ఏడవ రోజు నుండి ప్రతి రాత్రి స్నానం చేసి అగ్ని గుండంలో నడుస్తుంటారు. పీర్లకు ఫాతిహాలు కూడా సమర్పిస్తారు.

5-ఏడవ రోజు నుండి బెల్లం లేక ఇతర షర్బత్ కడవలు కడవలుగా తయారు చేస్తారు. స్వయంగా త్రాగుతారు, ఇతరులను కూడా త్రాపిస్తారు.

6-ముహర్రం బతాసాలు, మరియు చోంగాలు (తీపు అప్పట్లు) ఆచారంగా చేసి తింటారు, ఇతరులకు కూడా పంచుతారు.

7-పంజాల (పీర్లను)ను నిలబెట్టిన కొంతమంది పుణ్యాత్ముల ఆత్మలు తమ శరీరంలో వచ్చిందంటూ ఊగుతుంటారు. మరియు తమ పంజాను ఎత్తుకొని అగ్ని గుండంలో నడుస్తారు.

8-పంజాలు ఎత్తుకొని వీధులంతా ఊరేగిస్తూ, అనేక కనికట్టు నాటకాలు చేస్తూ, ఇంటింటా నిలబడి ఫాతిహాలు చేస్తూ, విరాళములు సేకరిస్తారు.

9-పంజాలను పట్టణము పొలిమేర తీసుకుపోయి వాటిపై ఉన్న పూలహారాలను తీసి చెరువులలో లేక బావులలో పడేస్తారు.

10–చివరిగా 'అల్‌విదా యా షుహదావు హుసైన్' అంటూ **'మర్‌సియా'** గీతాలు పాడుకుంటూ తిరిగి అదే **'మకాన్'**కు వస్తారు. తరువాత ఆ పంజాలను ఆ 'మకాన్' లోనే బద్రపరుచుకుంటారు.

11–కొంత మంది సున్నీ ముస్లింలు కూడా ముహర్రం నెలను అపశకునంగా భావిస్తారు. ఈ నెలంతా పెళ్ళిళ్ళు చేయరు, క్రొత్త పనులను ప్రారంభించరు.

ముస్లిం ప్రజలారా! మనం **''అహ్‌లుస్ సున్నత్ వల్ జమాఅత్''**కు చెందినవారము. మనం అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానానికి అనుగుణంగా అనుసరించేవారము. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన 50సంవత్సరాల తరువాత అధర్మ వ్యక్తుల చేత జొప్పించబడిన తప్పుడు ఆచారాలను ఎలా ధర్మంగా మనం భావించాలి? వాటిని మనం ఎలా ఆచరించాలి? ఒక వేళ మనం వాటిని ఆచరించినా పుణ్యం మాత్రం లభించదు, పైగా మహా పాపాలకు గురికాబడుతాము సుమా.

# 6- నెల్లూరు రొట్టెల పండుగ

నెల్లూరు ఆంధ్రరాష్ట్రానికి చెందిన ఒక జిల్లా, సముద్రం ఒడ్డున ఉన్న ఒక అందమైన పట్టణము. 12వందల సంవత్సరాల క్రితం పన్నెండు మంది అరబ్ ముస్లిములు వలస వచ్చారు అని కథనాలు చెప్పుకుంటారు. **వారందురూ జాతులకు, మతాలకు అతీతంగా శాంతిని నెలకోల్పాలని వచ్చినట్లు భావిస్తారు. మరియు కొన్ని రోజుల తరువాత వారందరూ షహీద్ కాబడ్డారనీ అంటారు.** ఆ తరువాత వారందరిని ఆ సెలయెరు (ఒక పెద్ద చెరువు) వద్దనే సమాధి చేసారు. తరువాత కొంత మంది ప్రజలు ఆ సమాధులనే దర్గాలుగా నిర్మించుకున్నారు. ఇప్పుడు ఆ పన్నెండు దర్గాలను కలిపి **'బారా షహీద్ మజార్ షరీఫ్'** అని పేర్కొంటారు. అక్కడే మరొక దర్గా **'సయ్యద్ బాబా'** అని **'లాల్ దర్గా'** పేరుతో ఉంది.

రొట్టెల పండుగ పేరుతో 10 నుండి 15 లక్షల మంది ప్రజలు ధర్మాలకు అతీతంగా, ప్రతి ఏట ముహర్రం నెలలో సందర్శిస్తారు. అక్కడ ఉత్సవాల పేరుతో ముహర్రం నెల 10, 11, 12,వ తేదిలలో రొట్టెల మార్పిడి జరుగుతుంది. అలా మూడు నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆచారాలు పాటిస్తారు.

అంటే అక్కడ వచ్చేవారి వివిధ మొక్కుబడుల ప్రకారం రొట్టెలను పేర్లు కేటాయించుకుంటారు. ఉదాహరణకు **'పిల్లల రొట్టెలు'** ఎవరికైన సంతానం లేకపోతే ఆ నదిలో నిలబడి తలపై ఆ నది నీళ్ళను తీర్థంలా చల్లుకొని, సంతానం లేనివారు సంతానం కలిగినవారి నుండి రొట్టెలను తీసుకొని

తింటారు. అలా చేస్తే సంతాన ప్రాప్తి జరుగుతుందనీ వారి మూఢ నమ్మకం. అలా సంతానం లేనివారు రొట్టెలను తిన్న తరువాత వారికి సంతానము కలిగితే, తిరిగి వచ్చి వారుకూడా రొట్టెలను ఇతరులకు ఇస్తారు. అలా అనేక మంది ప్రజలు తమ తమ మ్రొక్కుబడుల ప్రకారం ప్రతి ఏట రొట్టెల మార్పిడి జరిపే ఆచారాన్ని **'నెల్లురు రొట్టెల పండుగ'** అని అంటారు.

ప్రజల సమస్యలకు అనుగుణంగా రొట్టెలను పేర్లు పెట్టుకుంటారు. అంటే; **ఉద్యోగం రొట్టెలు, ధనం రొట్టెలు, విదేశాలకు పోయే విసా రొట్టెలు, అసెంబ్లీ రొట్టెలు, ఆరోగ్యం రొట్టెలు, వివాహం రొట్టెలు** అని వివిధ సమస్యల పేర్లతో రొట్టెల మార్పిడి జరుగుతుంది. తరువాత అక్కడికి వచ్చేవారు అక్కడ ఉన్న దర్గాలను కూడా ఆరాధిస్తారు. **ప్రతి దర్గా వద్ద జరిగే షిర్క్ మరియు బిద్అత్ వంటి అధర్మ కార్యాలను బహిరంగా పాటిస్తారు.**

'బారా షహీద్ మజార్ షరీఫ్'కు వచ్చే ప్రజలు తమ నమ్మకాల ప్రకారం నాణెల రూపంలో ఆ దర్గాలపై నాణెములను(చిల్లరడబ్బులు) విసురుతారు. దర్గాల నిర్వాహకులు దర్గాలపై నుండి రూపాయి లేక రెండు రూపాయి బిళ్ళలను తీసుకుని, ఎర్రటి లేక పచ్చటి రంగుల గుడ్డపేలికలలో చుట్టి, ప్రజల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకొని, ఆ ఒక్క రూపాయిని పది రూపాయిలకు లేక ఇరవై రూపాయిలకు విక్రయిస్తారు. ఎందుకంటే? ఆ నాణెములను ప్రజలు తమ దగ్గర ఉంచుకుంటే ధనంలో శుభాలు కలుగుతాయని నమ్మిస్తారు.

అధికమైన సంఖ్యలో స్త్రీలు అక్కడ సమావేశమవుతారు. ఎందుకంటే? మూఢ నమ్మకాల వలలో స్త్రీలే అతి ఎక్కువగా చిక్కుకుంటారు. మరియు ఇస్లాం ధర్మం తెలియని అజ్ఞాన ముస్లింలు మరియు బలహీన విశ్వాసులు

అలాంటి మూఢ విశ్వాసాలకు తొందరగా ప్రభావితులవుతారు. ఎందుకంటే? ఏదో విధంగా తమ అదృష్టాలను పరీక్షించుకొని, కష్టాలను దూరం చేసుకోవాలని వారి తపన. మన సమాజంలో అలాంటి మూఢ విశ్వాసాలు కలిగిన వారు చాలా మంది ఉన్నారు. మరియు వారు దేశ, విదేశాల దర్గాలను సందర్శించి ఆరాధిస్తూ ఉంటారు.

కనుక అల్లాహ్ వాటిని ఖండిస్తూ ఇలా తెలియజేసాడు: **''ఇవన్నీ మీరు మరియు మీ తండ్రి, తాతలు పెట్టిన పేర్లు మాత్రమే, అల్లాహ్ వీటిని గురించి ఎట్టి ప్రమాణం అవతరింప జేయలేదు. వారు కేవలం తమ ఊహాగానాలను మరియు తమ ఆత్మలు కోరే మనోవాంఛలను మాత్రమే అనుసరిస్తున్నారు. వాస్తవానికి వారి ప్రభువు తరుపునుండి వారి వద్దకు మార్గదర్శకత్వం కూడా వచ్చి ఉన్నది''** (సూరతున్ నజ్మ్:23)

అల్లాహ్ ఇలా తెలియజేసాడు: (ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: **''అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే ఊహించుకుంటున్నారో వారందరినీ పిలిచి చూడండి. భూమ్యాకాశాలలో వారికి రవ్వంత అధికారంగానీ వాటిలో వారికి ఎలాంటి వాటాగానీ లేదు. వారిలో ఏ ఒక్కడూ అల్లాహ్‌కు సహాయకుడు కూడా కాదు''** (సూరతుస్ సబా:22).

అల్లాహ్‌ను మాత్రమే ప్రార్థించాలి. భయం, భక్తి, ఆశ, ప్రేమానురాగం, మొరపెట్టుకోవడం, అణుకువ, అశక్తత, శరణు వేడుకోవడం, జిబహ్ చేయడము, మ్రొక్కుబడులు చెల్లించడం, ఉపాధిని కోరడం వంటి కార్యాలన్నీ ఆరాధనలే. కనుక ఆ ఆరాధనలు అల్లాహ్‌కే సొంతం చేసి ఆరాధించాలి. అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **మరియు మేము, నీకు పూర్వం ఏ ప్రవక్తనూ పంపినా: ''నిశ్చయంగా, నేను (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు! కావున మీరు నన్నే ( అల్లాహ్‌నే) ఆరాధించండి'' అని దివ్యజ్ఞానం (వహీ) ఇచ్చిపంపాము.''** (సూరతుల్ అంబియా:25)

అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''మీరు నిజంగానే ముస్లిములైతే అల్లాహ్‌నే నమ్ముకోండి''** (సూరతుల్ మాయిదా:23)

మరోచోట అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''అల్లాహ్‌ను నమ్ముకున్నవారికి అల్లాహ్‌యే చాలు.''** (సూరతు తలాఖ్:3)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు: **''ఎప్పుడైతే మీరు సహాయం కొరకై మొరపెట్టుకుంటారో అప్పుడు అల్లాహ్‌ను మాత్రమే సహాయానికై అర్థించండి.''** (తిర్మిజీ:2516, జిలాలుల్ జన్నహ్: 316-318).

<u>ముఖ్య గమనిక:</u> 'రొట్టెల పండుగ' పేరున మనం చేసే ఆచారాలు, ఆరాధనలు, మ్రొక్కుబడులు ధర్మం కానే కావు. **ఎవరైనా అల్లాహ్ పేరుపై తప్ప ఇతరులెవరి పేరుపైనైనా మొక్కుబడులు చెల్లిస్తే అది ''షిర్క్'' ఆచారమే అవుతుంది.** ఒక వేళ ఎవరైనా తెలిసి తెలియక మొక్కుబడులు చేసుకొని ఉంటే, వాటిని నెరవేర్చకూడదు. దాని వల్ల ఎలాంటి నష్టంగాని లేక కీడుగాని జరగదు. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు: **''ఎవరైతే అల్లాహ్ విధేయత పట్ల మ్రొక్కబడి చేసుకున్నారో వారు ఆ మ్రొక్కుబడిని తీర్చాలి. మరియు ఎవరైతే అల్లాహ్ అవిధేయత పట్ల మ్రొక్కుకున్నారో వారు ఆ మ్రొక్కబడిని తీర్చకూడదు.''**

(బుఖారీ:2602).

# 7– సఫర్ నెల వాస్తవికత

సఫర్ నెల ఇస్లామీయ క్యాలండర్ ప్రకారం రెండవ నెల. అరబ్బులలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దైవప్రవక్తగా రాక మునుపు సఫర్ నెలను అపశకునంగా భావించేవారు. మరియు ప్రాచీన అరబ్బులు ఈనెలలో ఆకాశం నుండి అనేక విపత్తులు, బాధలు, నష్టాలు అవతరిస్తాయని నమ్మేవారు. అందుకని ఈ నెలలో వివాహాలు, సంతోష సంబరాలు వంటి మంచి కార్యాలను నిర్వహించేవారు కాదు.

ప్రస్తుత కాలంలో మన ముస్లిం సమాజానికి చెందిన కొంత మంది అజ్ఞానులు, అలాంటివే మూఢ నమ్మకాల వెంటపడి వారిలాగానే సఫర్ నెల పట్ల అపశకునాలకు చెందిన కొన్ని నమ్మకాలకు గురికాబడి ఉన్నారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి:

1–మొత్తం సంవత్సరంలో పది లక్షల ఎనభై వేల విపత్తులు ఆకాశం నుండి దిగి వస్తాయని భావిస్తారు. ఆ విపత్తలలో నుండి ఒక్క సఫర్ నెలలోనే తొమ్మిది లక్షల ఇరవై వేల విపత్తులకు గురికాబడతారని భావిస్తారు.

2–సఫర్ నెల రాగానే ప్రయాణాలను మానుకుంటారు, సంతోషకరమైన సంబరాలను జరుపుకోవడం అపశకునంగా భావిస్తారు.

3–ఈ నెల మొదటి పదమూడు రోజులను **‘‘తేరతేది’’** అని పేర్కొంటూ, తీవ్రమైన విపత్తులకు గురికాబడే రోజులుగా భావిస్తారు.

4– ఈ నెలలో వివాహాలు చేసుకోరు, పెళ్ళి చూపులకు సహితం దూరంగా ఉంటారు. ఒక వేళ క్రొత్తగా వివాహాలు జరిగి ఉన్న, ఆ జంటలను పదమూడు రోజుల వరకు విడదీసి, ఒకరి ముఖాలను మరొకరు చూడడం

అపశకునంగా భావిస్తారు. అలా కాదని వారు గనుక కలుసుకుంటే, వారిద్దరిలో ఒకరు చనిపోతారు, లేక జీవితాంతం వారి మధ్య తగాదాలు ఏర్పడతాయని భావిస్తారు.

యదార్థం ఏమంటే? అలాంటి అపశకునాలకు ఇస్లాం ధర్మంలో ఎలాంటి వాస్తవికత లేదు. పైగా అలాంటి మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే? నెలలను లేక సమాయాలను అపశకునాలకు విపత్తులకు ప్రత్యేకిస్తే, అల్లాహ్‌నే తప్పు పట్టినట్లుగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసారు. కనుక ఒక హదీసు ఖుద్సీలో ఇలా ఉంది: అలాహ్ ఇలా తెలియజేసాడు: **''ఆదాము పుత్రుడు (మానవుడు) కాలాన్ని (రోజులను, నెలలను, యెడాదిని) తిట్టుతున్నాడు. మరియు నేనే కాలాన్ని. నా చేతిలోనే రాత్రింబవళ్ళ మార్పిడి ఉన్నది.''**

(బుఖారీ:4452, ముస్లిం:4170)

మరొక చోట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మీరు కాలాన్ని తిట్టకండి. నిశ్చయంగా అల్లాహ్‌యే కాలము.''

(ముస్లిం:4165)

# 8- ఆఖరి చహార్షుంబా

సఫర్ నెలకు చెందిన చివరి వారంలో ఉన్న బుధవారాన్ని ఊరుబయటకు వెళ్ళి పచ్చగడ్డిపై నడవటం పుణ్య ఆచారంగా భావిస్తారు. ఎందుకంటే? ఆ రోజే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి స్వస్థత లభించినది, మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సరదాగా ఆ రోజు పచ్చగడ్డిపై నడిచారని అంటారు. దాని కారణంగా ప్రజలు భార్యపిల్లలతో కలిసి పార్కులలో, తోటలలో షికార్లు చేస్తారు. దానిని ప్రవక్త ఆచారం అని అంటారు.

ఆ సాకుతో కొంత మంది ప్రజలు సఫర్ నెల చివరి బుధవారం తమ ఇండ్లల్లో మంచి వంటకాలు చేసుకొని, స్నానాలు చేసుకొని, క్రొత్త దుస్తులు ధరించి, బాగా అందంగా తయారయ్యి, అందాల పోటీల సభలలో పాల్గొన్నట్లు ముస్తాబు అవుతారు. చిన్నాపెద్ద, ఆడామగా అనే తేడా లేకుండా పార్కుల్లో, తోటల్లోకి పోయి ఏ విధంగా కలిసి మెలిసి షికార్లు చేస్తుంటారనేది మనం చెప్పనక్కర లేదు.

### ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) చివరి రోజులు:

సఫర్ నెల చివరి బుధవారం రోజున ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి స్వస్థత లబించిందా అంటే? దానికి జవాబు కానేకాదు. ఎందుకంటే? **''అర్రహీఖుల్ మఖ్తూమ్''** తెలుగు పేజి: 813లో ప్రవక్త గారి గురించి ఇలా ఉంది: ''ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) మరణానికి అయిదు రోజుల ముందు బుధవారం రోజున ఆయన (సల్లల్లాహు అలైహి

వసల్లం) శరీర ఉష్ణోగ్రత(జ్వరము) మరింత పెరిగిపోయింది. ఆ కారణంగానే ఆయన బాధ బాగా ఎక్కువై అపస్మారక పరిస్థితి ఏర్పడింది.''

నిజమేమంటే ఆ రోజే ఆయన అస్వస్థకు గురికాబడ్డారు. కాని మనం స్వస్థత చేకూరిందంటూ సంతోషాలు జరుపుకోవడం ధర్మమేనా? దాని వలన మనకు పుణ్యం ప్రాప్తిస్తుందా? లేక పాపం ప్రాప్తిస్తుందా? మనం ఆఖరి చహార్షుంబా పేరుతో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చరిత్రనే తప్పుగా ప్రచారం చేయడం లేదా?

ప్రియమైన ముస్లిములారా! ఆఖరి చహార్షుంబా అంటూ ప్రత్యేకమైన ఎలాంటి పుణ్యకార్యం లేదు. మరియు సఫర్ నెల గురించి ఇస్లాం ధర్మంలో ఎలాంటి అపశకునాలు లేవు. అసలు అలాంటి అపశకునాలకు గురికాకూడదని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు:

**لَا عَدْوَى وَلَا طِيَرَةَ وَلَا هَامَةَ وَلَا صَفَرَ** ...(رواه البخاري:5316 – مسلم:4116 )

**''అంటు(వ్యాధుల) దుశ్శకునం అనేవి ఒట్టిమాటలే. అపశకునాలు లేవు, గుడ్లగుబా కేకల వలన ఎలాంటి ప్రభావం లేదు, మరియు సఫర్ (నెల) ఏమి కాదు...''** (బుఖారీ: 5316, ముస్లిం: 4116)

# 9- శకునాలు ధర్మ పరిధిలో

అపశకునాల నమ్మకాలు కలిగిన ప్రజలు పూర్వపు కాలం నుండి ఈ రోజు వరకు ఉన్నారు. వారిలో ఒక్కొక్కరికి ఒక్కో విధమైన నమ్మకం. కనుక కొంత మంది రాహు కాలాన్ని నమ్ముతారు. ఆ కాలానికి అనుగుణంగా తమ జీవితాలను గడుపుతారు. ఇంకా కొంత మంది 'గర్భవతి చనిపోతే అపశకునంగా భావించి, ఆమె అంత్యక్రియలు జరపకుండా కాకులు, గద్దలు పీక్కు తినుట కొరకు ఊరు బయట ఆమె దేహాన్ని పడేసిన సంఘటనలు ఉన్నాయి. మరియు కొంత మంది ప్రజలు ఉదయాన్నే వితంతువు ఎదురుపడితే అపశకునంగా భావిస్తారు. ఒకవేళ తమ అమ్మ లేక చెల్లి లేక కూతురు విధివరాలు ఉంటే, వారిని కూడా ఎదురుగా రాకూడదని నివారిస్తారు. మరియు కొందరు వారి నివాసాలను ఇంటి వరండాలకే పరిమితం చేస్తారు.

మరియు కొందరు ఇంటి నుండి బయలదేరేటప్పుడు పిల్లి గనుక ఎదురు వస్తే, లేక ఎవరైన వారి ముందు తుమ్మినట్లయితే అపశకునంగా భావిస్తారు. తిరిగి ఇంట్లోకి పోయి కొన్ని నిమిషాలు కూర్చొన్న తరువాత తమ పనిపై బయలదేరుతారు. మరియు వీధికి ఎదురుగా ఇల్లు ఉంటే **'వీధి పోటు'** అని అపశకునంగా భావించేవారు కూడా ఉన్నారు. మరియు కొంత మంది తమ ఇంటి వాస్తు సరిలేక పోతే, దానిని అపశకునంగా భావించి కట్టిన ఇల్లును కూలదీసిన సంఘటనలు లేకపోలేదు.

సూర్య గ్రహణాన్ని, చంద్ర గ్రహణాన్ని కూడా అపశకునంగా నమ్ముతారు. గర్భిణీలపై వాటి ఛాయ పడితే పుట్టబోయే పిల్లలు గుడ్డివారిగానో,

కుంటివారిగానో పుట్టుతారని భావిస్తారు. మరియు ఫలాన తేదీలలో లేక సమయాలలో పిల్లలు జన్మిస్తే భాగ్యవంతులు కారని, కాన్పు కాక మునుపే సిజరింగ్ చేసి కడుపులో నుండి పిల్లలను బయటకు తీసిన సంఘటలు కూడా ఉన్నాయి. మరియు గ్రహణాల ప్రభావం దేవాలయాలపై ఉంటుందని పూజారులు నమ్ముతారు. **కనుక వారు దేవాలయాలను సహితం మూసివేస్తారు.**

మరియు కొంత మంది ప్రజలు పక్షులను ఎగురవేసి అవి కుడి దిశకు లేక ఎడమ దిశకు పోవటాన్నిబట్టి వారు శకునాలుగా నమ్ముతారు. తాము అనుకున్న దిశలో గాకుండా పక్షులు మరొక వైపు ఎగిరిపోతే దాన్ని అపశకునంగా భావిస్తారు. లేక అనుకున్న దిశలో ఎగిరిపోతే మంచి శకునంగా భావిస్తారు. ఇలా రక రకాల శకునాల నమ్మకాలు దేశ విదేశాల సమాజ ప్రజలలో విస్తరించి ఉన్నాయి.

ఇస్లామీయ ధర్మం ప్రకారం అపశకునం అనేది లేనే లేదు. మరియు లాభ నష్టాల అధికారం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ఓ ప్రవక్తా! ఇలా అను:

**﴿ وَإِن يَمْسَسْكَ ٱللَّهُ بِضُرٍّ فَلَا كَاشِفَ لَهُۥٓ إِلَّا هُوَ ۖ وَإِن يَمْسَسْكَ بِخَيْرٍ فَهُوَ عَلَىٰ كُلِّ شَىْءٍ قَدِيرٌ ﴿١٧﴾ ﴾ الأنعام: ١٧**

**"మరియు అల్లాహ్ నీకు ఏదైనా హాని కలిగిస్తే! ఆయన తప్ప మరెవ్వరూ దానిని తొలగించలేరు. మరియు ఆయన నీకు మేలు చేస్తే! ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు."**(సూరతుల్ అన్ఆమ్:17)

మరోకచోట ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

**﴿ وَإِن يَمْسَسْكَ ٱللَّهُ بِضُرٍّ فَلَا كَاشِفَ لَهُۥٓ إِلَّا هُوَ ۖ وَإِن يُرِدْكَ بِخَيْرٍ فَلَا رَآدَّ لِفَضْلِهِۦ ۚ ﴾** يونس: ١٠٧

''ఒక వేళ అల్లాహ్ నీకు ఏదైన ఆపద కలిగించదలిస్తే ఆయన తప్ప మరెవ్వరూ దానిని తొలగించలేరు. మరియు ఆయన నీకు మేలు చేయదలిస్తే, ఆయన అనుగ్రహాన్ని ఎవ్వడూ మళ్ళించలేడు''...

(సూరతు యూనుస్:107)

మరోకచోట ఇలా ఉంది:

**﴿ إِنْ أَرَادَنِيَ ٱللَّهُ بِضُرٍّ هَلْ هُنَّ كَٰشِفَٰتُ ضُرِّهِۦٓ أَوْ أَرَادَنِى بِرَحْمَةٍ هَلْ هُنَّ مُمْسِكَٰتُ رَحْمَتِهِۦ ۚ قُلْ حَسْبِىَ ٱللَّهُ ۖ عَلَيْهِ يَتَوَكَّلُ ٱلْمُتَوَكِّلُونَ ٣٨ ﴾ الزمر: ٣٨**

''అల్లాహ్ నాకు కీడు చేయదలుచుకుంటే – ఆయన కీడు నుండి, నన్ను తప్పించగలవా? లేక, ఆయన (అల్లాహ్) నన్ను కరుణించగోరితే ఇవి ఆయన కారుణ్యాన్ని ఆపగలవా?'' వారితో ఇంకా ఇలా అను: నాకు కేవలం అల్లాహ్ చాలు! ఆయన(అల్లాహ్)ను నమ్మేవారు (విశ్వాసులు), కేవలం ఆయన మీదే నమ్మకముంచుకుంటారు. (సూరతు జమర్:38)

**عَنْ ابْنِ عَبَّاسٍ قَالَ : كُنْتُ خَلْفَ رَسُولِ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ يَوْمًا فَقَالَ يَا غُلَامُ إِنِّي أُعَلِّمُكَ كَلِمَاتٍ احْفَظْ اللَّهَ يَحْفَظْكَ احْفَظْ اللَّهَ تَجِدْهُ تُجَاهَكَ إِذَا سَأَلْتَ فَاسْأَلْ اللَّهَ وَإِذَا اسْتَعَنْتَ فَاسْتَعِنْ بِاللَّهِ وَاعْلَمْ أَنَّ الْأُمَّةَ لَوْ اجْتَمَعَتْ عَلَى أَنْ يَنْفَعُوكَ بِشَيْءٍ لَمْ يَنْفَعُوكَ إِلَّا بِشَيْءٍ قَدْ كَتَبَهُ اللَّهُ لَكَ وَلَوْ اجْتَمَعُوا عَلَى أَنْ يَضُرُّوكَ بِشَيْءٍ لَمْ يَضُرُّوكَ إِلَّا بِشَيْءٍ قَدْ كَتَبَهُ اللَّهُ عَلَيْكَ رُفِعَتِ الْأَقْلَامُ وَجَفَّتِ الصُّحُفُ قَالَ هَذَا حَدِيثٌ حَسَنٌ صَحِيحٌ ( سنن الترمذي )**

హ|జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; నేను ఒక రోజు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి వాహనంపై ఆయన వెనుక కూర్చుని ఉన్నాను. అప్పుడు ఆయన నాతో ఇలా అన్నారు:

''ఓ అబ్బాయి! నేను నీకు కొన్ని ముఖ్యమైన విషయాలు నేర్పుతాను. నీవు అల్లాహ్‌ను గుర్తుంచుకో (అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా కట్టుబడి ఉండు) అల్లాహ్ నీకు గుర్తుంచుకుంటాడు. నీవు అల్లాహ్‌ను గుర్తుంచుకో, ఆయన నీ ముందున్నట్లే గ్రహిస్తావు (అల్లాహ్ సహాయం నీ కొరకు నిత్యం ఉంటుంది). నీవు అర్థించ దలుచుకున్నప్పుడు అల్లాహ్‌నే అర్థించు. నీవు సహాయం కోరాలనుకుంటే, అల్లాహ్‌నే సహాయం కోసం అర్థించు.

జాగ్రత్త! **లోకమంతా ఏకమై నీకు మేలు చేకూర్చాలనుకున్నా అల్లాహ్ నీ కోసం వ్రాసి పెట్టిన దానికంటే ఎక్కువేమీ అది నీకు మేలు చేకూర్చజాలదు.** ఒక వేళ నీకు కీడు తలపెట్టాలన్న ఉద్దేశ్యంతో ఏకమైనా కూడా అల్లాహ్ నీ కోసం వ్రాసి ఉంచిన దానికంటే ఎక్కువ నష్టమేమి అది కలిగించజాలదు. ఎందుకంటే కలములు పైకి లేపుకోబడ్డాయి. (విధివ్రాత వ్రాయటం అయిపోయింది.) పత్రాల సిరా ఆరిపోయింది.

(తిర్మిజీ: 2516, సహీహుల్ జామే:7957)

హజ్రత్ బురైదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) **'దుశ్శకునాలు చూసేవారు కాదు'** (అబూదావూద్:3920).

శకునమైన అపశకునమైన, దౌర్భాగ్యమైనా, కలిమి అయినా- లేమి అయినా అంతా అల్లాహ్ చేతుల్లోనే ఉన్నాయనీ, అమాయుకులను అన్యం పుణ్యం తెలియని జంతువులను, నెలలను,దినాలను లేక సమయాలను దోషులుగా నిలబెట్టడం అర్థం పర్థం లేని విషయమేననీ మనం తెలుసుకోవాలి.

# 10- రజబ్ నెల వాస్తవికత

**రజబ్ అంటే:** అరబీ భాషలో **'గౌరవమైనది, పవిత్రమైనది'**

కనుక అరబ్ వాసులు ఈ నెలను పవిత్రంగా భావించేవారు మరియు మూఢ (జాహిలియత్) కాలంలో ఈ నెలలో తమ ఆరాధ్యులైన విగ్రహాల పేరున జంతువులను బలినిచ్చేవారు. ఆ జంతువులను వారు **'అతీరా'** అని పేర్కోనేవారు. కాని ఇస్లాం ధర్మం వచ్చిన తరువాత ఆ ఆచారాన్ని నిర్మూలించడం జరిగింది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాక మునుపే, అంటే అజ్ఞాన కాలం నుండే **రజబ్, జీ ఖాయదా, జిల్ హజ్జా మరియు ముహర్రం నెలలను పవిత్రంగా భావించేవారు.** ఆ నెలలలో దండయాత్రలు లేక యుద్ధాలు, తగాదాలు వంటి కార్యాలు నిషేధించబడి యున్నవి. దానివల్ల ప్రజలు హజ్ నియమాలను శాంతి భద్రతతో నెరవేర్చుటకు అనుకూల మయ్యేది. తరువాత ఆ నిషేధిత ఆదేశం కూడా తొలిగిపోయింది. అనివార్య మైన స్థితిలో ధర్మయుద్ధాలు చేయవచ్చునని ధర్మగురువులు ఏకీభవించారు. కాని ఇతర నెలలకంటే ఎక్కువగా ఈ నాలుగు నెలల పవిత్రతను దృష్టిలో ఉంచుకొని పాపాలకు మరియు అల్లాహ్ ఎడల అవిధేయతకు గురికాకుండా జాగ్రత్త పడాలని హితోపదేశం చేసారు. (లతాయిఫుల్ మఆరిఫ్).

కనుక ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే కొన సాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి.)

ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.... (సూరతు తౌబా:36).

ప్రస్తుత కాలంలో కొంత మంది ముస్లింల చేత 'రజబ్' నెలలో ప్రత్యేకమైన నూతన కార్యాలను ఆరాధలుగా జొప్పించుకున్నారు. అంటే; నఫిల్ ఉపవాసాలు, రగాయిబ్ నమాజ్, మరియు షబే మేరాజ్ పండుగ వంటి ఆరాధనలు. ఇలాంటి ఆరాధనలు నెరవేర్చుటకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ఆదేశించినట్లు హదీసు గ్రంథాలలో ఎక్కడ రుజువులు లేవు. అయినా కొంత మంది ప్రజలు కొన్ని బలహీనమైన, మనోకల్పిత హదీసులను ఆధారంగా చేసుకొని ఆరాధిస్తున్నారు. అలాంటి హదీసుల పట్ల అనేక ఇస్లామి ముఖ్య పండితులు ఇలా తెలియజేశారు:

ఇమామ్ హజ్రత్ ఇబ్ను హజర్(రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలియజేశారు: ''రజబ్ నెలలో పాటించే ఉపవాసాలకుగాని, నఫిల్ నమాజులకుగాని ఎటువంటి ఆధారపూర్వకమైన హదీసులు లేవు'' (తబ్యీనుల్ అజబ్:71)

ఇమామ్ సియూతి (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలిపారు: ''రజబ్ నెల ఉపవాసాల గురించి ఉన్న హదీసులన్నీ నిరాధారమైనవి, మనోకల్పితమైనవి కూడా. '' (అష్షమారీఖ్ ఫీ ఇల్మిత్ తారీఖ్-40).

హజ్రత్ అలీ బిన్ ఇబ్రాహీమ్ అల్ అత్తార్(రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెవిపారు: ''రజబ్ నెల ఉపవాసాల గురించి హదీసులన్నీ నిరాధారమైనవి, మనోకల్పితమైనవి.'' (అల్ ఫాయిదుల్ మజ్మూఅ -440).

ఇమామ్ ఇబ్నుల్ జౌజి(రహ్మతుల్లాహి అలైహి) మరియు షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్ను తైమియా(రహ్మతుల్లాహి అలైహి) మరియు ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యూమ్

(రహ్మతుల్లాహి అలైహి) మరియు అనేక ప్రముఖ ధర్మ గురవుల అభిప్రాయం ప్రకారం: **''రజబ్ నెలలో పాటించే ప్రత్యేకమైన ఆరాధనల ప్రాముఖ్యతకు ఎలాంటి విశ్వాసనీయ ఆధారాలు లేవు''** అని తెలిపారు.

ప్రియమైన ముస్లిం సోదరులారా! మనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతను మరియు ఆయన చూపిన మార్గాన్ని మాత్రమే అనుసరించాలి. క్రొత్త క్రొత్త ఆచారాలను, ఆరాధనలను వెలుగులోకి తెచ్చుకొని ఆరాధించడం ధర్మ సమ్మతం కాదు. ప్రతి నెలలో ధర్మం పరమైన ఆరాధనలు ఎలాగైతే పాటిస్తున్నామో, అలాగే రజబ్ నెలలో కూడా మనం ఆరాధనలు పాటించాలి.

# 11- రజబ్‌కే కుండే

రజబ్‌కే కుండే పేరుతో ఒక పండుగ **1906వ సంవత్సరంలో భారతదేశం రాంపూర్ అనే పట్టణంలో ఆరంభమైనది. ఖుర్షీద్ అహ్మద్ మీనాయి అనే వ్యక్తి ''దాస్తానే అజీబ్'' అనే పేరున ఒక కట్టుకథ రచించాడు.**

హజ్రత్ ఇమామ్ జాఫర్ సాదిఖ్ (రహ్మతుల్లాహి అలైహి) గారి గురించి ఆయన ఆదేశించినట్లుగా అతను ఇలా రాసాడు:

''ఎవరైతే రజబ్ 22వ తేదిన నా పేరున మొక్కుబడి చెల్లిస్తూ **''కుండల ఆచారాన్ని''** పాటించి, నా పేరున తన అవసరాన్ని వేడుకుంటే అతని అవసరం తప్పక తీరుతుంది. ఒక వేళ అతని అవసరం తీరకపోతే ప్రళయ దినాన నా దుస్తుల అంచు అతని చేతిలో ఉంటుంది.''

మన అమాయక ముస్లిం ప్రజలు ఆ కథను ఆధారంగా చేసుకొని, ప్రతి ఏట **'కుండల పండుగ'** పేరుతో మ్రొక్కుబడి చెల్లిస్తూ రాత్రంతా హల్వా,

పూరీలు అర్పిస్తారు. మరియు వాటిపై ఫాతిహాలు చేస్తారు. స్వతహాగా వారు తింటారు, ఇతరులను కూడా విందుగా అహ్వానిస్తారు.

**1, ప్రియమైన ముస్లింములారా!** మీరే అలోచించండి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చనిపోయిన 1400 సంవత్సరాల తరువాత ఆరాంభమైన ఈ కార్యం ఎలా పుణ్యపరమైనిది?

**2, ధర్మానికి చెందిన ప్రతి పుస్తకంలో** మ్రొక్కుకోవడం మరియు వేడుకోవడం, అల్లాహ్ యొక్క ఆరాధనే అవుతుందని ఉంది. ఆ ఆరాధన ఆల్లాహ్‌కు మాత్రేమే సొంతం చేయాలి. అల్లాహ్‌ను తప్ప ఇతరులను మ్రొక్కుకోవడం, మొరపెట్టుకోవడం షిర్క్ అవుతుంది. అలాంటప్పుడు హజ్రత్ ఇమామ్ జాఫర్ (రహ్మతుల్లాహి అలైహి) లాంటి మహా ధర్మ గురువులు ఇలాంటి బహుదైవారాధన గురించి ఆదేశమిచ్చినట్లు, దానిని ప్రోత్సహించినట్లు మనం ఎలా భావించగలం?

**3, రజబ్ నెల 22వ తేదికి మరియు ఇమామ్ జాఫర్** (రహ్మతుల్లాహి అలైహి) గారికి సంబంధం ఏమిటి? ఆ రోజు ఆయన జననం కాదు మరియు మరణం కూడా కాదు. ఆయన 80హిజ్రీ, రమజాన్ 8వతేదిన జన్మించారు, 148హజ్రీ, షవ్వాల్ 15వ తేదిన మరణించారు. ఆయన జీవితంలో ఆ తేదిన ముఖ్యమైన సంఘటన జరిగినట్లు కూడా లేదు. ఒక రకంగా చెప్పాలంటే; రజబ్ 22వ తేదిన కాతిబే వహీ హజ్రత్ ముఆవియా (రజియల్లాహు అన్హు) గారి మరణం జరిగింది. అలాంటప్పుడు ఇమామ్ జాఫర్ (రహ్మతుల్లాహి అలైహి) గారికి మరియు రజబ్ నెలకు ఎలాంటి పొంతన లేదు.

# 12- మేరాజున్ నబీ పండుగ

రజబ్ నెల 27వ తేది **మేరాజున్ నబీ** పవిత్రమైన సంఘటన జరిగిందనీ ఆ పండుగను జరుపుకునే వారి అభిప్రాయం. అందువలన వారు ప్రతి ఏట మేరాజున్ నబీ రాత్రి ఒక పండుగ కొరకు ముస్తాబవుతారు. అలాగే తమ ఇండ్లల్లో ప్రత్యేకమైన వంటకాలు చేసుకుంటారు. మరియు ఫాతిహాలు అర్పిస్తారు. మసీదులను పచ్చటి మరియు ఎర్రటి లైట్లతో అలంకరిస్తారు, మసీదులలో ప్రత్యేకమైన నఫిల్ నమాజులు చదువుతారు. మరియు ఆ రాత్రంతా మేరాజున్ నబీ జరిగిన సంఘటను గురించి మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చరిత్ర గురించి ప్రసంగాల సభలు నిర్వహిస్తారు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై ప్రత్యేకమైన **'దరూద్ దుఆ'** లను చదువుతారు. ఆ రోజున ఉపవాసం కూడా పాటిస్తారు.

కొంతమంది ప్రజలు మేరాజున్ నబీ గురించి కొన్ని కల్పిత విషయాలు జొప్పించుకొని ప్రసంగాలు చేస్తారు, అంతే కాక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహివసల్లం)గారి పట్ల ధర్మ హద్దులు మీరి అతిగా పొగుడ్తారు. ఉదాహరణకు:

1- ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కొరకు అల్లాహ్ తన తేజస్సు తెరను తొలిగించాడు. కనుక అల్లాహ్‌ను అసలైన రూపంలో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కళ్ళారా దర్శించే భాగ్యాన్ని పొందినట్లు అంటారు.

2-ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మేరాజ్ రాత్రి అల్లాహ్ వద్దకు చేరుకునేందుకు తమ కాళ్ళ నుండి చెప్పులను తీయబోతే, అల్లాహ్ ఆయన్ని చెప్పులతో సహా ఆహ్వానించారు అని కథలు చెప్పుకుంటారు.

3- మేరాజ్ రాత్రి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను స్వయంగా సందర్శించారు మరియు అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మధ్య ఆలింగనము చేసుకునే వత్యాసం మాత్రమే మిగిలిందని అంటారు.

4- అల్లాహ్ తన తేజస్సు తెరను తొలిగించినప్పప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు అల్లాహ్‌ను చూస్తే అల్లాహ్ కూడా ప్రవక్త రూపంలోనే ఉన్నారని అంటారు.

హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సతీమణి ఆయిషా (రజియల్లాహు అన్హ) గారు ఇలా తెలియజేసారు: **''ఎవరైతే అల్లాహ్‌ను ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) **గారు కళ్ళారా చూసారనీ అంటారో వారు అల్లాహ్‌పై అబద్ధాన్ని అంటగట్టినట్లే''**......(బుఖారీ: 259)

ఇలా అనేకమైన షిర్క్‌కు చెందిన విషయాలను మేరాజ్ రాత్రిన అమాయక ప్రజల ముందు ప్రసంగిస్తారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అల్లాహ్ స్థాయికి పెంచి అల్లాహ్ అంటే ప్రవక్త, ప్రవక్త అంటే అల్లాహ్. అని విశ్వసిస్తారు. ఇలా విశ్వసించటం క్రైస్తవుల విశ్వాసంకంటే హీనమైన విశ్వాసంగా తెలుస్తుంది. ఎందుకంటే? క్రైస్తవులు శ్రీ యేసువారిని అల్లాహ్ కుమారునిగా విశ్వసిస్తారు. కాని మన ముస్లిం ప్రజలలో కొంత మంది ప్రజలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను పూర్తిగా అల్లాహ్ స్థాయికి పెంచి అనేక కవితాగానాలు రచించారు. మరియు ఆ రాత్రంతా వాటిని పాడుతుంటారు. అందుకనే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు: **''మీరు నన్ను పొగడటంలో హద్దులు మీరకండీ, ఎలాగైతే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా(అలైహిస్సలాం) గారి పట్ల**

**హద్దుమీరి పొగడ్తల్లో ముంచారో! నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడను మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి.''** (బుఖారీ: 3189)

## 13- పవిత్రమైన మేరాజ్ సంఘటన వాస్తవం

మేరాజున్ నబీ యాత్ర ఎప్పుడు జరిగిందని అడిగితే? దానికి సూటిగా ఒక జవాబుగా హిజ్రత్‌కు ఒక ఏడాది ముందు జరిగిందని చెప్పవచ్చు.

కాని ఏ నెలలో? ఏ తేదిలో అని చెప్పడానికి స్పష్టమైన ఆధారం ఇస్లామీయ చరిత్రలో భద్రపరచబడలేదు. **కనుక ప్రవక్త గారి చరిత్రను రచించినవారిలో కూడా మేరాజ్ సంఘటన గురించి అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. వాటిలో కొన్నిటిని మీ ముందు ఉంచుతున్నాము:**

1- దైవదౌత్యం ప్రసాదించబడిన సంవత్సరమే ఈ మేరాజ్ సంభవించిందని ఇమామ్ తబ్రీ కథనం.

2- దైవదౌత్యం అయిదు సంవత్సరాల తరువాత జరిగిందని ఇమామ్ నూవీ, ఇమామే ఖుర్తిబీ కథనం.

3- దైవదౌత్యం పదవ సంవత్సరం రజబ్ నెల 27వ తేదిన సంభవించిందని, సులైమాన్ మన్సూర్‌పూరి కథనం.

4- హిజ్రత్ పదహారు మసాల ముందు రమజాన్ నెలలో సంభవించిందని, లేక హిజ్రత్ పదునాలుగు మాసాల ముందు ముహర్రం నెలలో సంభవించిందని, లేక హిజ్రత్‌కు ఒక సంవత్సరం ముందు రబీఉల్ అవ్వల్ మాసంలో సంభవించిందని రచయితలు భిన్నాభిప్రాయాలు వెలబుచ్చారు.

ఏర్పైనప్పటికి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సతీమణి హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హ) గారు తదనాంతరం మేరాజ్ సంగటన జరిగినట్లు స్పష్టమవుతుంది. మరియు హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హ) గారు దైవదౌత్య శకం పదవ సంవత్సరం రమజాన్ నెలలో మరణించినట్లు తెలుస్తుంది. **కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హిజ్రత్ కంటే ఒక యేడాది ముందు మేరాజ్ సంఘటన సంభవించినదిగా భావించాలి.** (వివరాలకు (అర్రహీఖుల్ మఖ్తూమ్) మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్ర తెలుగు, 224-225 చూడండి).

**మేరాజున్ నబీ సంఘటన ఏ నెలలో మరియు ఏ తేదిన జరిగిందో అన్న విషయం మన మహానీయులైన ధర్మ గురువులకే స్పష్టమైన జ్ఞానం లేదంటే, మనం రజబ్ నెల 27వ తేదిన మేరాజున్ నబీ పండుగ జరుపుకోవడం ఎంతవరకు ధర్మం.** అలాగే మేరాజ్ రాత్రి ఆరాధనలు మరియు పగలు ఉపవాసం గనక ఇస్లామీయ సాంప్రదాయం అనుకుంటే, ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) మేరాజ్ తరువాత పన్నెండు సంవత్సరాల వరకు సహాబాల మధ్య బ్రతికున్నారు, అయినా ఆయన మేరాజ్ జరిగిన పవిత్రమైన రోజు ఇలాంటి ఆరాధనలు ఎందుకు పాటించలేదు? తరువాత సహాబాలు మేరాజ్ రోజున పండుగగా ఎందుకు నిర్వహించలేదు. ఒకవేళ వారు ప్రతి సంవత్సరం మేరాజ్ రాత్రిని ఆరాధనల కొరకు మరియు పగలు ఉపవాసం కొరకు ప్రత్యేకం చేసుకొని పర్వదినంగా నిర్వహించి ఉంటే, మేరాజ్ జరిగిన మాసము మరియు తేది కూడా స్పష్టంగా తెలిసి ఉండేది కదా! మరియు ఆ రోజున చేసే కార్యాలకు, ఆరాధనలకు ప్రవక్త ఆమోదం కూడా లభించి ఉండేది కదా!.

నా ప్రియమైన ముస్లిం సోదరులారా! మనం పుణ్యాలు చేయుట కొరకు ఆశక్తి చూపాలి, కాని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గదర్శకం ప్రకారమే మనం ఆరాధనలు చెయ్యాలి. అప్పుడే అవి అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యానికి నోచుకుంటాయి. మేరాజున్ నబీ అన్నది ఇస్లామీయ ధర్మానికి చెందిన ఒక విశ్వాసనీయ సంఘటన, మరియు ఎంతో అద్భుతమైన సంఘటన, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు చాలా కష్టాలకు, దుఃఖాలకు నష్టాలకు గురికాబడ్డారు. అంతలో హజ్రత్ ఖదీజా(రజియల్లాహు అన్హ) కూడా మృతి చెందారు. చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ సంవత్సరానికి ఆముల్ హుజ్న్ (శోక సంవత్సరం) గా భావించారు. అప్పుడు అల్లాహ్ ఆయన శోకాన్ని, మరియు దుఃఖాన్ని దూరం చేయుట కొరకు ఈ మహోన్నతమైన మేరాజ్ (గగన)యాత్రను ఏర్పాటు చేసినట్లు ధర్మగురువులు భావిస్తారు.

అక్కడ ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారు అనేక మంది ప్రవక్తలను కలిసి మాట్లాడారు. స్వర్గం, నరకం మరియు అనేక అద్భుత విషయాలను చూసారు. తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు వారి ఉమ్మత్ కొరకు అల్లాహ్ ఒక మహోన్నత బహుమానంగా, ఐదు సమయాల నమాజులను విధిగా ప్రసాదించాడు. మరియు **'సూరతుల్ బఖరా'** చివరి ఆయతులను కూడా ప్రసాదించాడు.

మనం **మేరాజున్‌నబీ** గురించి పవిత్రమైన సంఘటనగా విశ్వసించాలి, ఆ సంఘటన గురించి ఉన్న వాస్తవాలను యదాతథంగా నమ్మాలి. మరియు **ప్రతి రోజు ఐదు సమయాల నమాజును విధిగా పాటించాలి.** ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) స్వర్గం, నరకం గురించి తెలియజేసిన విషయాలను నిత్యం గుర్తుంచుకొని భయభక్తితో జీవితాన్ని గడపాలి.

# 14- షాబాన్ నెల వాస్తవికత

**హజ్రత్ ఇమామ్ హాఫిజ్ ఇబ్నే హజ్ర్** (రహ్మతుల్లాహి అలైహి) రజబ్ నెల గురించి ఇలా తెలియజేసారు: ''రజబ్ నెల పవిత్రమైన నెల కనుక అరేబియ ప్రజలు ఈ నెల గడిచిన పిమ్మట నీటి కొరకై అనేక ప్రాంతాల వైపుకు, కొండల వైపుకు బయలుదేరేవారు. కనుక ఈ నెలను షాబాన్ నెల అంటారు.'' (ఫత్హుల్‌బారీ:4/251).

## షాబాన్ నెలలో ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం:

1–హజ్రత్ ఆయిషా(రజియల్లాహు అన్హ)ఉల్లేఖనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు షాబాన్ నెలలో ప్రతి రోజు ఉపవాసం ఉండేవారు చివరకు మేమంత ఇకవారు(సల్లల్లాహు అలైహి వసల్లం) ఉపవాసాలు మానరేమో! అని అనుకునేవారము. మరియు చాలా రోజుల వరకు (ఉపవాసాలు) పాటించేవారు కాదు. చివరకు మేమంత ఇకవారు (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉపవాసాలు పాటించరేమో! అని అనుకునేవారము, మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) రమజాన్ మాసంలో తప్ప, ఇతర మాసాలలో మొత్తం నెల ఉపవాసాలు పాటించినట్లు నేను ఎప్పుడు చూడలేదు. మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) షాబాన్ నెలకంటే ఎక్కువగా ఉపవాసాలు ఇతర నెలల్లో పాటించినట్లు ఆయన్ని నేను చూడలేదు. (బుఖారీ:1833, ముస్లిం:1956)

అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతర నెలలకంటే షాబాన్ నెలలో అధికంగా ఉపవాసాలు పాటించేవారన్నమాట. కనుక మనం కూడా

షాబాన్ నెలలో అధికమైన సంఖ్యలో ఉపవాసాలు పాటించడం సున్నత్ సాంప్రదాయం:

హజ్రత్ ఉసామా బిన్ జైద్(రజియల్లాహు అన్హు) కథనం ప్రాకారం: ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని నేను ఇలా అడిగాను: ''ఓ అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీరు షాబాన్ మాసంలో (అధికంగా) ఉపవాసాలు పాటించినట్లు, ఏ ఇతర మాసాలలో అన్ని ఉపవాసాలను పాటించినట్లు నేను మిమ్మల్ని చూడలేదు'' దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా బదులిచ్చారు: ''రజబ్ మరియు రమజాన్ నెలకి మధ్య ఉన్న షాబాన్ నెల యొక్క వాస్తవం ప్రజలకు తెలియదు. ఈ నెలలో ప్రజలు చేసిన కార్యాలు అల్లాహ్ ముందు సమర్పించబడతాయి. కనుక నా పుణ్యకార్యాలు అల్లాహ్ యందు నేను ఉపవాస స్థితిలో ఉండగా సమర్పించబడాలని ఇష్టపడుతున్నాను.''

(నసాయి:2317, అబూ దావూద్, సహీహ్ ఇబ్ను ఖుజైమ)

హజ్రత్ అబూ మూసా అల్ అష్అరి (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''షాబాన్ నెల మధ్య(15వ)రాత్రిన అల్లాహ్ బహిర్గతమవుతాడు, బహుదైవారాధకుడిని మరియు సంబంధాన్ని తెంచుకున్నవాడిని తప్ప ప్రతి ఒక్కరిని క్షమిస్తాడు.''

(ఇబ్నుమాజా:1/422, సిల్‌సిలతుస్ సహీహా:1562)

## షాబాన్ 15 వ రోజు తరువాత ఉపవాసం పాటించడం నిషిద్ధం:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''షాబాన్ 15 రోజులు గడిచిన**

**పిమ్మట రమజాన్ వచ్చేవరకు ఉపవాసాలు పాటించకండి.''** (తిర్మిజి:739, అబూదావూద్:2337)

హ్జ్రత్ అబూ హురైరా(రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''రమజాన్ నెల ప్రారంభం కావడానికి ఒకటి, రెండు రోజుల ముందుగా ఎవరూ ఉపవాసం పాటించకూడదు. ఒక వేళ ఎవరైనా ఆ తేదీల్లో (ఇతర నెలల్లో కూడా) ఎడతెగకుండా ఉపవాసాలు పాటిస్తూ ఉంటే అలాంటి వ్యక్తి ఈ (షాబాన్ చివరి) తేదిల్లో ఉపవాసం పాటించవచ్చు.''** (సహీహ్ బుఖారీ)

షాబాన్ నెల మొదటి 15 రోజులలో ఉపవాసం పాటించకుండా, షాబన్ నెల చివరి 15రోజులలో ఉపవాసాలు పాటించడం నిషిద్ధం. షాబాన్ నెల పూర్తిగా శుభకరమైనది. మరియు ఆ నెలంతా ఉపవాసాలు పాటించకుండా నెల చివరిన ఒకటి లేక రెండు ఉపవాసాలు పాటించకూడదని తెలియజేయడం జరిగింది.

## షాబాన్ 15వ రోజు కొన్ని బిద్అత్ కార్యాల వాస్తవికత:

ఇమామ్ ముఖ్దిసి (రహ్మతుల్లాహి అలైహి) ఇలా ప్రకటించారు: ''448వ హిజ్రి శకంలో ఒక వ్యక్తి నాబ్లీస్ పట్టణము నుండి **'బైతుల్ ముఖద్దస్'**కు వచ్చాడు. అతని పేరు ఇబ్నే ఉబై హుమైరా అతడు చాలా చక్కగా ఖుర్ఆన్ పారాయణం చేసేవాడు. **అతను షాబాన్ 15వ రోజు రాత్రి 'బైతుల్ ముఖద్దస్'లో నఫిల్ నమాజు చదవడం ఆరంభించాడు.** అతనిని చూచి ఒకరు ఇద్దరు ముగ్గురు అంటూ ఒక పెద్ద జమాతుగా నిలబడి నమాజు నెరవేర్చారు. ఇలా ఆ రోజు నుండే ఈ బిద్అత్ ఆరాధన మొదలయ్యింది.

(అల్ బాయిస్ అలా ఇన్కారిల్ బిద్య వల్హవాదిస్: 124-125)

**1, షబేబరాత్ నమాజ్:** ప్రతి ఏట షాబాన్ నెల 15వ తేది రాత్రి 100రాకాతుల నమాజు ప్రత్యేకంగా చేస్తారు.

**2, ఆరు రకాతుల నమాజు:** దీనిని కష్టాలు తొలిగిపోవాలని, వయస్సు పెరగాలని మరియు ప్రజలతో నిరుపేక్షంగా ఉండాలని సంకల్పం చేసుకొని నమాజు నెరవేర్చుతారు.

**3, ఈ రాత్రిలో యాసీన్ సూరాను ప్రత్యేకంగా చదువుతారు.** మరియు ''అల్లాహుమ్మ యా జల్మన్ని వలా యమున్ను అలైహి యాజల్ జలాలి వల్ ఇక్రామ్'' అనే పదాలను చదువుతుంటారు.

**4,** కొంతమంది **'శుభప్రదమ్మైన రాత్రి'ని** షాబాన్ నెలలో వచ్చే15వ రాత్రిగా తలపోసారు. కాని ఇది సరైనది కాదు. ఈ గ్రంథం రమజాన్ మాసంలోని 'లైలతుల్ ఖద్ర్'లో అవతరించినట్లు ఖుర్ఆన్ ద్వారా స్పష్టంగా రూఢీ అవుతున్నప్పుడు ఇతరాత్రా రాత్రుల గురించి ఆలోచించటం ఎంతమాత్రం సరైంది కాదు.

**ఇమామ్ షిఖైరి (రహ్మతుల్లాహి అలైహి)** ఆ రాత్రి గురించి ఇలా తెలియజేశారు: ''మహాపండితులు మరియు ముహద్దీసీన్లు ఆ రాత్రి(షబేబరాత్)ని లైలతుల్ ఖద్ర్గా భావించటానికి ఎటువంటి యదార్థము లేదు'' అని తెలియజేశారు. (అస్సునన్ వల్ ముబ్తదిఆత్:146).

**ఇమామ్ నజ్మ్దీన్ అల్గైతీ (రహ్మతుల్లాహి అలైహి)** గారు ఇలా ప్రకటించారు: ''హిజాజ్ పండితులు షాబాన్ 15వ రాత్రిన చేసే ప్రత్యేకమ్మైన పుణ్యాల గురించి మరియు వాటి ఘనతను గురించి తిరస్కరించారు. వారిలో హజ్రత్ ఇబ్నే అబీ మలీకా, మరియు మదీనా జ్ఞానవంతులు ఆ రోజున చేసే ప్రత్యేకమ్మైన కార్యాలన్నీ **'బిద్అత్'** అని ఏకీభవించారు.

(అస్సునన్ వల్ బిద్అత్ అష్ షిఖైరీ: 145).

## షాబాన్ 15వ రోజు గురించి కొన్ని నిరాధారమైన హదీసులు:

బిద్అత్ ఆచారాల్లో మునిగి తేలుతున్నవారు తాము చేస్తున్నది ధర్మమేనంటూ ఈ క్రింది ఇవ్వబడే బలహీనమైన ఆధారాలను చూపుతారు. కనుక మేము మీ ముందు ఆ హదీసులను ఉంచుతున్నాము.

1–హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''షాబాన్ 15వ రోజు రాత్రి నమాజు చదవండి, పగలు ఉపవాసం ఉండండి. ఆ రోజు సూర్యస్తమయం తరువాత ప్రపంచపు ఆకాశమునకు అల్లాహ్ దిగి వస్తాడు, తరువాత ఇలా అంటాడు: ఎవరైతే నా పాపాలు మన్నించమని వేడుకుంటారో, నేను వారి పాపాలు మన్నిస్తాను. మరియు ఎవరైతే ఉపాధిని ప్రసాదించమని వేడుకుంటారో, వారికి ఉపాధిని ప్రసాదిస్తాను. ఎవరైన అస్వస్థకు గురికాబడితే వారికి స్వస్థతను ప్రసాదిస్తాను. అంకా ఇలా, అలా.... సూర్యోదయం వరకు ఇలా (ప్రసాదించే కార్యం) జరుగుతొంది'' **(ఇబ్నేమాజా, సిల్‌సిలతుజ్ జయీఫా: 2132, సిల్‌సిలతుజ్ జయీఫా వల్ మౌజూఅ: 5/154)**

2–హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఉల్లేఖనం ప్రకారం; ''ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రాత్రి నాకు కనపడలేదు, అంతలో నేను (బయటకు వెళ్ళిచూస్తే) ఆయన బఖీ శ్మశానంలో కనపడ్డారు. తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం): **''అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నీకు అన్యాయం చేస్తారనీ''** అనుకున్నావా? అని హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) గారిని అడిగారు. దానికి హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) గారు: **''మీరు ఇతర భార్యల వద్దకు పోయారేమోననీ**

**అనుకున్నాను''** అని అన్నారు. తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: ''షాబాన్ 15వ రోజు రాత్రి అల్లాహ్ ప్రపంచపు ఆకాశమునకు దిగి వస్తాడు, బనీ కలబ్ (సంతానం పేరు) గొర్రెల వెంట్రుకలకంటే ఎక్కువ మనషులను క్షమిస్తాడు.......'' (ఇబ్నుమాజా, జయీఫ్: 1389, తిర్మిజీ, జయీఫ్:3684, జయీఫుల్ జామె:1761 ).

హజ్రత్ హాఫిజ్ ఇబ్ను దహ్యా (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలియజేసారు: **''షాబాన్ 15వ రాత్రి ఆరాధనల గురించి ఏ ఒక్క హదీసు ఆధారపూర్వక మైనది లేదు. కనుక మనం ఇలాంటి ఉల్లేఖనలను విశ్వసించకూడదు.''**

అలాగే హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మతుల్లాహి అలైహి) ద్వారా ఆ రాత్రి లేక పగలు చేసే ఆరాధనల గురించి ఎలాంటి ఆదేశాలు లేవు. మరియు నాలుగు ఇమాముల కాలంలో ఆ కార్యాల గురించి ఎవరికి తెలియదు. ఎందుకంటే? **నాలుగు ఇమాముల జనన మరణాలు 80హిజ్రీశకం నుండి 214హిజ్రీ శకం మధ్యలో జరిగినవి. మరియు షాబాన్15వ నాటి బిద్అత్ 448వ హిజ్రీ శకంలో ప్రారంభమయినది. కనుక ఇది నాలుగు ఇమాముల దగ్గర బిద్అత్ కార్యాలుగానే భావించబడతాయి.**

**నా ప్రియమైన ముస్లింములారా!** మీరు ఇలాంటి బిద్అత్ కార్యాలను ఆరాధనలుగా భావిస్తున్నవారితో సహవాసం చెయ్యకండి. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఒక కార్యానికి నిజమైన ఆధారం దొరకనంతవరకు వాటిని అనుసరించకండి. ఎందుకంటే? అది ధర్మం కాని ఒక విషయం, ధర్మం కాని విషయాలను ధర్మంగా ఆచరించినా లేక పరిచయం చేసినా వారు షైతాన్ సేవకులు.

# 15–'వసీలా' ధర్మ పరిధిలో

**అరబీ నిఘంటువులో: ''వసీలా''** అంటే? సామీప్యం పొందటం. మరియు సామీప్యం పొందే సాధనం.

**ఇస్లామీయ పరిభాషలో:** ''ఏదేని ఆశయాన్ని సాధించటానికి, అల్లాహ్ సామీప్యం, సాన్నిధ్యం పొందటానికి అవలంభించబడే మార్గం లేక సాధనం అని అర్థం.

కనుక ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా ఉంది:

**﴿ يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ ٱتَّقُواْ ٱللَّهَ وَٱبْتَغُوٓاْ إِلَيْهِ ٱلْوَسِيلَةَ وَجَٰهِدُواْ فِى سَبِيلِهِۦ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٣٥﴾ ﴾ المائدة: ٣٥**

''విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. ఆయన **సామీప్యాన్ని** అన్వేషించండి. ఆయన మార్గంలో (యుద్ధ ప్రాతిపదికన) కృషి సలపండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు'' (సూరతుల్ మాయిదా:35).

**''అల్లాహ్ సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి''** అంటే; ఆయనకు దగ్గర చేర్చే సత్కార్యాలను చేయమని అర్థం.

**ఇమామ్ షౌకానీ** ఇలా అంటున్నారు: ''సామీప్యం అన్న భావంలో వున్న **'వసీలా'** భయభక్తులను సదాచరణలను సూచిస్తున్నది. వాటి ద్వారా దాసులు తమ ప్రభువు సామీప్యాన్ని పొందుతారు.'' అదే విధంగా నిషిద్ధ పనులకు, వ్యర్థ కార్యకలాపాలకు దూరంగా మసులుకోవటం ద్వారా కూడా దైవసామీప్యం ప్రాప్తిస్తుంది. కాని అజ్ఞానులు కొందరు ఈ నిజమయిన **'వసీలా'**ను వదిలేసి సమాధులలో ఖననమై ఉన్న వారిని **'వసీలా'**గా భావించారు. షరీయతులో ఇలాంటి భావనలకు, తలంపులకు ఎలాంటి

ఆధారం లేదు. అయితే తీర్పు దినాన అల్లాహ్ అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)గారికి ప్రసాదిస్తానని వాగ్దానం చేసిన **'మఖామే మహ్మూద్'** కూడా **'వసీలా'** యేనని హదీసు ద్వారా తెలుస్తుంది. అందుకే **'అజాన్'** పిలుపు తరువాత నా కోసం ఈ **'వసీలా దుఆ'** ను చేసే వారు నా 'సిఫారసు'కు అర్హులవుతారని మహనీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసారు: **''అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్ దావతిత్ తామ్మతి, వస్సలాతిల్ ఖాయిమతి, ఆతి ముహమ్మద నిల్ వసీలత వల్ ఫజీలత వబ్ అస్హు మఖామమ్ మహ్మూదా నిల్లజీ వఅత్తహు''**

(బుఖారీ, ముస్లిం, అహ్సనుల్ బయాన్ తెలుగు: 494)

అదే విధంగా దుఆ కొరకై ధర్మ పరమైన 'వసీలా' విధానాలు కొన్ని ఇలా ఉన్నాయి:

1- అల్లాహ్‌కు గల దివ్య నామాలను, దివ్యగుణా **(అస్మావుస్ సిఫాత్)** లను **'వసీలా'**గా చేసుకోవలెను. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

**﴿ وَلِلَّهِ ٱلۡأَسۡمَآءُ ٱلۡحُسۡنَىٰ فَٱدۡعُوهُ بِهَاۖ وَذَرُواْ ٱلَّذِينَ يُلۡحِدُونَ فِيٓ أَسۡمَٰٓئِهِۦۚ سَيُجۡزَوۡنَ مَا كَانُواْ يَعۡمَلُونَ ﴿١٨٠﴾ ﴾ الأعراف: ١٨٠**

''అల్లాహ్‌కు మంచి మంచి పేర్లున్నాయి. కాబట్టి మీరు ఆ పేర్లతో ఆయన్నే పిలవండి. ఆయన పేర్ల విషయంలో వక్రంగా వాదించే వారిని వదలి పెట్టండి. వారు చేస్తూ ఉండినదానికి వారు తప్పకుండా శిక్షించబడతారు''

(సూరతుల్ ఆరాఫ్:180).

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా నేర్పారు: **''అల్లాహుమ్మ ఇన్నక 'అఫువ్వున్' తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ''**

అల్లాహ్! నీవు అమితంగా **మన్నించేవాడవు.** మన్నింపును ఇష్టపడుతావు. కనుక నన్ను మన్నించు. అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

పై దుఆలో ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) **'అఫువ్వున్'** (మన్నించేవాడవు) అని అల్లాహ్ గుణాన్ని **'వసీలా'**గా ఉపయోగించారు.

2- ఏ పుణ్యాలనయితే చిత్తశుద్ధితో అల్లాహ్ కొరకు మాత్రమే చేసి ఉంటామో వాటిని **'వసీలా'**గా చేసుకోవాలి. కనుక అల్లాహ్ ఇలా తెలియ జేసాడు: **﴿ رَّبَّنَآ إِنَّنَا سَمِعۡنَا مُنَادِيٗا يُنَادِي لِلۡإِيمَٰنِ أَنۡ ءَامِنُواْ بِرَبِّكُمۡ فَـَٔامَنَّاۚ رَبَّنَا فَٱغۡفِرۡ لَنَا ذُنُوبَنَا وَكَفِّرۡ عَنَّا سَيِّـَٔاتِنَا وَتَوَفَّنَا مَعَ ٱلۡأَبۡرَارِ ١٩٣ ﴾ آل عمران: ١٩٣**

''ఓ మా ప్రభూ! నిశ్చయంగా, మేము: **'మీ ప్రభువును** విశ్వసించండి' అని విశ్వాసం వైపుకు పిలిచే అతని (ముహమ్మద్) యొక్క పిలుపు విని **విశ్వసించాము.** ఓ మాప్రభూ! మా పాపాలను క్షమించు మరియు మాలో ఉన్న చెడులను మానుండి తొలగించు మరియు పుణ్యాత్ము (ధర్మనిష్ఠాపరు) లతో మమ్మల్ని మరణింపజెయ్యి! (సూరతుల్ అల ఇమ్రాన్:193)

ఇక్కడ అల్లాహ్‌పై **'ఈమాన్'** (విశ్వాసం) ఉంచిన పుణ్యకార్యాన్ని దుఆలో **'వసీలా'**గా చేసుకోవడం జరిగింది.

3- అలాగే బనీ ఇస్రాయీల్ జాతికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఒక గుహలో ఉండగా ఆ గుహ ముఖ దారిపై ఒక బండరాయి అడ్డు పడి ద్వారం మూసుకు పోయింది. అప్పుడు ఆ ముగ్గురు వ్యక్తులు తమ తమ పుణ్యా కార్యాలను **'వసీలా'**గా చేసుకొని **(ఓ అల్లాహ్ నేను ఆ పుణ్యాన్ని చిత్తశుద్ధితో చేసాను కనుక ఈ కష్టం నుండి మమ్మల్ని విముక్తిని ప్రసాదించు అని)** అల్లాహ్‌ను మొర పెట్టుకున్నారు. దాని కారణంగా వారి దుఆ అల్లాహ్ అంగీకరించాడు. ఈ విషయం **'బుఖారీ, ముస్లిం'** హదీసు గ్రంథాలలో ఉంది.

4– తల్లి దండ్రుల, గురువుల, పుణ్యాత్ముల దుఆలను **'వసీలా'** గా చేసుకోవడం ధర్మ సమ్మతమైనది. అంటే ఒక వ్యక్తి బ్రతికున్న తన తల్లి దండ్రులను లేక గురువులను, లేక పుణ్యాత్ములను తమ కొరకై అల్లాహ్‌ను వేడుకోలసిందిగా కోరడం ధర్మం. ఎలాగైతే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు బ్రతికుండగా సహాబాలు బదర్ యుద్ధంలో విజయ ప్రాప్తి కొరకు మరియు వర్షం కొరకు మరియు అనేక సందర్భాలలో అల్లాహ్‌ను ప్రార్థించవలసిందిగా కోరుకునేవారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి కోరిక ప్రకారం దుఆ చేసేవారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన తరువాత సహాబాలు (రజియల్లాహు అన్హుం) పుణ్యాత్ములను దుఆ చేయవలసిందిగా కోరేవారు. కనుక **హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హుం) పరిపాలన కాలంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి బాబాయి హజ్రత్ అబ్బాస్ (రజియల్లాహు అన్హుం) గారిని వర్షం కొరకై దుఆ చేయలసిందింగా విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన వర్షం కొరకు నమాజు చేసి, దుఆ చేస్తే వర్షం కురిసింది.** (బుఖారీ)

అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన కారణంగా ఆయనను **'వసీలా'**గా చేసుకోకుండా, ఆ కాలంలో బ్రతికున్న గొప్ప వ్యక్తి హజ్రత్ అబ్బాస్(రజి) గారిని వర్షం కొరకై దుఆ చేయవలసిందిగా సహాబాలు కోరారు. కనుక ఆయన దుఆ చేసారు.

పైన ఇవ్వబడిన **'వసీలా'** విధానాలు ఖుర్‌ఆన్ మరియు ప్రామాణికమైన హదీసుల ఆధారంగా ధర్మ సమ్మతమైనవి. ఆ విధానాల ప్రకారం **'వసీలా'** కోరడంలో ఎలాంటి తప్పు లేదు.

# అధర్మమైన 'వసీలా'

మరణించిన ప్రవక్తలను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని, పుణ్యాత్ములను **'వసీలా'**గా చేసుకొని **(అయ్ అల్లాహ్ ముహమ్మద్(స) కే తుఫైల్ సే, ఔర్ తామామ్ అమ్బియా కే తుఫైల్ సే, ఔర్ ఔలియాకే తుఫైల్ సే మేరి దుఆకు ఖుబూల్ ఫర్మా అనే పదాలతో)** అల్లాహ్‌ను వేడుకోవడం ధర్మం కాదు. ఎందుకంటే? ఈ విధానం బిద్అత్ అవుతుంది లేక షిర్క్ వైపుకు దారి తీస్తుంది. చనిపోయిన వారిని **'వసీలా'** గా చేసుకోవడం అనేది ఖుర్ఆన్ మరియు హదీసు గ్రంథాల ద్వారా ఎక్కడ కూడా ప్రామాణికమైన ఆధారాలు లేవు.

అయినా కొంత మంది అలాంటి **'వసీలా'** గురించి కొన్ని ఆధారాలున్నాయనీ వాదిస్తారు. ఆ ఆధారాలను పరిశీలించిన పిదప అవి నిరాధారమైనవని అనేక ధర్మ గురువులు, ముహద్దిసీన్లు నిర్ధారణకు వచ్చారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి:

1- ''మీరు గనుక అల్లాహ్‌ను మొర పెట్టుకుంటే నా (ముహమ్మద్(స) అంతస్తును **'వసీలా'** గా చేసుకొని మొరపెట్టుకోండి, ఎందుకంటే? అల్లాహ్ వద్ద నా అంతస్తు గొప్ప స్థాయికి చేరి ఉంది.'' అని హదీసు చూపుతారు.

కాని పైన ఇవ్వబడిన హదీసు పూర్తిగా నిరాధారమైనది, స్వకల్పితమైనది. అని ఇమామ్ ఇబ్ను తైమియా గారు: ఫతావా ఇబ్ను తైమియాలో: 27/126, 24/319,1/319 మరియు ఇఖ్తిజావుస్ సిరాతుల్ ముస్తఖీమ్:2/783)లో నిర్ధారణ చేసారు.

2– ''ఓ అల్లాహ్ నేను నీ ప్రవక్త గా ఉన్న ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం), నీవు ఖలీల్‌గా చేసుకున్న ఇబ్రాహీం (అలైహిస్సలామ్), నీవు సంభాషించిన మూసా (అలైహిస్సలామ్) మరియు ప్రవక్త ఈసా (అలైహిస్సలామ్) గారు నీ వైపు నుండి వచ్చిన ఒక ఆత్మ, మరియు నీ ఆజ్ఞ ....'' అని ప్రవక్తలను **'వసీలా'**గా చేసుకున్నారని హదీసు చూపుతారు. ఈ హదీసు కూడా పూర్తిగా నిరాధారమైనది. (ఖాయిదతున్ ఫిత్ తవస్సుల్:1/252)

3– ''ఆదం (అలైహిస్సలామ్) గారితో తప్పు జరిగినప్పుడు క్షమాపణకై **''ఓ అల్లాహ్ నేను ముహమ్మద్(స) గారిని 'వాసీలా' గా చేసుకొని వేడుకుంటున్నాను కనుక నీవు నన్ను క్షమించు....''** అన్న హదీసు ప్రచురిస్తారు. కాని ఆ హదీసు పూర్తిగా నిరాధారమైనది, స్వకల్పితమైనది. (సిల్‌సిలతు జయీఫా: 25, 403–దలాయిలున్ నబువ్వ లిల్ బైహఖీ: 2243)

ఇలా అనేక నిరాధారమైన హదీసులను మరియు పుణ్యాత్ముల కట్టు కథలను ప్రచురించి **'వసీలా'** అన్న అధర్మమైన పద్దతినీ ప్రజల మధ్య విస్తరించడం జరిగింది. కనుక మనం **'వాసీలా'** అనే ధర్మ పరమైన విధానాన్ని అవలంభిస్తే మన దుఆలు అంగీకరించబడతాయి. బిద్అత్ మరియు షిర్క్ విధానాలకు కూడా దూరంగా ఉంటాము.

పూర్తి వివరాలకై అఖీదా పుస్తకాలను చదవండి. మరియు **''అత్ తవస్సులుల్ మష్‌రూ వల్ మమ్‌నూఅ'' (అలీ బిన్ అబ్దుల్ అజీజ్ అష్షిబిల్)** గారి పుస్తకాన్ని చదవండి.

# 16- ఉరుసుల వాస్తవికత

## దర్గాలు:

1- **దర్గాలు అంటే;** కొంత మంది ప్రజలు ఒక పుణ్యాత్ముని సమాధిని ఎన్నుకొని, అక్కడ మహిమలు జరుగుతున్నాయని దానిపై గుంబద్లు, గోపురాలు నిర్మించి, అక్కడ అర్చకులుగా కొంత మంది కూర్చుని కొన్ని కార్యాకలాపాలను నిర్వహించుకొనే స్థలాలను **'దర్గాలు'** అంటారు.

2- సమాధి చేయబడిఉన్న సంతానం నుండి ఒక వారసుణ్ణి **'సజ్జాదా నషీన్' (పీఠాధిపతి)గా** ఎన్నుకుంటారు. వారినే **'పీర్ సాహెబ్'** అంటారు. మరియు సమాధి చేయబడిన వ్యక్తిని **'వలీఅల్లాహ్'**గా భావించి దర్గా నిర్మాణం చేస్తారు.

3- కొంత మంది స్వార్థపరులు అడవుల్లో, కొండల్లో, లేక పట్టణము యొక్క పులిమేరున ఒక సమాధిని ఉద్భవింపజేసుకొని, దానికి ఒక పుణ్యాత్ముని పేరుపెట్టి, ఆ సమాధి వల్ల అనేక **'కరామత్‌లు'(మహిమలు)** జరుగుతున్నాయంటూ కట్టుకథలు చెప్పుకుంటారు. ఇలా వివిధ రకాలుగా 'దర్గా'లను నిర్మించుకుంటారు.

## దర్గాల అలంకరణ:

దర్గాల నిర్వాహకులు దర్గాల అలంకరణ కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. మొట్ట మొదట సమాధులను పటిష్టవంతం చేస్తారు. తరువాత దానిపై ఒక మహా కట్టడాన్ని నిర్మిస్తారు. మసీదుల గుంబద్‌ల వలే దానిపై కూడా గుంబద్‌లు నిర్మిస్తారు. పచ్చటి మరియు కాషాయ రంగులతో

సమాధిని కలర్ చేస్తారు. చివరికి ఒక పటిష్టవంతమైన ఆరాధన నిలయంగా నిర్మిస్తారు. తరువాత ప్రతి ఏట ఆ సమాధులను ఆకర్షణీయకంగా, మనోరంజకంగా రూపుదిద్దుతారు. దర్గాలను మరియు వాటిలో ఉన్న సమాధులను నీళ్ళతో కడిగి శుభ్రపరుస్తారు. తరువాత వాటిపైన సిల్కు చాదర్లు మరియు పూల దండలు కప్పుతారు, దర్గా మొత్తం ఎర్రటి మరియు పచ్చటి లైట్లతో అలంకరిస్తారు. పవిత్రంగా భావించి సమాధి చుట్టు దీపాలు వెలగిస్తారు, సాంబ్రాణి పొగలు రేకెత్తిస్తుంటారు. అక్కడ **'ముజావర్'** గౌరవ మర్యాదలతో కూర్చొని, అక్కడికి ఆరాధన భావంతో వచ్చేవారి కోసం సమాధి పూజలు (ఫాతిహాలు) జరుపుతుంటారు.

### ఉరుస్ ఆచారాలు:

అరబీ నిఘంటువులో **'ఉర్స్'** అర్థం: **పెళ్ళి కొడుకు లేక పెళ్ళి,** మరియు **సంతోషం** అన్న అర్థాలున్నాయి. దీనినే ప్రజలు **ఉరుస్** అని అంటుంటారు.

మన సమాజంలో ప్రసిద్ధి చెందిన **'ఉరుస్'** అంటే: పుణ్యాత్ముల పేరున నిర్మించబడిన దర్గాల(సమాధుల)వద్ద ప్రతి ఏట **మరణదినం (వర్ధంతి) ఉత్సవాలు నెరవేర్చి 'ఉరుస్'** అనే వ్యతిరేకమైన పదాన్ని వాడుతున్నారు.

పుణ్యాత్ముడని భావించిన వ్యక్తి మరణించిన తేది ప్రకారం అతని సమాధిపై **'సందల్ కి రస్మ్'** పేరుతో పూల పందిరిని తయారు చేసుకొని ఊరంతా ఊరేగిస్తూ, మహా హంగామా చేసుకుంటూ, దర్గాకి చేరుకొని అక్కడున్న సమాధిపై దానిని ఉంచుతారు. అలాగే జండాను కూడా ఊరంతా ఊరేగిస్తూ తీసుకొచ్చి ఆ దర్గాలోనే ఒక చెట్టున పాతి పెడతారు. దానిని **ఝుండా చెట్టు** అంటారు. మరియు **'మలంగ్'** అనే వ్యక్తి మూడు రోజుల

వరకు కాళ్ళను, చేతులను దారాలతో బంధించుకొని ఆ దర్గాలోనే బస చేస్తాడు. ఆ మూడు రోజుల వరకు అతను పండ్లు ఫలాలు మరియు పాలు తినుటకై తీసుకుంటాడు. తరువాత చివరి రోజున **ఫకీర్లు 'జర్బ్'** పేరున తమ **శరీరాలలో కమ్మీలు, కత్తులు పొడుచుకునే 'కనికట్టు' నాటకాలు బహిరంగంగా నిర్వహిస్తారు.**

ఈ ఉత్సవాలను మూడురోజుల పాటు జరుపుతారు. తరువాత జనసంఖ్య రాకను బట్టి ఉరుసును 15రోజుల వరకు పెంచుకుంటారు. మరియు ఆ రోజుల్లో సమాధి చుట్టుప్రక్కల మహా సంతను ఏర్పాటు చేస్తారు. ఆ సంతలో నలువైపుల నుండి వ్యాపారస్తులు అక్కడికి చేరుకొని తమ సామగ్రి అమ్మకాలు జోరుగా జరుపుకుంటారు. ఆ దర్గా సిబ్బంది ఆ వ్యాపారస్తుల నుండి బాడుగ పేరుతో సొమ్మును వసూలు చేస్తారు. ఆ సంతలో ప్రత్యేకమైన, ఆకర్శనీయమైన ఖవ్వాలీ పాడే గాయని, గాయకులు ఆటపాటల కచ్చేరీలు రాత్రంతా నిర్వహిస్తారు. ఆ రాత్రుల్లో మధ్య పానియాలు సేవించి, మతి పోయే గంజాయి త్రాగుడుతో అనేక మంది ప్రజలు ఊగుతూ తూగుతుంటారు. **ఆ 'ఉరుసుల'లో పిల్లలు, పెద్దలు మరియు వృధ్ధులు, ఆడా మగా, హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు పాల్గొంటారు. దీనిని పుణ్యాత్ముల పేరిట 'ఉరుస్' ఉత్సవాలు అని జరుపుకుంటారు.**

ఈ ఆచారాలకు మరియు ఇస్లాం ధర్మానికి ఎలాంటి సంబంధం లేదు. కనుక ఇది ఇస్లామీయ ధర్మ ఆచారం అనటం కూడా ఘోరమైన పాపమే.

## దర్గాల గురువులు మరియు వారి వాస్తవికత:

సమాధి ఆధిపత్యానికి చెందిన **పీర్‌సాహెబ్ (పీఠాధిపతి)** చుట్టూ కొందరు ప్రత్యేకమైన శిష్యులు ఉంటారు, వారిని 'ముజావర్లు' అంటారు. వీరే

అక్కడికి వచ్చే ప్రజలకు గురువులు, ఆ సమాధులకు అర్చకులు. వీరు ఇస్లామీయ ధర్మజ్ఞానం లేని మూర్ఖులు, మత్తుపానియాలు సేవించే మస్తాన్లు, గంజాయి సిగరేట్లు కాల్చే గుణహీనులు, తంబాకు మరియు పాన్‌పరాక్ నమిరే అసమర్థులు, ప్రజల విశ్వాసాలతో ఆడుకునే మంత్రగాళ్ళు, భయంభక్తి లేని షైతానులు, మోసగాళ్ళకే మోసగాళ్ళు, అమాయక ప్రజల సొమ్మును దోచుకొనే గజదొంగలు, పొట్టకోస్తే అక్షరం ముక్కరాని అజ్ఞానులు, లేనిపోని కట్టు కథలు **'ఔలియాల కారామత్తు (మహిమలు)'** అంటూ ఉపన్యాసాలు పీకుతారు. అమాయక ప్రజలకు మూఢ విశ్వాసాల లోయలోకి నెట్టుతారు. అలా **సమాధి చేయబడి ఉన్నవారిని మరియు ఆ పీఠాధిపతిని దేవుని స్థాయికి పెంచి స్పష్టమైన షిర్క్ కార్యాకాలాపాలు నిర్వహిస్తుంటారు.**

అలాంటి గుణహీనులు సంతానం లేనివారికి సంతాన ప్రాప్తిని, నిరోద్యోగులకు ఉద్యోగాలను, కష్టాల నుండి రక్షణను, నష్టాల నుండి లాభలను, దుఃఖాల నుండి సుఖాలను, అశాంతి నుండి శాంతిని, అస్వస్థత నుండి స్వస్థతను, చేతబడి నుండి రక్షణను, అపజయాల నుండి విజయాలను, అగౌరవం నుండి గౌరవాలను ప్రసాదిస్తారా! అంతే కాదు; **దేవుని ఆరాధన లేకుండానే** పరలోక **మోక్షాన్ని,** స్వర్గ ప్రవేశ పత్రాలను **సయితం** ప్రసాదిస్తామంటూ, **ఆ** పత్రాలను **కొన్నవారికి** స్వర్గమే **నిలయమంటూ** ప్రచారం **కూడా చేస్తుంటారు.**

## ఇస్లాం ధర్మంలో సమాధుల కట్టడాలు , వాటిపై ముజావర్లుగా కూర్చోవటం నిషిద్ధం:

సమాధులను సున్నంతో లేక సిమెంట్‌తో పటిష్టవంతంగా నిర్మించడం, వాటిని గొప్ప స్థానానికి పెంచడం, అక్కడ పీఠాధీపతులు (ముజావర్)గా కూర్చోవడం అధర్మమైనది. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వాటి గురించి కఠినంగా హెచ్చరించారు.

హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం):

**عَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ أَنْ يُجَصَّصَ الْقَبْرُ وَأَنْ يُقْعَدَ عَلَيْهِ وَأَنْ يُبْنَى عَلَيْهِ (رواه مسلم:970)**

**''సమాధిని పటిష్టవంతం చేయడాన్ని, దానిపై (ముజావర్లుగా) కూర్చోవటాన్ని, దానిపై కట్టడం నిర్మించడాన్ని నిషేధించారు''**

(ముస్లిం:970)

హజ్రత్ అలీ(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు: **أَنْ لَا تَدَعَ تِمْثَالًا إِلَّا طَمَسْتَهُ وَلَا قَبْرًا مُشْرِفًا إِلَّا سَوَّيْتَهُ (رواه مسلم)**

**''ప్రతి (ఆరాధ్య) విగ్రహాన్ని పగలగొట్టు మరియు ప్రతి ఎత్తుగా ఉన్న సమాధిని నేలమట్టం చెయ్యి.''**(ముస్లిం:969)

ఇక్కడ ఎత్తుగా కట్టబడిన సమాధిని సహితం నేలమట్టం చేయవలసిందిగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసారు. అయిన మన అమాయక ముస్లింలు పుణ్యాత్ముల పేరుతో లేక మహనీయుల పేరుతో సమాధుల్ని ఎత్తుగా కట్టడమే కాకుండా, వాటిపై పటిష్టవంతమైన గోపురాలు కట్టి, ఆరాధ్య నిలయాలుగా చేసుకున్నారు. మరియు వాటి వద్ద ముజావర్లుగా నియుక్తులై అమాయక ప్రజలను ధర్మం పేరుతో మోసగిస్తున్నారు.

## సమాధుల ఆరాధన:

అనేక మంది ప్రజలు మూఢ విశ్వాసాలకు గురికాబడి, సమాధుల వద్దకు జియారత్ పేరున, వాటి ఆరాధనకై పలు ప్రదేశాలకు ప్రయాణిస్తుంటారు. మరియు కొంత మంది ప్రజలు హజ్ ఆరాధనకు ప్రయాణించినట్లు సమాధుల ఆరాధనకై ప్రయాణిస్తారు. ఏ విధంగానయితే ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలో, అదే విధంగా ఆ సమాధులను ఆరాధిస్తారు. అంటే: ‘‘దర్గాల వద్ద సజ్దాలు చేయటం, వాటి చుట్టూ ప్రదక్షణలు చేయటం, అక్కడ తల నీలలు అర్పించటం, వాటి ముందు భయంభక్తిని చూపటం, అక్కడ నమాజులు చదవటం, ఖుర్‌ఆన్ పారాయణం చేయటం, వారిని మొరపెట్టుకోవటం, వారి పేరుతో మ్రొక్కుబడులు చెల్లించటం, వారి పేరున జంతువులను బలినివ్వటం, అక్కడ అన్నదానాల ఎర్పాటు చేయటం, తమ మ్రొక్కుబడుల ప్రకారం అక్కడ బస చేయటం వంటి అనేక విధాల ఆరాధనలు పాటిస్తారు.

ఆ సమాధుల పట్ల అతిగా ప్రవర్తిస్తూ వాటిని చుంబించటం, అక్కడ కాల్చబడిన అగరబత్తీల విబూదిని తబర్రుక్‌గా భావించి తినడం, దానిని శరీరంపై రుద్దుకోవటం, అక్కడ దీపాలుగా వెలిగించబడిఉన్న నూనెను, సమాధిపై ఉన్న పూలను తబర్రుక్‌గా తీసుకోవటం, టెంకాయలు మరియు తీపు వస్తువులు ఆ సమాధుల కొరకు అర్పించి, వాటిపై ఫాతిహాలు చదివిన తరువాత తబర్రుక్‌గా భావించటం వంటి అనేక విధాల కర్యకలాపాలు జరుపుతారు. దాని ప్రతిఫలంగా సమాధిలో ఉన్న ఆ **‘వలీఅల్లాహ్’** సిఫారసు అల్లాహ్ వద్ద వారికి ప్రాప్తిస్తుందని విశ్వసిస్తారు. మరియు అల్లాహ్ వద్ద వారు

ఎవరికైన సిఫారసు చేస్తే, వారి సిఫారసును అల్లాహ్ ధిక్కరించడని భావిస్తారు.

మరియు కొంత మంది ప్రజలు: **అల్లాహ్‌కు చెందిన కొన్ని అద్భుతమైన శక్తులకు 'ఔలియాలు' కూడా అర్హులని విశ్వసిస్తారు.** మరియు ఆ పుణ్యాత్ములే వారిని నష్టాల నుండి ఆదుకుంటారు, కష్టాల నుండి రక్షిస్తారు అని విశ్వసిస్తారు. అందుకని వారు దేశవిదేశాలలో పేరు ప్రతిష్టలు పొందిన దర్గాలకు **'జియారత్'** పేరున తిరుగుతుంటారు. మరియు యా అలీ మదద్, యా ముష్కిల్ కుషా దస్తగీర్, యా గౌస్ మదద్, యా ఖాజా గరీబున్ నవాజ్ వంటి షిర్క్ పదాలను వాడుతుంటారు.

దర్గాల నిర్మాణం మరియు వాటి సందర్శనం, వాటి కొరకు ప్రయాణించడం మరియు అక్కడ నిర్వహించే ఏ ఒక్క కార్యానికి ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఎలాంటి ప్రామాణికమైన సాక్ష్యాధారాలు లేవు. పైగా ఆరాధన భావంతో ఇలాంటి ప్రదేశాలకు ప్రయాణించడం లేక సందర్శించడం ఇస్లాం ధర్మంలో నిషేధించడం జరిగింది. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**لَا تُشَدُّ الرِّحَالُ إِلَّا إِلَى ثَلَاثَةِ مَسَاجِدَ الْمَسْجِدِ الْحَرَامِ وَمَسْجِدِ الرَّسُولِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ وَمَسْجِدِ الْأَقْصَى** (رواه البخاري:**1115**–مسلم:**2475**)

**"మీరు మూడు మసీదులకు తప్ప మరేచోటుకు (ఆరాధన భావంతో) ప్రయాణం చేయకండి. ఒకటి కాబతుల్లాహ్, రెండు మస్జిదే నబవి (మదీనమసీదు) మూడు మస్జిదే అఖ్సా"** (బుఖారీ:1115, ముస్లిం:2475)

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**لَا تَجْعَلُوا بُيُوتَكُمْ قُبُورًا وَلَا تَجْعَلُوا قَبْرِي عِيدًا وَصَلُّوا عَلَيَّ فَإِنَّ صَلَاتَكُمْ تَبْلُغُنِي حَيْثُ كُنْتُمْ**
**( سنن أبي داود :2042)**

**''మీ ఇండ్లను స్మశానవాటిక చేయకండి, నా సమాధిని మీరు (ప్రజలు) ఉత్సవ కేంద్రంగా చేయకండి. అయితే నా కొరకు దరూద్ దుఆ చేయండి, మీరు ఎక్కడ ఉన్నా మీ ప్రార్థన నాకు చేరుతుంది.''**

(అబూదావూద్: 2042)

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ మరణ సమయాన్న ఇలా ప్రవచించారు:

**''అల్లాహ్ యూదుల్ని, క్రైస్తవుల్ని శపించాడు. వారు తమ ప్రవక్తల సమాధుల్ని సజ్దా (ఆరాధ్య) నిలయాలుగా చేసుకున్నారు.''** (బుఖారీ)

పైన ఇవ్వబడిన హదీసులను గమనించినట్లయితే ప్రవక్తల సమాధులను ఆరాధ్య నిలయాలుగా చేసుకోకూడదని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాంటప్పుడు పుణ్యాత్ముల సమాధులను ఆరాధన పరంగా గౌరవించడం, ఆరాధన పరంగా సమాధుల వద్దకు ప్రయాణించడం, అక్కడ ఉరుసుల పేరుతో సంబరాలు జరపడం వంటి అధర్మ కార్యాలు ధర్మం ఎలా ఔతుంది? మరియు యూదులు, క్రైస్తవులు అల్లాహ్ ఆగ్రహానికి మరియు మార్గభ్రష్టత్వానికి గురికాబడిన ముఖ్య కారణం సమాధులను ఆరాధ్య నిలయాలుగా చేసుకోవడమే అన్న విషయం కూడా స్పష్టంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసుల ద్వారా తెలుస్తున్నది.

అలాగే ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) తన సమాధి వద్దకు సహితం సంబరాల (ఉరుసు) కొరకు సమావేశం కాకూడదని హెచ్చరించారు. చివరకు ఆయనపై దరూద్ పంపాలనుకున్నా సమాధి వద్దకే రావలసిన అక్కర లేదు. మీరెక్కడ నుండియైన నా కొరకు దరూద్ చదవండి, అది నా వద్దకు చేర్చబడుతుంది అన్న విషయాన్ని కూడా తెలియజేశారు.

**ఇస్లామీయ సోదరులారా!** ప్రవక్తల సమాధులకే ఉత్సవ స్థలాలుగా, ఆరాధ్య నిలయాలుగా చేసుకోవడం తప్పయితే, 'ఔలియాల' సమాధుల్ని ఉత్సవ కేంద్రాలుగా, ఆరాధ్య నిలయాలుగా చేసుకొనే ప్రశ్న ఎలా జనిస్తుంది? యదార్థం ఏమిటంటే? కొంత మంది ప్రజలు తమ స్వార్థల కొరకు ఇస్లామీయ హద్దుల్ని దాటి దర్గాల సందర్శన పేరుతో వాటిని ఆరాధ్య నిలయాలుగా, ఉత్సవ ప్రదేశాలుగా చేసుకున్నారు. అలాంటివారంతా ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) హితువుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. అందువలన సమాధుల కట్టడాలు, అక్కడ నిర్వహించే ఆరాధ్య కార్యాలు, ఖవ్వాలీల కచ్చేరీలు పూర్తిగా ఇస్లామీయ ధర్మానికి విరుద్ధం. కనుక 'ఉరుసు'లను నిర్వహించడం, ఉరుసుల కొరకు చందాలు ఇవ్వటం, వారికి సహాయం చేయటం వంటి కార్యాలన్ని ఇస్లామీయ నిజ ధర్మానికి వ్యతిరేకంగా సహాయం చేయటంతో సమానమే.

# 17 - తావీజు మరియు మంత్రించడం ధర్మ పరిధిలో

**తావీజు:** మన సమాజంలో అనేక మంది ప్రజలు తావీజుల మహిమను దృఢంగా నమ్ముతారు. చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడాలు లేకుండా మరియు ధర్మాలకు అతీతంగా తమ తమ మూఢ నమ్మకాల ప్రకారం **''తావీజు''**లను వాడుతారు. అవి వారి వద్ద ఉన్నంత వరకూ నష్టాల నుండి, భయాల నుండి, అనారోగ్యాల నుండి బలహీనత నుండి అపజయం నుండి కాపాడే మహిమగా భావిస్తారు.

తావీజును అనేక రకాలుగా వాడుతారు. ఉదాహరణకు: కొందరు దారాలకు మంత్రించి ముడిలు వేసి, కొందరు ఖుర్ఆన్ ఆయతులను లేక దుఆలను వివిధ రేకులపై వ్రాసి, చిన్న పొట్లంలా కట్టి చేతికి లేక మెడకి కట్టుకుంటారు. అలాగే కొంత మంది కొన్ని ఫోటోలను తావీజులా కట్టుకుంటారు. లేక జేబులో ఉంచుకుంటారు. మరియు కొంత మంది తమ బండ్లలో, దుకాణాలలో, ఇండ్లలో, డబ్బులు ఉంచుకునే గల్లాలలో శుభాలను ఆశిస్తూ ఖుర్ఆన్ లేక తావీజులను ఉంచుకుంటారు. మరియు కొంత మంది ప్రజలు పుణ్యాత్ముల ఫోటోలను, విగ్రహాల ఫోటోలను కూడా శుభాలుగా భావించి తమ వద్ద ఉంచుకుంటారు. మరియు కొందరు రంగురంగుల రాళ్ళను, రత్నాలను ముత్యాలను శుభాలుగా భావించి ఉంగరాలుగా ధరిస్తారు.

ఎవరైతే తావీజులను తయారు చేసి అమ్ముతున్నారో వారు ప్రజల అమాయకత్వాన్ని మరియు వారి అవసరాన్ని పసిగట్టి ఒక పెద్ద మొత్తానికి

తావీజులను అమ్ముతుంటారు. మరియు దాని వలన అనేక మంది ప్రజలు ప్రయోజనం పొందినట్లు నమ్మిస్తారు. ఇటువంటి మూఢ నమ్మకాలు మరియు విశ్వాసాలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాక ముందు నుండి సమాజంలో ఉన్నాయి.

**తావీజు అర్థం:**

**''తావీజు''** అనే పదానికి అరబీలో: **ఇవజ్, మఆజ్, ముఆజహ్** అనే అనేక పదాలున్నాయి. అరబీ నిఘంటువులో దాని అర్థం: **'శరణు కోరడం'** మరియు **'భద్రత కోరడం'.**

ఖుర్ఆన్ గ్రంథంలో పలుచోట్ల **'అల్లాహ్ శరణు'** పొందాలంటు ఉన్నది. కనుక 'అవూజు బిల్లాహి'అనే పదం కొన్ని సూరాల ప్రారంభంలో ఉంది మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనేక దుఆల పదాలను **'అవూజు'** అనే పదంతోనే ప్రారంభించారు.

ఇస్లామీయ ధర్మ ప్రకారం: **''తావీజు''** అంటే **'అల్లాహ్ శరణు'** పొందుటకై దుఆలలో వాడబడే పదం. కనుక **''అవూజు బిల్లాహి మినష్షైతాన్ నిర్రజీమ్'', ''ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్''** మరియు హదీసులో **''అవూజు బికలిమాతిల్లాహిత్ తామ్మాతి....''** అని ఉంది.

అరబీ బాషలో **''తావీజు''** అంటే; మెడలో లేక శరీర భాగాలలో చుట్టుకునే దారాలు మరియు దుఆ పొట్లాలు కావు.

భారత దేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మరియు అఫ్ఘానిస్తాన్ వంటి దేశాలలో **''తావీజ్''** అంటే; మనిషికి వచ్చే అనేక సమస్యలను దూరం చేసుకొనుటకు, పవిత్రంగా భావించే దైవ వాక్యాలను లేక మూఢ నమ్మకాల ప్రకారం

వాడుకునే కొన్ని వస్తువులను ఒక చిన్న పొట్లంలో చుట్టి హారంలా మెడలో వేసుకొనే వస్తువును **'తావీజు'** అంటారు.

మనం **తావీజు** అని చెప్పుకునే పదాన్ని: అరబీలో **''తమీమా''** అంటారు. బహువచనంగా దానిని **''తమాయిమ్''** అని అంటారు. అరబీలో **''తావీజు''** అని వాడరు.

ప్రవక్త ముహమిమద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

**(إِنَّ الرُّقَى وَالتَّمَائِمَ وَالتِّوَلَةَ شِرْكٌ) ''ఇన్నర్ రుఖా వత్ 'తమాఇమ్' వత్ తివలా షిర్కున్''** (నిశ్చయంగా మంత్రించడము, వ్రేలాడించే వస్తువులు (తమాయిమ్) మరియు ప్రేమను (దృష్టిని) తమవైపు మరల్చుకునే మంత్రాలు బహుదైవారాధన అవుతుంది).

(అబూదవూద్:3883, అహ్మద్:1/381, అల్ అహాదీస్ అస్సహీహా:331)

## తావీజులు (తమీమా) వేసుకోవడం నిషిద్ధం:

హజ్రత్ ఇబ్నె మస్ఊద్(రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''మంత్రించడాన్ని, వ్రేలాడించే తావీజులను **(తమాయిమ్)** మరియు ప్రేమను (దృష్టిని) తమవైపు మరల్చుకునే మంత్రాలను నిషేధించారు.'' (సహీహ్ అల్ జామే అస్సగీర్:6757)

హజ్రత్ ఇబ్నె మస్ఊద్(రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేసారు; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) **తమాయిమ్(తావీజుల)ను అయిష్టంగా భావించేవారు.** (ముసన్నిఫ్ అబీషైబా:5/427)

హజ్రత్ ఈసా బిన్ అబీలైలా (రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేసారు: నేను ఒక రోజు అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ గారిని పరామర్శించుటుక వెళ్ళాను.

ఆయన శరీరాన్ని చూస్తే జ్వరంతో ఎర్రబడి పోయింది. అది చూసి నేను: ''ఏదైన తావీజు వేసుకోవచ్చుగా'' అని అన్నాను. దానికి అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ గారు: ''చావు దానికంటే మేలైనది'' అని అంటూ: ''ఎవరైతే (స్వస్థత) కొరకు ఏదైనా వ్రేలాడిస్తే అతను దానికే అప్పగించబడతాడు'' అన్న హదీసును తెలియజేసారు. (సహీహ్ వ జయీఫ్ సునన్ తిర్మిజీ: 5/72).

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ప్రవచించగా నేను ఇలా విన్నాను:

**مَنْ تَعَلَّقَ تَمِيمَةً فَلَا أَتَمَّ اللَّهُ لَهُ وَمَنْ تَعَلَّقَ وَدَعَةً فَلَا وَدَعَ اللَّهُ لَهُ** (رواه أحمد وأبو يعلى وطبراني)

**''ఎవరైతే తమీమా (తావీజు)వేసుకుంటారో, అల్లాహ్ వారి (సంకల్పాన్ని) పూర్తి చేయకూడదు. మరియు ఎవరైతే గవ్వల(విదా)ను తొడుగుతారో, అల్లాహ్ వారిని ఎలాంటి మేళ్ళను ప్రసాదించకూడదు.**

(అహ్మద్, అబూ యాలా, తబ్రానీ, మజ్మవుజ్ జవాయిద్: 5/103, తుహ్ఫతుల్ అహ్వజీ:3/171)

హజ్రత్ ఆమిర్ బిన్ అల్ జుహ్నీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు పది మంది కలిసిన ఒక బృందం వచ్చింది. ఒక వ్యక్తిని మినహా, ఆయన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరి చేతిపై ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) (విధేయత) ప్రమాణం తీసుకున్నారు. తరువాత వారు: ఓ ప్రవక్తా! ''మీరు మనలో వచ్చిన తొమ్మిది మందితో ప్రమాణం తీసుకున్నారు. ఆ ఒక్క వ్యక్తితో ప్రమాణం ఎందుకు తీసుకోలేదు?'' అని అడిగారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''అతను తమీమా వేసుకొని ఉన్నాడు'' అని అన్నారు. తరువాత అతను ''తన చేతితో దానిని తెంపాడు'' ఆ తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి

వసల్లం) గారు అతని చేతిపై కూడా ప్రమాణం చేసి, ఇలా అన్నారు. ''ఎవరైతే తమీమా (తావీజు) ధరిస్తారో వారు షిర్క్ కార్యానికి వడిగట్టినట్లే''.

(ముస్నద్ అహ్మద్:16781)

కనుక తావీజు (తమీమా) అనే వస్తువులు అది ఖుర్ఆన్ ఆయతులను లేక హదీసులలో ఉన్న దుఆలను, 'తావీజు'గా ఉపయోగించడం ధర్మం కాదు. మరియు సహాబాలు, తాబయీన్‌లు తావీజులను అనుమతించేవారు కాదు. అయిన కొంత మంది ధర్మ గురువులు ఖుర్ఆన్ మరియు దుఆలతో చేయబడిన తావీజులు వేసుకోవడం ధర్మంగా భావించారు. ఈ విషయంలో కొంత మంది ధర్మ గురువుల మధ్య విభేదాలున్నాయి.

ఏదైనప్పటికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)నిషేధించిన తరువాత ఇతరులు వాడుతున్నారా? లేదా అని మనం ఆలోచించవలసిన అక్కర లేదు. ఎందుకంటే? అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

﴿ وَمَآ ءَاتَىٰكُمُ ٱلرَّسُولُ فَخُذُوهُ وَمَا نَهَىٰكُمْ عَنْهُ فَٱنتَهُوا۟ ۚ وَٱتَّقُوا۟ ٱللَّهَ ۖ إِنَّ ٱللَّهَ شَدِيدُ ٱلْعِقَابِ ﴿٧﴾ ﴾ الحشر: ٧

**''దైవ ప్రవక్త మీకు దేనిని ఇస్తారో దాన్ని తీసుకోండి, మరియు ఆయన మిమ్మల్ని దేన్నుండి నిరోధిస్తారో దాని జోలికి పోకండి. అల్లాహ్‌కు భయపడండి, అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు.''** (సూరతుల్ హష్ర్: 7)

# 18- మంత్రించడం (రుఖా) ధర్మం

మంత్రించడాన్ని (ఊదడం) అరబీ భాషలో **''రుఖా''** అని అంటారు. తావీజులను వేసుకోవడం, మంత్రించడం వంటి కార్యాలను అధర్మం అన్న విషయం కొన్ని హదీసుల ఆధారంగా మనం తెలుసుకున్నాము. కాని మంత్రించడంలో ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా అనుమతించిన విధానాలు కూడా ఉన్నాయి. దానికి అనుగుణంగా మంత్రించగలిగితే ధర్మమే. అంటే ఖుర్ఆన్ ఆయతులను మరియు హదీసులలో వచ్చిన దుఆలను చదివి మంత్రించవచ్చును. ఒక వేళ మంత్రించే పదాలు అర్థం కానివి లేక షిర్క్ పదాలు ఉంటే, వాటితో మంత్రించడం(ఊదడం) ధర్మం కాదు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''షిర్క్ (పదాలు) లేకుండా మంత్రించడం ధర్మ సమ్మతమే'' అని తెలియజేసారు.

హజ్రత్ అవ్ఫ్ బిన్ మాలిక్ అష్జయీ (రజియల్లాహు అన్హు) గారు ఇలా ప్రవక్త గారిని: ఓ దైవ ప్రవక్తా! మేము అజ్ఞాన కాలంలో ఉండగా మంత్రించేవాళ్ళం, ఇప్పుడు కూడా మనం మంత్రించడం ధర్మమేనా? అని అడిగాము. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''మీరు దేని (ఎలాంటి పదాల)తో మంత్రిస్తారో, వాటిని ముందు నాకు వినిపించండి'' అని అన్నారు. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం): **''షిర్క్ (పదాలు) లేకుంటే మంత్రించడం ధర్మ సమ్మతమే''** అని అన్నారు. (ముస్లిం:4079)

హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మంత్రించడాన్ని నిషేధించినట్లు తెలియజేసారు. తరువాత

అమర్ బిన్ హజ్మ్ జాతివారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చారు, తరువాత వారు: ''ఓ అల్లాహ్ ప్రవక్తా! మా వద్ద ఒక మంత్రించే విధానం ఉంది దానిని మేము తేలు కాటేస్తే మంత్రించే వాళ్ళము, కాని మీరు మంత్రించడాన్ని నిషేధించారు, అని అన్నారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''మీరు (మంత్రించే పదాలను) నాకు వినిపించండి'' అని అన్నారు. ఆ తరువాత వారు ఆ పదాలను ప్రవక్త గారికి వినిపించారు. తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''దీనిలో ఎలాంటి తప్పులేదు, మీలో ఎవరైనా తమ సోదరులకు మేలు చెయ్యాలనుకుంటే వారికి మేలు చెయ్యండి'' (ముస్లిం:4078)

హజ్రత్ ఇబ్ను మస్వూద్ (రజియల్లాహు అన్హు) గారి భార్యా కథనం; ఒక రోజు నా ప్రక్కన ఇబ్ను మస్వూద్(రజియల్లాహు అన్హు) గారు కూర్చున్నారు. తరువాత నా మెడలో ఒక దారాన్ని(తావీజును)చూసారు. ఇదేమని? నన్ను అడిగారు. దానికి నేను: **''దీని(తావీజు)లో మంత్రించడం జరిగింది''** అని అన్నాను. తరువాత ఆయన ఆ దారాన్ని తెంపి: **''అబ్దుల్లాహ్ సంతతివారలారా! ''నిశ్చయంగా మీరు బుహుదైవారాధనకు అర్హులు కారు''** ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హెచ్చరించిన హదీసును ఇలా తెలియజేసారు: **''నిశ్చయంగా మంత్రించడము, వ్రేలాడించే వస్తువులు (తమాయిమ్) మరియు ప్రేమను (దృష్టిని)తమవైపు మరల్చుకునే మంత్రాలు బహుదైవారాధన.''** తరువాత నేను ''అలా మీరు ఎందుకు మాట్లాడుతున్నారు'' అంటూ ''నా కంటిలో నొప్పిగా ఉంది, కనుకనే నేను ఒక మంత్రించే 'యహూది' వద్దకు పోయి మంత్రించుకున్నాను, దాని వలన నా కంటి నొప్పి దూరమైపోయింది'' అని అన్నాను. దానికి ఇబ్ను

మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) గారు: **''అది షైతాన్ పని, అతను తన వ్రేలుతో నీ కంటిలో పొడిచి బాధను కలిగించేవాడు, నీవు అతని వద్ద మంత్రించిన కారణంగా, ఆ షైతాన్ మానుకున్నాడు''** అని తెలియజేసి, నీవు ఇలా చదివితే చాలు అంటూ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పిన దుఆను: **''అజ్‌హబిల్ బఆస రబ్బన్ నాసి వష్ఫీ అన్‌తష్ షాఫీ, లా షిఫాఅ ఇల్లా షిఫావుక, షిఫాఅన్ లా యుగాదిరు సఖమన్''** పఠించారు.

(అబూదావూద్: 3883, ఇబ్నుమాజా: 3530, ఇబ్ను హిబ్బాన్, హాకిమ్)

ధర్మ పరంగా మంత్రించే కార్యం పుణ్యమైనది. కాని కొందరు ధనానికి ఆశపడి మంత్రించడం ధర్మం అంటూ అదేపనిగా ఊరురా తిరుగుతూ మంత్రించే కార్యాన్ని వృత్తిగా చేసుకున్నారు. మరియు కొంత మంది ధర్మగురువులు ఇమామత్ వంటి గురు భాద్యతను కూడా వదలీ అదేపనిలో నిమగ్నమై ఉన్నారు. కనుక అలాంటివారు చాలా వరకు డబ్బులకు ఆశపడి అధర్మపరంగా ఉన్న తావీజులను, మంత్రించే అధర్మ విధానాలను కూడా ఉపయోగిస్తున్నారు. చివరికి అమాయక ప్రజలు తమ ధనాన్ని నష్టపోవటమే కాకుండా, ఘోరమైన షిర్క్ పాపంలో కూడా పడుతున్నారు.

## మంత్రించుటకై కొన్ని సూరాలను మరియు ఆయతులను, దుఆలను చదవడం ధర్మ సాంప్రదాయం:

1- సూరతుల్ ఫాతిహా. 2, ఆయతుల్ కుర్సి. 3, సూరతుల్ కాఫిరూన్.
4, సూరతుల్ ఇఖ్లాస్. 5, సూరతుల్ బలఖ్ 6, సూరతున్ నాస్.

పైన ఇవ్వబడిన సూరాలను మూడు మూడు సార్లు లేక ఏడేసి సార్లు లేక తొమ్మిదేసి సార్లు చదివి తరువాత:

**''అల్లాహుమ్మ రబ్బన్నాసి అజ్హబిల్ బాస వష్ఫి అన్తష్ షాఫి, లా షిఫాఅ ఇల్లా షిఫావుక షిఫాఅన్ లా యుగాదిరు సఖమన్''** చదవాలి.

2, బిస్మిల్లాహి ఉర్ఖీక మిన్ కుల్లి షైయిన్ యూజీక, వ మిన్ షర్రి కుల్లి నఫ్సిన్ అవ్ ఐనిన్ హాసిదిన్, అల్లాహుమ్మ యష్ఫీక బిస్మిల్లాహి ఉర్ఖీక.

**3, అవూజు బికలిమా తిల్లాహిత్ తామ్మాతి మిన్ షర్రిం మా ఖలఖ్.** చదివి రోగికి ఊదడం మంచిది.

7, సూరతుల్ ఫలఖ్. సూరతున్ నాస్. 8 సూరతు యూనుస్ నుండి అయిదు ఆయతులు (79వ ఆయతు నుండి 83వ ఆయతువరకు).

9, **సూరతుల్ ఆరాఫ్** మూడు ఆయతులు 117-118-119 చదివి రోగిపై ఊదాలి. మరియు సూరతు తాహా ఐదు ఆయతులు **65వ ఆయతు నుండి 69వ ఆయతు వరకు చదివి** రోగులకు మరియు చేతబడికి గురికాబడిన వారిపై ఊదవచ్చును. దాని వలన అల్లాహ్ చిత్తమైతే మరియు అల్లాహ్ కరుణ కటాక్షాలతో స్వస్థత చేకూరుతుంది.

# 19- చేతబడి మరియు ఇంద్రజాలం వాస్తవికత

చేతబడి చేయువారిని మాంత్రికులు మరియు ఇంద్రజాలికులు అంటారు.

**అరబీలో చేతబడిని ''సిహ్ర్''** అంటారు.

మరియు **మాంత్రికుడిని ''సాహిర్''** అంటారు.

మన సమాజంలో హేతువాదులు, దైవాన్ని, విశ్వసించనివారు, షైతానుల ఉనికిని తిరస్కరిస్తారు. మరియు శాస్త్రవేత్తలు చేతబడి లేదని నమ్ముతారు. మరియు వారు చేతబడి ప్రభావాన్ని మూఢ నమ్మకాలుగా వాదిస్తారు.

వాస్తవం ఏమంటే? చేతబడి ప్రభావాన్ని ప్రాచీన కాలం నుండి ప్రజలు ఎదుర్కుంటున్నారు. అనేక మంది ప్రజలు దాని వలన నష్టాలకు గురికాబడుతున్నారు. అలా ప్రభావితులైనవారిని మన సమాజంలో అనేక మంది ప్రజలను మనం చూస్తునే ఉన్నాము. అలాగే ప్రాచీన కాలం నుండి యూదులు మరియు క్రైస్తవులు కూడా చేతబడి ప్రభావం ఉంటుందని విశ్వసిస్తారు. మరియు వారి గ్రంథాలలో కూడా చేతబడి వాస్తవాన్ని తెలియజేయడం జరిగింది. అలాగే ముస్లిములు కూడా చేతబడి వాస్తవాన్ని ధృవీకరిస్తారు. ప్రజలపై దాని ప్రభావం ఉంటుందని కూడా నమ్ముతారు. అంతే కాకుండా దాని కారణంగా అనారోగ్యాలకు, బాధలకు గురికాబడి కొన్ని సార్లు చనిపోయే సంఘటనలు కూడా జరుగుతాయి. దాని గురించి ఖుర్‌ఆన్‌లో కూడా ప్రస్తావన వచ్చింది. మరియు చేతబడి విద్యను నేర్చుకునేవారు ఒక ఘోరమైన పాపంలో పడినట్లేననీ భావించడం జరిగింది.

చేతబడి ముఖ్య ఉద్దేశాలలో ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురాల్లో కలతలు రేపి, అనుమానాల బీజాలు నాటి, వాళ్ళ సంసారాల్లో నిప్పులు

పోయాలనీ, కాపురాలను కూల్చాలనీ వారు తహతహలాడుతారు. అంటే; అది వారి వారి అధోగతికి పాలౌవటానికీ ఒక నిదర్శనం, కొంపలు కూల్చే వారి కార్యక్రమంలో ఒక ముఖ్యాంశం అన్నమాట.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''కానీ నిశ్చయంగా షైతానులు సత్యాన్ని తిరస్కరించారు. వారు బాబీలోన్ నగరమందు, హారూత్, మారూత్ అనే ఇద్దరు దైవదూతల ద్వారా తేబడిన జాలవిద్యను ప్రజలకు నేర్పుచుండిరి. ఎవరికైనా ఆ విద్యను నేర్పేటప్పుడు, వారిద్దరు (దేవదూతలు) ఇలా చెప్పేవారు: ''నిశ్చయంగా, మేము (మానవులకు) ఒక పరీక్ష! కాబట్టి మీరు (ఈ జాలవిధ్యను నెర్చుకొని) సత్య తిరస్కారులు కాకండి.'' అయినప్పటికీ వారు (ప్రజలు), భార్యా భర్తలకు ఎడబాటు కలిగించే (జాలవిద్య) వారిద్దరి దగ్గర నేర్చుకునేవారు. మరియు అల్లాహ్ అనుమతి లేనిదే, దానిద్వారా ఎవరికీ ఏ మాత్రం హాని కలిగించలేరు. మరియు వారు నేర్చుకునేది, వారికి నష్టం కలిగించేదే. కాని లాభం కలిగించేది ఎంత మాత్రం కాదు. మరియు వాస్తవానికి దానిని (జాలవిద్యను) స్వీకరించేవానికి పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భాగం లేదని వారికి బాగా తెలుసు. మరియు వారు ఎంత తుచ్ఛమైన సొమ్ముకు బదులుగా తమనుతాము అమ్ముకున్నారు! ఇది వారికి తెలిస్తే ఎంత బాగుండేది.''** (సూరతుల్ బఖరా:102)

మూసా (అలైహిస్సలాం) కాలంలో జాలవిద్య మంచి ఊపుమీద ఉండేది. మరియు మూసా (అలైహిస్సలాం) గారి మహిమలను చూసి ఫిరౌన్ జాలవిద్యనేని తలపోసి, మాంత్రిక విద్యలో ఆరితేరిన వారిని సమీకరించాడు. ఆ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''వారు నిపుణులైన**

**మాంత్రికులందరిని తీసుకువస్తారు. ఆ విధంగా మాంత్రికులు ఫిరౌను వద్దకు వచ్చారు, ''మేము గనక గెలిస్తే మాకేదైనా పారితోషికం లభిస్తుందా?'' అని విన్నవించుకున్నారు. – ''ఔను, అంతే కాదు, మీరు నా సన్నిహితుల్లో చేరుతారు''** అని ఫిరౌను అన్నాడు.

(సూరతుల్ బఖరా:112-114)

కనుక ఈ ప్రపంచంలో చేతబడి అన్నది వాస్తవం. అది తిరస్కరించలేని ఒక నగ్న సత్యం. ఆ విద్యను నేర్చుకోవడం ఇస్లామీయ ధర్మ ప్రకారం ఘోరమైన పాపం. ఎవరైనా ఆ విద్యను నేర్చుకొని చేతబడి చేస్తే అవిశ్వాసంలో పడినట్లే.

మాంత్రికులు మరియు ఇంద్రజాలికలు షైతానులకు బానిసలు. వారికి అనుగుణంగా కొన్ని సాహసాలు చేసి అవసరమైతే షైతానులు కోరిన వస్తువులను సమర్పించి పూజలు నిర్వహిస్తారు. మరియు షైతానుల మెప్పు పొందుటకై పశువులను, మనుషులను కూడా బలిచేయుటకు వెనకాడరు. అలా షైతానుల సహాయంతో ప్రజలను అనేక సమస్యలకు గురిచేస్తారు.

అల్లాహ్ చిత్తమైతే తప్ప చేతబడి ఎవరిని నష్టం చేకూర్చదు. అల్లాహ్ ఆదేశం మరియు అనుమతితోనే దాని ప్రభావం ఉంటుంది. ఎందుకంటే ఈ సకల లోకాలలో ప్రతి వస్తువు అల్లాహ్ శక్తికి లోబడి ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై చేతబడి జరిగింది. కాని అల్లాహ్ ఆయనకు దాని హాని నుండి రక్షించాడు. ఆయనపై చేతబడి కొరకు వాడబడిన వస్తువులను కనుగొని దాని ప్రభావాన్ని తొలగించడం జరిగింది. ఆ తరువాత అల్లాహ్ ఆయనకు స్వస్థను ప్రసాదించాడు. ఖుర్ఆన్ గ్రంథంలో ఉన్న చివరి రెండు సూరాలు మరియు వాటి వాఖ్యానం అధ్యాయనం చేయండి.

# 20- మాంత్రికులు మరియు జ్యోతిష్కులు

జ్యోతిష్కులు తమ వద్ద భవిష్యత్తుకు సంబంధించిన జ్ఞానం ఉందని జోష్యము లేక సోదె చెప్పుతుంటారు. అరబీలో ఇలాంటి వారిని **'కాహిన్'** **'మునజ్జిమ్', 'అర్రాఫ్'** అనే పేర్లతో పిలుస్తారు. వాస్తవంగా మాంత్రికుల, జ్యోతిష్కుల ప్రభావం సమాజంపై చాలా తక్కువగా ఉంటుంది. కాని వాటి నమ్మకాలు మాత్రం మన సమాజంలో చాలా వరకు విస్తరించి ఉన్నాయి. కనుక మనలో కొందరు అస్వస్థకు గురికాబడి రెండు, మూడు సార్లు డాక్టర్ వద్దకు పోయి వచ్చిన తరువాత కూడా వారికి స్వస్థత చేకూరకపోతే, ఇది చేతబడి ప్రభావం అంటూ అనుమానాలకు గురికాబడి మాంత్రికుల, జ్యోతిష్కుల చుట్టు తిరగడం ఆరంభిస్తారు. మరియు కొన్ని సార్లు ఒక కుటుంబంలో ఒకరి తరువాత ఒకరు అస్వస్థతకు గురికాబడిన లేక వ్యాపారాలలో నష్టాలు జరిగినా, లేక పెళ్ళిలు తొందరగా జరగకపోయినా వాటి పరిష్కారం కొరకు జ్యోతిష్కులు లేక మాంత్రికుల వద్దకే వెళ్తుంటారు. మరియు తప్పిపోయిన వస్తువుల గురించి తెలుసుకోవటానికి కూడా వారి వద్దకు వెళ్తుంటారు. మరియు రాజకీయ నేతలు తాము ఎన్నుకోబడతామా, లేదా? అనే విషయాలను తెలుసుకొనుట కొరకు వారి వద్దకు పోయి, వారు చెప్పినట్టుగా నమ్ముతారు.

మాంత్రికుల మరియు జ్యోతిష్కుల వద్ద భవిష్యత్తుకు సంబంధించిన జ్ఞానం ఎలా ఉంటుంది? అనే ప్రశ్నకు జవాబుగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి హదీసులను చూస్తే అర్థమవుతుంది.

హ్జ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) ప్రవక్త ముహమ్మద్ ( సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో విన్న విషయాన్ని ఇలా తెలియజేసారు:

**يَقُولُ إِنَّ الْمَلَائِكَةَ تَنْزِلُ فِي الْعَنَانِ وَهُوَ السَّحَابُ فَتَذْكُرُ الْأَمْرَ قُضِيَ فِي السَّمَاءِ فَتَسْتَرِقُ الشَّيَاطِينُ السَّمْعَ فَتَسْمَعُهُ فَتُوحِيهِ إِلَى الْكُهَّانِ فَيَكْذِبُونَ مَعَهَا مِائَةَ كَذْبَةٍ مِنْ عِنْدِ أَنْفُسِهِمْ .**
(رواه البخاري:**2971**)

**''దైవ దూతలు (దైవాజ్ఞల్ని తీసుకొని) మేఘాల మీదికి దిగి ఆకాశంలో జరిగిన నిర్ణయాల గురించి చెప్పుకుంటారు. షైతాన్ దొంగచాటుగా ఆ మాటలు విని జ్యోతిష్కులకు చేరవేస్తాడు. వారు వాటికి వంద అబద్ధాలు కల్పించి చెబుతారు.'' (బుఖారీ:2971)**

హ్జ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) కథనం; కొంత మంది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని జ్యోతిష్కుల దగ్గరకి వెళ్ళటం గురించి అడిగారు. అందుకాయన అదంతా భ్రమా అని చెప్పారు. వారు మళ్ళీ **''కాని దైవప్రవక్తా! వారు చెప్పేది ఒక్కోసారి నిజంగా జరుగుతుంది?''** అని సందేహపడ్డారు. అప్పుడాయన ఇలా వివరించారు: **ఆ (ఒక్క) నిజమైన మాటను జిన్నులు (దైవ దూతల దగ్గర్నుంచి) ఎత్తుకెళ్ళిపోయి, తమ స్నేహితుని (జ్యోతిష్కుని) చెవిలో వేస్తాయి.** అతను దానికి వంద అబద్ధాలు కలిపి చెపుతాడు. (బుఖారీ:7006)

అంటే; మాంత్రికులు మరియు జ్యోతిష్కులు ఏదోఒక్క అగోచర విషయాన్ని షైతాన్ ద్వారా గ్రహించిన విషయంతో, మరి కొన్ని అబద్ధపు విషయాలను జోడించి, తమ నోటి పదజాలాల బలంతో ప్రజలను నమ్మేటట్లు చేస్తారు. అందుకనే ఇస్లాం ధర్మంలో జ్యోతిష్కుల వద్దకు పోయి వారి మాటలను

విశ్వసించడం మహా పాపంగా భావించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

مَنْ أَتَى عَرَّافًا فَسَأَلَهُ عَنْ شَيْءٍ لَمْ تُقْبَلْ لَهُ صَلَاةٌ أَرْبَعِينَ لَيْلَةً (رواه مسلم:**4173**)

**"ఎవరైతే జ్యోతిష్కుని వద్దకు వెళ్ళి అతన్ని ఏదయినా అడిగి అతను చెప్పేదాన్ని నిజమని భావిస్తే, నలభ్భై రాత్రుల వరకు అతని నమాజ్ అంగీకరించబడదు."** (ముస్లిం:4173)

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు: **"ఎవరైతే కాహిన్ (అగోచర జ్ఞానం ఉందని చెప్పుకునేవాని) వద్దకు వచ్చి అతను చెప్పిన మాటలను ధృవీకరిస్తే, అతను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ప్రసాదించిన ధర్మ శాస్త్రాన్ని తిరస్కరించాడు."**

(అబూదావూద్:4/225, తిర్మిజీ:1/418)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

مَنْ أَتَى كَاهِنًا أَوْ عَرَّافًا فَصَدَّقَهُ بِمَا يَقُولُ فَقَدْ كَفَرَ بِمَا أُنْزِلَ عَلَى مُحَمَّدٍ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ (مسند أحمد:**9171**–حاكم)

**"ఎవరైతే జ్యోతిష్కుని వద్దకు లేక కాహిన్ (అగోచర జ్ఞానం ఉందని చెప్పుకునేవాడు) వద్దకు వచ్చి అతను చెప్పిన మాటలను ధృవీకరిస్తే, అతను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ప్రసాదించిన ధర్మ శాస్త్రాన్ని తిరస్కరించాడు."**(ముస్నద్ అహ్మద్: 9171)

మరియు ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైతే శకునాలు చేస్తాడో, లేక శకునాలను నమ్ముతాడో, లేక జ్యోతిష్కుడనీ చెప్పుకుంటాడో లేక అతనిని నమ్ముతాడో, లేక మాంత్రికునిగా మారుతాడో, లేక

మాంత్రికుల వద్ద మంత్రించుకుంటాడో అతను మనలోనివాడు (ముస్లిం) కాడు.

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు: **''ఎవరైతే 'కాహిన్' వద్దకు వచ్చి అతను చెప్పిన మాటను ధృవీకరిస్తే అతను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ప్రసాదించిన ధర్మ శాస్త్రాన్ని తిరస్కరించాడు.''**

(తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3044, రవాహు బజ్జార్ బిఇస్నాదిన్ జయ్యిద్)

మాంత్రికులను మరియు జ్యోతిష్కులను నమ్మడం, వారు చెప్పే విషయాలను ధృవీకరించడం, వారి ఆదేశాల మేరకు అనుసరించడం మహా అజ్ఞానంతో కూడుకున్న విషయం. మరియు ముస్లిం సోదరులు తమ ప్రాణాలకంటే ఎక్కువగా విలువిచ్చే ఇస్లామీయ విశ్వాసానికి అవి కీడుగా మారుతుందన్న విషయాన్ని మరిచిపోకూడదు. దాని కారణంగా మనం చేసిన పుణ్యాలు కూడా నాశనమవుతాయి.

# 21- సమాజంలో విస్తరించిన కొన్ని బిద్అత్ కార్యాలు

మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు చేసే ఆచారాలలో కొన్ని బిద్అత్ కార్యాలను జొప్పించి వాటిని పట్టుదలగా అనుసరిస్తున్నారు. వాటిలో కొన్నిటిని మీ ముందు సంక్షిప్తంగా తెలియజేస్తున్నాము.

1- **పుట్టిన పిల్లలను ఏడవ రోజు పేరు పెట్టి,** అబ్బాయి గనక ఉంటే రెండు పొట్టేళ్ళను మరియు అమ్మాయి గనక ఉంటే ఒక పొట్టేలును ఖుర్బాని చేయడం ధర్మ సాంప్రదాయం. దానిని ఇస్లామీయ పరిభాషలో **'అఖీఖా'** అని అంటారు.

కాని మనలో అనేక మంది ప్రజలు 'పిల్లలను ఉయ్యాలలో ప్రవేశపెట్టే ఆచారాన్ని, మరియు నలభై రోజుల తరువాత చేసుకునే ఆచారాలను, బంధుమిత్రులను ఆహ్వానించి విందు పార్టీలను ఏర్పాటు చేస్తారు. ఇలా ధర్మంగా లేని ఆచారాలను పాటించడానికి పోటీలు పడి జరుపుకుంటున్నారు.

2- **సున్తీ చేసుకోవడం ధర్మ సంబంధమైన సాంప్రదాయం.**

కాని కొంత మంది ప్రజలు సున్తీ చేస్తే ధర్మంలో లేని అనేక కార్యకలాపాలు నిర్వహిస్తారు. అలాగే అమ్మాయిలు పెద్దవయస్సుకు చేరితే **'సాంగ్యం'** జరపాలంటూ తమ బంధుమిత్రులను పిలిచి, వివిధ కార్యాకలాపాలు నిర్వహిస్తారు. మరియు విందు భోజనాల ఏర్పాటు చేస్తారు. కనుక ధర్మం కాని ఆచారాల కొరకు ధనాన్ని ఖర్చు చేయడం వలన మరియు ధర్మానికి విరుద్ధంగా ఆచరించినందు వలన పాపాలకు గురికాబడతారు.

**3- వివాహం (నికాహ్)జరిగిన తరువాత పెళ్ళికొడుకు** వలీమా విందు కొర్కై బంధుమిత్రులను ఆహ్వానించడం ధర్మ పరమైన సాంప్రదాయం.

కాని వివాహానికి ముందు మరియు వివాహానికి తరువాత అనేక అధర్మమైన మరియు ధర్మేతరుల కార్యాకలాపాలు నిర్వహిస్తుంటారు. ఉదాహరణకు; వివాహానికి ముందు రోజు **షుక్రాన** పేరుతో **షుక్రానేకి రస్మ్** చేస్తారు, వివాహం రోజు ఉదయం అనేక రకమైన స్వీట్స్ మరియు వంటకాలు చేసి **'టిఫన్ విందు'కు** ఆహ్వానిస్తారు. నికాహ్ కొర్కై పెళ్ళికొడుకు మెడలో పూల దండలతో ముంచేస్తారు. నడుముకు కొబ్బెర చిప్ప, చేతికి **'ఇమామ్ జామిన్'** (ఎర్రని లేక పచ్చని పేలికలో రుపాయి బిళ్ళలను చుట్టి) కట్టుతారు. మరియు బాజా భజంత్రీలతో ఊరేగిస్తూ, హంగామా చేస్తూ వివాహం జరుపుతారు.

మరియు పెళ్ళికూతురు మెడలో కాలిపోత్ పేరున **నల్లపూసల దండ** తొడిగిస్తారు, కాలి వ్రేళ్ళలో మెట్టలు ధరింపజేస్తారు. వలీమా విందు తరువాత **'జుల్వేకి రసం'** (తలంబ్రాలు) అంటే పెళ్ళికూతుర్ని మరియు పెళ్ళి కొడుకుని అందరి సమక్షంలో కూర్చోపెట్టి వారిచేతులతో ఒకరి తలపై మరొకరు బియ్యం వేసుకునే ధర్మేతరుల సాంప్రదాయాన్ని నిర్వహిస్తారు. మరియు **ఆ రాలిన బియ్యాన్ని తీసుకొని వివాహం కాని స్త్రీల తలలపై మరియు పురుషుల తలలపై విసురుతారు. అలా విసరడం వలన వారి వివాహాలు తొందరగా జరుగుతాయని నమ్ముతారు.** పెళ్ళి తరువాత ఐదు వారాల వరకు **'జుమాగీ'** అంటూ ప్రత్యేకమైన రాకపోకలు మరియు గౌరవాలు ఉంటాయి. అమ్మాయి గర్భవతి అయిన ఏడు నెలల తరువాత **'సత్వాస' (సీమంతం)** పేరున అమ్మాయి తల్లిదండ్రులు వంటకాలు చేసి

అమ్మాయి అత్తవారి ఇంటకి తీసుకొని వచ్చే ధర్మేతర ఆచారాలను పాటిస్తారు. మరియు మన ముస్లిం సమాజం తమ ధర్మాని లెక్క చెయ్యకుండా ఈ ఆచారాలను పట్టుదలగా అనుసరిస్తున్నారు.

**4- మనిషి మరణించిన తరువాత ధర్మ పరంగా ఖననం చేయాలి.** తరువాత వారి మేలు కొర్కై దుఆ చేయాలి, మరియు ఆ వ్యక్తి వసీయత్ చేసి ఉంటే దానిని నెరవేర్చాలి. మరియు మరణించిన వ్యక్తి పేరుతో మదరసాలు, మసీదులు, వీధి కులాయిలు, బోర్లు వంటి సామాజిక పుణ్యకార్యాలు చేయడం ధర్మ పరమ్మైన సాంప్రదాయం.

కాని కొంత మంది ప్రజలు వారి బంధుమిత్రులలో ఎవరైనా మరణిస్తే ప్రతి ఒక్కరు నలభై రోజుల పాటు శోకాన్ని పాటిస్తారు. వారు సాధారణమైన (శాఖాహారం) భోజనం తింటారు. మాంసము మరియు బిరియాని వంటి భోజనం తమపై నిషేధించుకుంటారు. నలభై రోజుల వరకు తల వెంట్రుకలు మరియు గడ్డాలను పెంచుకుంటారు. క్రొత్త దుస్తులు ధరించరు. వారిలో వివాహం చేయవలసిన తేదీలు దగ్గరలో ఉన్నా నలభై రోజుల తరువాతే చేస్తామని వాయిదాలు వేస్తారు. మనిషి మరణించిన తరువాత మూడు రోజులకు, నలభైరోజులకు ఆరు నెలలకు మరియు సంవత్సరాని ఒక్కసారి కొంత మందిని పిలిపించి ఖుర్ఆన్ పారాయణ సభలు నిర్వహిస్తారు. మరియు ఫాతిహాలు జరిపిస్తారు. శ్రాధకర్మ పేరుతో సియర్ అంటూ కొన్ని కథల సభలు నిర్వహిస్తారు. ఇలా అనేక రకాలుగా ఇస్లాం ధర్మంలో లేని ఆచారాలను క్రొత్తగా జొప్పించి విధిగా పాటిస్తారు.

**5- శ్మశానంలో మృత్యువును ఖననం చేసిన తరువాత అతని మేలు కొరకు దుఆ చేయడం ధర్మం.**

కాని శ్మశానంలో నమాజ్ చెయ్యడం, అజాన్ చెప్పడం, ఖుర్ఆన్ పారాయణం చేయడం వంటి ఇతర ఆరాధనలు నిషేధించబడినవి.

**6- కొంత మంది ప్రజలు 'పెద్దల పండుగ' (బడోంకి ఈద్ లేక ముర్దోంకి ఈద్)** పేరున షబేబరాత్ రోజు మరియు **బక్రీద్ పండుగ రోజు** అనేక రకాల పండ్లు, ఫలాలు, అన్నపానియాలు మరియు ఇతర వస్తువులు ఒక గదిలో పెట్టి సాంబ్రాణి పొగలు రేకెత్తించి ఫాతిహాలు చేస్తారు. ఖుర్ఆన్ నుండి ప్రత్యేకమైన సూరాలను వందల సార్లుగా పఠించి, వారి కొరకు ఆ పుణ్యాన్ని సమర్పించుకొన్నట్లుగా భావిస్తారు. మరియు ఆ రోజులను పెద్దల శ్రేయస్సు కొరకై చేసే పండుగలుగా భావిస్తారు. మరియు కొంత మంది ప్రజలు పెద్దల శ్రేయస్సు కొరకు తమ బంధుమిత్రుల సమాధులను ప్రత్యేకంగా సందర్శిస్తారు. వారి పేరున ఫాతిహాలు చేస్తారు, ఆ సమాధులపై దీపాలు, అగర బత్తీలు వెలిగిస్తారు, తీపు వస్తువులు కూడా పంచి పెడ్తారు. ఇలా ఇస్లాం ధర్మంలో లేనటువంటి అనేక విధాల నూతన ఆచారాలు కల్పించుకొని అనుసరిస్తున్నారు.

7- **శ్మశాన సందర్శనం;** మనిషిలో పరలోక చింతనను కలిగించి, తనలో భయభక్తిని పెంపొందించి, చనిపోయినవారి మన్నింపుకై వేడుకోవటానికి సమాధుల సందర్శనం అనేది ధర్మ సాంప్రదాయం.

కాని కొంత మంది ప్రజలు సమాధుల వద్ద ఫాతిహాలు మరియు ఇతర అధర్మ ఆచారాలు చేయటానికి వెళ్ళుతుంటారు. మరియు ఆ గోరీలను పటిష్టవంతం చేస్తారు. ఆ గోరీల వద్ద ఒక బండ పలకపై ఖుర్ఆన్ ఆయతులు మరియు వారి పేర్లను జనన మరణాల తేదీలను ముద్రించి స్థాపిస్తారు. ఇంకా అనేక అధర్మమైన ఆచారాలను పాటిస్తారు.

# 22- ఇస్లాం ధర్మానికి సంబంధంలేని కొన్ని పండుగలు

నేటి సమాజంలో రోజు రోజుకు మనిషి నాగరికతకు సంబంధించిన ఏదోఒక పేరుతో పండుగలను జరుపుకునే సంస్కృతి వచ్చింది. మరియు ఆ పండుగలు జరిపే విధానం అధర్మ రీతిలోనే కాకుండా, మానవ నైతిక గుణాలకు పూర్తిగా వ్యతిరేకంగా కూడా ఉన్నాయి. కనుక అలాంటి పండుగలను ముస్లిం సమాజం నిర్వహించరాదని ఇస్లామీయ పండితులు ఫత్వాలు జారి చేసారు. ఆ పండుగలలో నుండి ఒక పండుగ వాస్తవాన్ని ఇక్కడ మేము తెలియజేస్తున్నాము. కనుక మన ముస్లిం సమాజం అధర్మమైన సంస్కృతి నుండి అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము.

## ప్రేమికుల రోజు

### వాలెంటైన్స్ డే అంటే...?

ప్రేమానురాగాలు పరిమళించే, ప్రేమ కుసుమాలు గుభాళించే శుభ దినం అని అంటారు కొందరు. అయితే ఈ రోజు వెనుక గల కథనాలేమిటో తెలుసా?

**1) రోమ్ దేశస్థులు ప్రతి ఏటా పిబ్రవరి 14వ తేదిని (యూనొ) అనే స్త్రీ దేవత కొరకు మహత్తరమైన శుభ దినంగా భావిస్తారు.** వారు ఆమెను తమ దేవీలకు రాణిగా ఆరాధిస్తారు. వివాహం చేసుకునేవారి కోసం శుభ సూచకం అని నమ్ముతారు.

**2) క్లోడియస్ 11వ పరిపాలన కాలంలో వాలెంటైన్ అనే వ్యక్తి ఉండేవాడు.** పెళ్ళి, పిల్లలు, సంసారం మనిషిని పిరికివాణ్ణి చేసాయి అని తలచిన అప్పటి రాజు యుద్ధం నిమిత్తం సైనికులు పెళ్ళి చేసుకోకూడదన్న ఆజ్ఞ జారీ చేసాడు. వాలెంటైన్ అనే వ్యక్తి రాజుకి తెలియకుండా రహస్య పెళ్ళిళ్ళు జరిపించేవాడు. అది తెలుసుకున్న రాజు అతన్ని పట్టుకొని క్రీశ. 270వ సంవత్సరం ఫిబ్రవరి 14వ తేది లూబెర్ కీలియా అనే రోము దేశస్థులు పండుగ రాత్రి ఉరి తీయించాడు. అప్పటి నుండి వాలెంటైన్ పేరుతో పండుగ జరుపుకోవడం పరిపాటయింది. ఆ తర్వాత 1996లో స్వయంగా చర్చ్ గురువులే ఈ పండుగ అశ్లీలతను, నీతిబాహ్యతను పెంపొందించే విధంగా ఉందని భావించి బహిష్కరించారు కూడా.

అయితే నేడు అనేక దేశాలలో ముస్లింలు సైతం ఈ పండుగ సంబరాల్లో పాల్గొనడం మనం చూస్తాం. ఇతర మతాలు ఈ పండుగను ఏ దృష్టితో చూస్తున్నాయి అన్న విషయం అప్రధానం. ఇస్లాం మాత్రం ఇటువంటి నీతికి అనుమతించదు. నిజంగా చెప్పాలంటే ఇలాంటి వెకిలి చేష్టలు, వెర్రి పోకడలు ముస్లిం సమాజానికే మాయని మచ్చ.

## ముస్లింలు వాలెంటైన్స్ డే ఎందుకు చేయకూడదు?

**ఇస్లాంలో పర్వదినం అంటే ఆరాధన,** పుణ్యార్జన మార్గం, పవిత్ర భావాల సమ్మేళనం. దైవ ప్రసన్నత కోసం, స్వర్గ ప్రాప్తి కోసం, పవిత్ర లక్ష్యంతో పర్వదినం జరుపుకోవాల్సి ఉంటుంది. పిచ్చిగా త్రాగి, పశువుల్లా బిహేవ్ చేయడం ఇస్లాం సంస్కృతి కానేకాదు. అదో పాశ్చాత్య దురాచారం. ఆ మాటకొస్తే ముస్లిం పండుగలు మూడే. రమజాన్ పండుగ, ఖుర్బానీ

పండుగ, శుక్రవారం. వీటిని మినహాయించి, స్వయంగా ముస్లింలలో ప్రాచుర్యంలో ఉన్న మీలాదున్ నబీగానీ, షబెబరాత్‌గానీ, పీనుగుల పండుగ (ముర్దొంకి ఈద్) గానీ, ఇతరత్రా ఉత్సవాలు, ఉరుసులుగానీ, ఇస్లాం ప్రభోదించని వింత పోకడలే. మరలాంటప్పుడు సరదా కోసం, సహజీవనం (వివాహేతర సంబంధం) కోసం నిర్వహించబడే పండుగలకు ఎలా వీలుంటుంది?

**కొందరు ముస్లింలు –** మేము ఈ ఉత్సవంలో, ఇది ఇస్లామీయ పండుగ అన్న భావంతో పాల్గొనడం లేదు. పరస్పరం ప్రేమాభిమానాలను పంచుకునేందుకు పాల్గొంటున్నాము అంతే అనంటారు. వారి ఈ వాదన పస లేనిది. ఎందుకంటే? ఈ పండుగ మున్మాటికి రోమ్ దేశానికి చెందిన విగ్రహారాధకులది, యూద, క్రైస్తవులది అన్న విషయం తెలిసిందే. ఇందులో ముస్లింలు వెళ్ళి పాల్గొనడం ఎంత వరకు సహేతుకం? మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు:

**عَنْ ابْنِ عُمَرَ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ مَنْ تَشَبَّهَ بِقَوْمٍ فَهُوَ مِنْهُمْ (أبوداود)**

**"ఎవడు ఏ జాతి వేషధారణను(విధానాన్ని) అవలంభిస్తాడో వాడు వారిలో ఒకడుగా పరిగణించబడతాడు."** (అబూదావూద్: 2831)

## ప్రేమంటే ఇదేనా...?

పసుపు ఎరుపు గులాబీలు పట్టకొని రోడ్లపై పడి తిరుగడమా ప్రేమంటే...? అశ్లీల భావాలను రేకెత్తించేలా ఫ్యాషన్ దుస్తులు ధరించి కుర్రకారును రజింపజేయడమా ప్రేమంటే...? బోయ్/గర్ల్ ఫ్రెండ్‌తో కలిసి కామోన్మాదంతో రగిలిపోతూ చిందులు తొక్కడమా ప్రేమంటే...? ఇంట్లో నుంచి పారిపోయి సహజీవనం (అక్రమ సంబంధం) సాగించడమా

ప్రేమంటే...? ఇదే ప్రేమంటే 'ప్రేమ పవిత్రమైనది' అని చెప్పడమైనా మానుకోవాలి. లేదా ఇలాంటి నీచ నికృష్ట చేష్టల్ని కూకటి వేళ్ళతో పెకళించాలి. నిజంగా చెప్పాలంటే ఇవన్నీ కూడా సిగ్గూ, లజ్జ, అభిమానాన్ని, నీతిని తగులబెడుతున్న సినిమాల చేదు ఫలం మాత్రమే. షైతాన్, షైతాన్ మనస్తత్వం గల మనుషులు, 'మీరెప్పుడైనా లవ్‌లో పడ్డారా?' అని కవ్విస్తారు. ఈ మాయదారి ట్రిక్కుల్ని అందిపుచ్చుకోమని మనల్ని ఉసిగొల్పుతారు. తల్లిదండ్రులు చూడటం లేదు లేదా వారే దీనికి ఆజ్యం పోస్తున్నారు అన్న అంశాన్ని ప్రక్కనబెడితే – అల్లాహ్ చూస్తున్నాడన్న భయం కలగటం లేదా? రేపు దేవుడు ఖచ్చితంగా దీని గురించి నిలదీస్తాడన్న ఆలోచన రావడం లేదా?

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హితోపదేశం చేసారు:

**لَا تَقُومُ السَّاعَةُ حَتَّى تَأْخُذَ أُمَّتِي بِأَخْذِ الْقُرُونِ قَبْلَهَا شِبْرًا بِشِبْرٍ وَذِرَاعًا بِذِرَاعٍ فَقِيلَ يَا رَسُولَ اللَّهِ كَفَارِسَ وَالرُّومِ فَقَالَ وَمَنْ النَّاسُ إِلَّا أُولَئِكَ** (رواه البخاري:**6774**)

''గతించిన జాతులు చేసిన నీతిమాలిన పోకడలకు నా ఉమ్మత్ (సముదాయం) జేనడకు జేనెడు, మూరకు మూర అలవాటుపడనంత వరకు ప్రళయం సంభవించదు''. అది విన్న మేము (సహాబాలు) **'యా రసూలల్లాహ్!** ఏమిటి మేము **'రోమ్'** మరియు **'ఈరాన్'** ప్రజలను అనుసరిస్తామా?' అని అన్నాము. అందుకు ''వారు తప్ప మరెవర్ని అనుకుంటున్నారు?'' అని సమాధానమిచ్చారు. (బుఖారీ:6774)

పరమ పవిత్రుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ لَا تَجِدُ قَوْمًا يُؤْمِنُونَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْءَاخِرِ يُوَآدُّونَ مَنْ حَآدَّ ٱللَّهَ وَرَسُولَهُۥ وَلَوْ كَانُوٓا۟ ءَابَآءَهُمْ أَوْ أَبْنَآءَهُمْ أَوْ إِخْوَٰنَهُمْ أَوْ عَشِيرَتَهُمْ ۚ ﴾ المجادلة: ٢٢

**''అల్లాహ్‌ను పరలోకాన్ని విశ్వసించినవారు అల్లాహ్‌పై, ఆయన ప్రవక్తపై తిరుగుబాటు చేస్తున్నవారిని ఎన్నటికీ ప్రేమించరు. చివరికి వారు తమ తండ్రులైనా, కొడుకులైనా, సోదరులైనా లేదా తమ కుటుంబ సభ్యులైనా సరే, ససేమిరా ప్రేమించరు. అలా ప్రేమించడాన్ని నీవు ఎన్నటికీ చూడలేవు''.** (సూరతుల్ ముజాదిలా:22)

మానవుల్లో ఒండొకరి పట్ల ప్రేమ, అభిమానం, గౌరవం ఉండవచ్చు. ఆ మాటకొస్తే పశువుల్ని, ఇతరత్రా జీవరాసుల్ని సైతం ప్రేమించమంటుంది ఇస్లాం. అలా ప్రేమించలేనివారు పరిపూర్ణ విశ్వాసులు కారు అని కూడా ఖరారు చేస్తుంది. కానీ నిజమైన ప్రేమ, అభిమానం మాత్రం మనందరి సృష్టికర్త అయిన అల్లాహ్ మేదే ఉండాలి. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

﴿ وَٱعْبُدُوا۟ ٱللَّهَ وَلَا تُشْرِكُوا۟ بِهِۦ شَيْـًٔا ۖ وَبِٱلْوَٰلِدَيْنِ إِحْسَٰنًا وَبِذِى ٱلْقُرْبَىٰ وَٱلْيَتَٰمَىٰ وَٱلْمَسَٰكِينِ وَٱلْجَارِ ذِى ٱلْقُرْبَىٰ وَٱلْجَارِ ٱلْجُنُبِ وَٱلصَّاحِبِ بِٱلْجَنۢبِ وَٱبْنِ ٱلسَّبِيلِ وَمَا مَلَكَتْ أَيْمَٰنُكُمْ ۗ إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ مَن كَانَ مُخْتَالًا فَخُورًا ﴿٣٦﴾ ﴾ النساء: ٣٦

''మరియు మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. మరియు ఎవ్వరినీ ఆయనకు భాగస్వాములుగా సాటి కల్పించకండి. మరియు తల్లిదండ్రులతో, దగ్గరి బంధువులతో, అనాథులతో, నిరుపేదలతో, బంధువులైన పొరుగు వారితో, అపరిచితులైన పొరుగు వారితో, ప్రక్కనున్న మిత్రులతో, బాటసారులతో మరియు మీ అధీనంలో ఉన్న బానిసలతో అందరితోనూ ఉదార

స్వభావంతో వ్యవహరించండి. నిశ్చయంగా అల్లాహ్ గర్వితుణ్ణి, బడాయిాలు చెప్పుకునే వాణ్ణి ప్రేమించడు'' (సూరతున్ నిసా: 36)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మీరు పరస్పరం కరుణతో మెలగనంత వరకు విశ్వాసులు కాలేరు'' అది విన్న సహచరులు **'యా రసూలల్లాహ్!** మేమందరం పరస్పరం కరుణతోనే మసులుకుంటున్నాము కాదా! అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ''మీ ఈ పరస్పర కరుణవాత్సల్యాలు కేవలం మీ ఆప్తుల వరకే పరిమితం కాకూడదు. **'రహ్మతన్నాసి'** సమస్త మానవుల పట్ల కనికరం కలిగి ఉండాలి. **'రహ్మతన్ ఆమ్మహ్'** విశ్వమంతటి ప్రాణుల పట్ల సాత్విక కరుణతో మెలగాలి'' అన్నారు. (సహీహ్ తర్గీబ్:2253)

మరో హదీసులో ఇలా ఉంది: ''ఒక బంధువు ఉపకారం చేస్తే ప్రతిగా ఉపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాడు. తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాన్ని కొనసాగించే వాడే (సిసలైన) బంధుప్రియుడు''. (బుఖారీ)

## అల్లాహ్ పట్ల ప్రేమంటే...?

ఒక సారి ఒక పల్లెవాసి దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర సన్నిధికి వచ్చి- 'ప్రళయం ఎప్పుడొస్తుంది?' అని అడిగాడు. ''దాని కోసం నువ్వే ఏర్పాట్లు చేసుకున్నావు?'' అనడిగారు ప్రవక్త (స). దానికావ్యక్తి 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త గారిని ప్రేమించడం' అన్నాడు. అతని సమాధానం విని ''అయితే నీవు ఎవరిని ప్రేమిస్తున్నావో వారితోనే ఉంటావు'' అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు. (బుఖారీ, ముస్లిం)

ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: (ఓ ప్రవక్తా!) ఇలా అను: **''మీకు (నిజంగా) అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మరియు మీ పాపాలను క్షమిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలుడు, అపార కరుణప్రదాత''.**

(సూరతు ఆల ఇమ్రాన్:31)

మనకు ఏది మంచిదో, ఏది చెడ్డదో మనల్ని పుట్టించిన, 70 తల్లులకన్నా ఎక్కువ ప్రేమ గల పరమోన్నత ప్రభువుకి బాగా తెలుసు. మనం ఉత్తమ రీతిలో జీవితం గడపడానికి, ఇంకా ఇహపరాల్లో సాఫల్యం పొందడానికే ఆయన మనకు ఆజ్ఞలు ఇచ్చాడు. ఒక వేళ మనం వాటిని నిర్లక్ష్యం చేస్తే దాని దుష్ఫలితాలను తప్పకుండా మనం అనుభవించాల్సి ఉంటుంది.

**ఈ నాడు మనం....**

**పాశ్చాత్య సంస్కృతి వెర్రి తలలు వేస్తున్నది. సమాజమంతా కలుషితమై పోతున్నది. విచిత్రమేమిటంటే మన ఇళ్ళకు మనమే నిప్పు పెట్టి మనమే ఆనందిస్తున్నాము. ఎంత విడ్డూరం!**

పాశ్చాత్య దేశాలు దైవాజ్ఞల్ని ఉల్లంఘించి తమ సొంత జీవన విధానాలను అనుసరించాయి. దాని దుష్పరిణామాలను నేడు తమ కళ్ళారా చూస్తున్నారు. వారు మాత్రమే కాదు మొత్తం ప్రపంచం దాని దుష్ఫలితాలను చూస్తోంది.

**నా ప్రియ సోదర సోదరిమణులారా!** మనం స్తుతిని మాని ఆత్మ విమర్శ చేసుకోవలసిన తరుణమిది. మనం దేవుని చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే దాని చేదు ఫలాలు మన ముందు రాకుండా ఉంటాయా?

మనం దేవుని చట్టాలను ఉల్లంఘించి ఈ రోజు దాని దుష్ఫలితం ఏయిడ్స్ అనే ఒక పెద్ద రూపంలో చూస్తున్నాం. ఇదంతా కూడా నీతిబాహ్యత, అశ్లీలం లాంటి వ్యర్థ విషయాలతో నిండిన సంస్కృతిని ఆదరించిన పాప ఫలితమే.

మొత్తానికి చెప్పొచ్చేదేమిటంటే మనం నిజంగా దేవుణ్ణి ప్రేమిస్తున్నట్లయితే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పినట్లు మనం దైవాజ్ఞలకనుగుణంగా జీవితం గడపాలి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పట్ల మన ఈ నిజమైన ప్రేమే మనల్ని ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సఫలీకృతుల్ని చేయగలదు.

**అదే విధంగా మరి కొన్ని పండుగలు కూడా మన సమాజంలో వ్యాపించి ఉన్నాయి, వీటిలో నుండి ఏ ఒక్కటిని కూడా జరుపుకోవడం ధర్మం కాదు.**

1- **జన్మదిన వేడుకలు:** తమ పేరున లేక తమ పిల్లల పేరున లేక ఇతరుల పేరున జన్మదిన వేడుకలు నిర్వహించడం ఇస్లాం సంప్రదాయం కాదు. ఆ రోజు చేసే పార్టీలు, మరియు సంతోషాలు అంతా క్రైస్తువులు మరియు ధర్మేతరుల కార్యాలు.

2- **జనవరి ఫస్ట్;** జనవరి మొదటి తేదిన లేక డిసెంబర్ 31 రాత్రిని పండుగ దినంగా చేసేకోవడం, లేక ఒకరికొకరు ఆ రోజున విష్ చెయ్యడం వంటి కార్యాలన్ని నిషేధించబడ్డాయి.

3- **'మదర్స్ డే'** లేక ఫాదర్స్ డే (అమ్మా లేక నాన్న పండుగ) అనే పండుగలు మరియు వారికి విష్ చేసే విధానాలన్ని అధర్మమైనవి.

4- **'మేరెజ్ డే'** కొంత మంది ప్రజలు ప్రతి ఏట 'మేరెజ్ డే' (పెళ్ళి దినోత్సవం) చేసుకుంటారు. ఆ రోజు ఒకరికొకరు బహుమానాలతో విష్ చేసుకుంటారు. మరియు కొంత మంది పార్టీలు కూడా చేస్తారు.

5- **'ఏప్రిల్ ఫూల్'** ఈ పదంలోనే ఫూల్ అని పేర్కొనబడినది. ఆ రోజున ఇతరులతో అబద్దాలు పలికి మోసగించడం, ఆ రోజున ఎగతాళిగా జరుపుకోవడం పూర్తిగా అధర్మమైనది. ఇలాంటి అబద్ధమైన మాటలకు మరియు నవ్వులాటలకు ఇస్లామీయ ధర్మంలో ఎలాంటి స్థానం లేదు.

المحتوايات


1. منهج الاتباع في الإسلام
2. أهمية الامر بالمعروف والنهي عن المنكر
3. تعريف البدعة
4. معنى البدع في الإسلام
5. أقسام البدع
6. وقت ظهور البدع في هذه الأمة
7. أسباب ظهور البدع في هذه الأمة
8. حكم البدع وأنواعها
9. نماذج من البدع المعاصرة
10. حكم احتفال عيد ميلاد النبي صلى الله عليه وسلم وما يشبهه من احتفالات البدع
11. حكم التبرك بالأماكن والآثار أحياء أو أمواتا
12. البدع في العبادات و التقرب إلى الله
13. التوسل المشروع والممنوع
14. حقيقة شهر الله المحرم
15. فضل شهر الله المحرم والصوم فيه
16. فضل الحسن والحسين رضي الله عنهما
17. شهادة حسين في كربلاء
18. ماذا بعد كربلاء؟
19. صفة الحزن في المصيبة
20. حكم الغلو في الإسلام
21. الخرافات والبدع في الشهر المحرم
22. حكم احتفال عيد الخبز في مدينة نيلور (الهند)
23. حقيقة الطيرة
24. حقيقة شهر رجب
25. حكم الفاتحة بإسم الإمام جعفر الصادق في شهر رجب (المسمى بعيد القدور)
26. حكم احتفال معراج النبي صلى الله عليه وسلم
27. حقيقة معراج النبي النبي صلى الله عليه وسلم
28. حقيقة شهر شعبان
29. كيف كان يقضي النبي صلى الله عليه وسلم شهر شعبان
30. حكم الصيام بعد نصف الشهر من شعبان
31. بعض البدع في شهر شعبان
32. بعض أحاديث الضعيفة في فضل شعبان
33. حقيقة العيد (باسم العرس) في المقابر
34. كيف يتزين المقبرة(القبر) في العرس
35. كيفية احتفال العرس لصاحب القبر
36. حقيقة أحوال المجاورين(صوفي الذي يجلس عند القبر)
37. حكم البناء والجلوس على القبور
38. حكم التمائم
39. معنى التمائم
40. النهي عن تعليق التمائم
41. حكم الرقى
42. يجوز الرقى مالم يكن شركا
43. حقيقة السحر
44. حكم الكهنة والعرافين
45. حكم بعض الخرافات والرسوم الفاسدة في عصر الحاضر
46. حكم عيد الحب وعيد الأم وغيره